PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 43 సంచిక : 86 | విజయవాడ, శుక్రవారం 27 అక్టోబర్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5. 50
Vol No | Vijayawada, Friday 27 October 2023 | Rs

దొడ్డిదారిలో కార్పొరేట్ సేద్యం

- బేయర్, అమెజాన్‌తో ఐకార్ ఒప్పందం
- రద్దు చేయాలని కిసాన్ సభ డిమాండ్

7

ఇంగ్లండ్‌కు మరో షాక్

- శ్రీలంక చేతిలో ఓటమి

8

8 మంది భారత నేవీ మాజీ అధికారులకు
మరణశిక్ష

- ఖతర్ కోర్టు తీర్పు
- కేంద్ర విదేశాంగశాఖ దిగ్భ్రాంతి

న్యూఢిల్లీ : భారత నౌకాదళానికి చెందిన ఎనిమిది మంది మాజీ అధికారులకు ఖతర్ కోర్టు గురువారం మరణ శిక్ష విధించింది. వీరంతా కొన్ని నెలల నుంచి ఖతర్ అధికారుల నిర్బంధంలో ఉన్నారు. గూఢచార్యం ఆరోపణలపై వీరికి కోర్టు మరణ శిక్ష పడినట్లు సమాచారం. ఎనిమిది మంది భారతీయులకు ఖతర్ కోర్టు మరణ శిక్ష విధించడంపై కేంద్ర విదేశాంగశాఖ స్పందించింది. 'మేము తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాం, వివరణాత్మక తీర్పు కోసం ఎదురు చూస్తున్నాం' అని ఒక ప్రకటనలో తెలిపింది. 'అల్ దహ్రా కంపెనీకి చెందిన 8 మంది భారతీయ ఉద్యోగులకు సంబంధించిన కేసులో ఖతర్ ఫస్ట్ ఇన్‌స్టాన్స్ కోర్టు ఈ రోజు తీర్పు వెలువరించినట్లు మాకు ప్రాథమిక సమాచారం ఉంది' అని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది.

'బాధిత కుటుంబ సభ్యులు, న్యాయ బృందంతో సన్నిహితంగా ఉన్నాము, అన్ని చట్టపరమైన ఎంపికలను అన్వేషిస్తున్నాం' అని భారత విదేశాంగశాఖ తెలిపింది. ఈ కేసుకు అధిక ప్రాముఖ్యత ఇస్తున్నట్లు, సన్నిహితంగా పరిశీలిస్తున్నట్లు తెలిపింది. ఈ కేసు గోప్యత స్వభావం కారణంగా, మరిన్ని వివరాలు చెప్పడం సరికాదని తెలిపింది. కాగా, భారత నేవీ మాజీ అధికారులు కెప్టెన్ నవతేజ్ సింగ్ గిల్, కెప్టెన్ బీరేంద్ర కుమార్ వర్మ, కెప్టెన్ సౌరభ్ వశిష్ట్, కమాండర్ అమిత్ నాగ్‌పాల్, కమాండర్ పూర్ణేందు తివారీ, కమాండర్ సుగుణాకర్ పాకాల, కమాండర్ సంజీవ్ గుప్తా, నావికుడు రాగేష్‌ను ఖతర్ ఇంటెలిజెన్స్ సర్వీస్ గతేడాది ఆగస్టు 30న దోహాలో అరెస్టు చేసింది. అయితే వీరిపై అభియోగాలు ఖతర్ అధికారులు వెల్లడించలేదు. సబ్‌మెరైన్ కార్యక్రమాల్లో గూఢ చార్యానికి పాల్పడ్డారనే ఆరోపణలతో వీరిని నిర్బంధించినట్లు సమాచారం. అరెస్టయిన వారంతా అల్ దహ్రా సంస్థలో పనిచేస్తున్నారు. ఖతర్ సాయుధ దళాలకు శిక్షణ, ఇతర సేవలు అందించే ఈ సంస్థను ఒమన్‌కు చెందిన ఒక మాజీ వైమానిక దళం అధికారి నిర్వహిస్తున్నారు.

అరెస్టయిన మాజీ అధికారులకు భారత అధికారులతో మాట్లాడేందుకు ఖతర్ అనుమతి ఇచ్చింది. వీరితో విదేశాంగశాఖ అధికారులు మాట్లాడటంతోపాటు ఖతర్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపారు. అలాగే పలుమార్లు బెయిల్‌కు కూడా ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. వీరి నిర్బంధాన్ని ఖతర్ ప్రభుత్వం పొడిగిస్తూ వచ్చింది. ఈ క్రమంలోనే ఎనిమిది మందికి గురువారం ఖతర్ న్యాయస్థానం మరణ శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించింది.

ఎటుచూసినా కన్నీటిధారలే!

దక్షిణ గాజా స్ట్రిప్‌లో ఖాన్ యూనిస్‌లోని ఒక ఆసుపత్రిలో గాయపడ్డ చంటిబిడ్డను గుండెలకు హత్తుకొని విలపిస్తున్న క్షతగాత్రుడైన తండ్రి. 20 రోజులుగా గాజాపై ఇజ్రాయిల్ జరుపుతున్న వైమానిక దాడుల్లో ఇప్పటి వరకు ఏడు వేల మంది వరకు పౌరులు గాజాలో చనిపోయారు. వీరిలో 3000 మంది చిన్నారులున్నట్లు పాలస్తీనా అధికారులు వెల్లడించారు.)

(వార్త 7వ పేజీలో)

కాల్‌డేటా ఇవ్వలేం

- ఏసిబి కోర్టులో సిఐడి అఫిడవిట్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అరెస్టు సందర్భంగా కేసుకు సంబంధించి విధుల్లో వున్న సిఐడి అధికారుల కాల్‌డేటా ఇవ్వలేమని సిఐడి ఎసిబి కోర్టుకు తెలిపింది.

అరెస్ట్ సందర్భంగా విధుల్లో ఉన్న అధికారుల కాల్‌డేటా కావాలని కోరుతూ చంద్రబాబు తరపు లాయర్లు దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం ఎసిబి కోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా అఫిడవిట్ దాకలు చేసిన సిఐడి అధికారులు అలా ఇవ్వడం గోప్యతకు భంగం కలిగించినట్టు అవుతుందని పేర్కొన్నారు. సెప్టెంబరు 8న అర్ధరాత్రి దాటాక చంద్రబాబును సిఐడి అధికారులు అరెస్టు చేశారని ఆ నేపథ్యంలో వెనుకా, ముందు వేళల్లో అధికారుల కాల్‌డేటా ఇవ్వాలని చంద్రబాబు న్యాయవాదులు కోరారు. అరెస్టు సమయంలో సిఐడి అధికారులు బయటి వ్యక్తుల్ని ఫోన్ ద్వారా సంప్రదించారని, ఆ వివరాలు తెలిస్తే అరెస్టులో కీలక విషయాలు బయటపడతాయని వాదించారు. దర్యాప్తు సమయంలో కేసుకు సంబంధించి అధికారులు పలువురిని సంప్రదిస్తుంటారని, అలాంటి డేటాను ఇవ్వడం అధికారుల గోప్యతకు భంగమని, ఆ ప్రభావం విచారణపై పడుతుందని సిఐడి తరపు న్యాయవాది కౌంటర్ పిటిషన్‌లో పేర్కొన్నారు. సిఐడి అధికారుల భద్రతకు సమస్యలు వస్తాయని సిఐడి తెలిపింది. వాదనల అనంతరం తదుపరి విచారణను ఎసిబి కోర్టు శుక్రవారానికి వాయిదా వేసింది.

హౌస్ మోషన్ పిటిషన్ తిరస్కరణ

మధ్యంతర బెయిల్ కోసం అత్యవసరంగా విచారణ జరపాలని కోరుతూ చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన హౌస్‌మోషన్ పిటిషన్‌పై విచారణ చేపట్టేందుకు మిగతా 2లో

వలస విషాదం

కర్ణాటక చిక్‌బళ్లాపూర్‌లో ఘోర ప్రమాదం

- లారీని ఢీకొన్న సుమో
- 13 మంది దుర్మరణం
- 10 మంది సత్యసాయి జిల్లా, ముగ్గురు కర్ణాటక వాసులు

నుజ్జునుజ్జయిన వాహనం

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

వలస కూలీల ఇంట విషాదం చోటుచేసుకుంది. రెక్కాడితే గాని డొక్కాడని వారి జీవితాలు రోడ్డు ప్రమాదం రూపంలో బలయ్యాయి. శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం నుంచి గురువారం వేకువ జామున 15 మంది వలస కూలీలతో బయల్దేరిన సుమో కర్ణాటక రాష్ట్రం, చిక్‌బళ్లాపూర్ జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఢీకొన్నది. ఏడుగురు అక్కడికక్కడే మరణించగా, ఆరుగురు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. మృతుల్లో పది మంది శ్రీసత్యసాయి జిల్లా వాసులు కాగా, ముగ్గురు కర్ణాటక ప్రాంతం వాసులున్నారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సత్యసాయి జిల్లా పరిధిలోని పలు గ్రామాలకు చెందిన కూలీలు పనుల నిమిత్తం బెంగళూరుకు వలస వెళ్తుంటారు. దసరా పండుగ సందర్భంగా ఐదు రోజుల క్రితం వారి స్వగ్రామాలకు వచ్చారు. పండుగ అనంతరం తిరిగి పనుల కోసం బెంగళూరుకు పయనమయ్యారు. ఈ క్రమంలో గోరంట్ల మండలం కలిగిరి గ్రామానికి చెందిన సుమో డ్రైవర్ హరిజన నరసింహులు (45) గురువారం వేకువజామున నాలుగు గంటల సమయంలో 11 మంది వలస కూలీలలో గోరంట్ల నుంచి బెంగళూరుకు బయలుదేరారు. మార్గమధ్యంలో మరో నలుగురిని ఎక్కించుకున్నారు. తెల్లవారుజామున పొగమంచు ఉండడంతో చిక్‌బళ్లాపూర్ జాతీయ రహదారిపై నిలిచి ఉన్న ఆయిల్ ట్యాంకర్‌ను ఢీ కొట్టాడు. లారీ కిందకు సుమో వెళ్లిపోవడంతో లారీ, సుమో సీట్ల కింద కూలీలు ఇరుక్కుపోయారు. ఏడుగురు అక్కడికక్కడే మరణించారు. తీవ్రంగా గాయపడిన వారిని స్థానిక చిక్‌బళ్లాపూర్ ప్రభుత్వాస్పత్రికి స్థానికులు, పోలీసులు తరలించారు. చికిత్స పొందుతూ ఆరుగురు మరణంచారు. మృతుల్లో గోరంట్ల మండలం వానవోలు గ్రామానికి చెందిన బోయ వెంకటాద్రి (27), ఆయన భార్య బోయ లక్ష్మి (23), కొత్తచెరువు మండలం గోరంట్లపల్లి గ్రామానికి చెందిన పవన్(32), డ్రైవర్ హరిజన నరసింహులు (45), ఓబుళదేవరచెరువు మండలం నవాబుకోట గ్రామానికి వెంకట నారాయణ (51), ఆయన భార్య వెంకట సుబ్బమ్మ (48), చిలమత్తూరు మండలం మొరంపల్లి గ్రామానికి చెందిన గొల్ల గణేష్(17), ఓబుళదేవరచెరువు మండలం మలకవారిపల్లి గ్రామానికి చెందిన నారాయణప్ప (50), పెనుకొండ మండలం గోనిపెంట గ్రామానికి చెందిన గొల్ల శాంతమ్మ (37), ఆమె కుమారుడు గొల్ల రాజవర్ధన్ (15), కర్ణాటక రాష్ట్రం మరగనిగుంట్ల గ్రామానికి చెందిన మంగళ మూర్తి (42), కర్ణాటక రాష్ట్రం దొడగట్టకు చెందిన అరుణ(38), ఆమె కుమారుడు రుత్విక్ సాయి (7) ఉన్నారు. మృతుల వద్ద ఉన్న గుర్తింపు కార్డులను బట్టి సమాచారాన్ని వారి కుటుంబ సభ్యులు, సత్యసాయి జిల్లా పోలీసులకు కర్ణాటక పోలీసులు తెలియజేశారు. దట్టమైన పొగ మంచు ఉండడం వల్ల ముందు ఉన్న లారీని గుర్తించలేకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు కర్ణాటక పోలీసులు నిర్ధారించారు. మృతదేహాలను పోస్టుమార్టం అనంతరం వారి స్వగ్రామాలకు తరలించారు. సొంతూరిలో పనులు లేక వలస వెళ్తున్న కూలీలు ఇలా రోడ్డు ప్రమాదంలో మరణించడం బంధువులు, గ్రామస్తులను తీవ్రంగా కలచివేసింది. ప్రమాదంపై సిపిఎం, టిడిపి, జనసేన తదితర పార్టీలు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశాయి. మృతి చెందిన ఒక్కొక్క కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సంక్షేమాన్ని వివరించేందుకే...

- ప్రారంభమైన వైసిపి 'సామాజిక' యాత్రలు
- టిడిపిపై విమర్శల వెల్లువ

ప్రజాశక్తి - యంత్రాంగం

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యాక్రమాలను ప్రజలకు వివరించడమే సామాజిక సాధికార యాత్రల లక్ష్యమని పలువురు వైసిపి నేతలు అన్నారు. ఆ పార్టీ రాష్ట్రంలోని మూడు ప్రాంతాల నుండి చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రలు గురువారం ప్రారంభమైనాయి.

అనంతపురం, శ్రీకాకుళం, గుంటూరు జిల్లాల్లో ప్రారంభమైన ఈ యాత్రలను ఆయా చోట్ల మంత్రులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలను చైతన్యం చేయడంతో పాటు, ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలను కూడా వివరిస్తామని చెప్పారు. అనంతపురం జిల్లా శింగనమల మండల కేంద్రంలో ప్రారంభమైన యాత్రను ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా ప్రారంభించారు. అనంతరంశింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ బిసి, ఎస్‌సి, ఎస్‌టిలను చంద్రబాబు నాయుడు ఓటు బ్యాంకుగానే చూశారని అన్నారు. మంత్రి ఉషా శ్రీచరణ్ మాట్లాడుతూ.. 'సిఎం జగన్ పాలనపై ఎల్లో మీడియా వక్రీకరించే కథనాలు ఆపాలని డిమాండ్ చేశారు. ఎంపి నందిగాం సురేష్ మాట్లాడుతూ..'న్యాయాన్ని గెలిపించాలని నారా భువనేశ్వరి అనడం హాస్యాస్పదమన్నారు. ఎంపి గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్, టిడిపి నేత లోకేష్, ఆయన అమ్మ నారా భువనేశ్వరి ఎన్ని యాత్రలు చేసినా జగన్ జైత్రయాత్ర ఆపలేరని అన్నారు. మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ.. అబద్ధపు హామీలతో మరోసారి మోసం చేసేందుకు టిడిపి - జనసేన సిద్ధం అవుతున్నాయన్నారు.



తెనాలి బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

శ్రీకాకుళంలో....

శ్రీకాకుళంలోని వైసిపి కార్యాలయంలో బస్సు యాత్రను మంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభించారు. పలాసలో జరిగిన ముఖాముఖి, ఇచ్ఛాపురంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. అవినీతిలో టిడిపి కూరుకుపోయిందన్నారు. మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ, 'ఒకేసారి 32 లక్షల మందికి ఇళ్లు ఇస్తే చిన్న స్థలం ఇచ్చారని చంద్రబాబు అనడం హాస్యాస్పదమన్నారు. మరో మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం కోసం చంద్రబాబునాయుడు వద్దకు వెళితే మీ డొక్కా తీస్తా, తోలుతీస్తా అని బెదిరించేవారని అన్నారు. ఇచ్ఛాపురంలో ప్రధాన రహదారిపైనే సభ నిర్వహించడంతో జనం ఇబ్బందులు పడ్డారు. బస్టాండ్ దగ్గర సభాస్థలి ఏర్పాటు చేయడంతో ఆంధ్రా, ఒడిశా ప్రాంతాల నుంచి వచ్చిన బస్సులను రెండు కిలోమీటర్ల దూరంలోనే ఆపేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు.

గుంటూరులో ...

గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలోని కొలకలూరులో ప్రారంభమైన సభలో మిగతా 2లో

అటకెక్కిన సొంత బస్సుల కొనుగోలు

- పాత బస్సులతోనే ఎపిఎస్‌ఆర్‌టిసి ప్రయాణాలు
- ఉద్యోగ సంఘాల ఆగ్రహం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేశామని ఆర్భాటంగా చెప్పుకునే రాష్ట్ర ప్రభుత్వం కొత్త బస్సులు కొనుగోలు చేయకుండా ఆర్‌టిసిని నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోందని ఉద్యోగ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రంలో ఎపిఎస్‌ఆర్‌టిసికి 11,149 బస్సులు వున్నాయి. ఇందులో 8,743 బస్సులే ఆర్‌టిసివి కాగా, 2,406 బస్సులు అద్దె బస్సులు. గత ప్రభుత్వాల హయాంలో ప్రతియేటా కాలపరిమితి తీరిన బస్సుల స్థానంలో సగటున ఏటా దాదాపు రెండు వేల బస్సులు కొనుగోలు చేసేవారు. ఈ ప్రభుత్వం వచ్చిన నాలుగన్నరేళ్ల కాలంలో ఆర్‌టిసికి ఒక్క సొంత బస్సును కూడా కొనకుండా హైర్ బస్సులనే తీసుకుంటోంది.

ప్రతియేటా అద్దె బస్సులను తీసుకోవడం తప్ప ఎపిఎస్‌ఆర్‌టిసికి సొంతంగా బస్సులు కొనుగోలు చేయకపోవడంతో భవిష్యత్తులో ఆర్‌టిసి మనుగడే ప్రమాదంగా మారుతుందని ఉద్యోగ సంఘాలు చెబుతున్నాయి. కొత్త బస్సులు కొనుగోలు చేయాలని సంఘాలు కోరితే టెండర్ల దశలో వున్నాయంటూ ఏడాది కాలంగా ప్రభుత్వం మభ్యపెడుతోంది తప్ప ఎక్కడా బస్సులు కొనుగోలు చేయలేదు. గతంలో ఆర్‌టిసిలో అద్దె బస్సుల రేషియో 15 శాతానికి మించకుండా జాగ్రత్తలు తీసుకుంటూ ఏటా కొత్త బస్సులను కొనే పరిస్థితి వుంటే, ఇప్పుడు 30 శాతానికి పైగా అద్దె బస్సులు ఎపిఎస్‌ఆర్‌టిసిని ఆక్రమించినా రాష్ట్ర ప్రభుత్వం కళ్లుతెరవకపోవడం పట్ల ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆర్‌టిసిలో దాదాపు 2,400కు పైగా అద్దె బస్సులు వున్నాయంటే ఆర్‌టిసి పరిస్థితి ఏమిటో అవగతమవుతోంది. 15 ఏళ్లు దాటాక వాహనాలను తుక్కు కింద మార్చాలనే కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు ఆర్‌టిసిలో వచ్చే ఏడాది నుంచి అమలులోకి వస్తే వందలాది బస్సులు తుక్కు కింద పక్కన పెట్టేస్తే, ప్రయాణికులను చేం వేసేందుకు బస్సులను నడపలేని స్థితికి ఆర్‌టిసి నెట్టివేయబడుతుంది. ఎపిఎస్‌ఆర్‌టిసి 3,354 కొత్త బస్సులను కొనుగోలు చేయాలని పంపిన నివేదికను ప్రభుత్వం పట్టించుకోని పరిస్థితి వుంది. ఏడాది కాలంగా కొత్త బస్సుల కొనుగోళ్లకు సంబంధించి ప్రభుత్వ వైఖరి అదిగో.. ఇదిగో.. అనడం తప్ప కార్యరూపంలోకి తీసుకురాలేదు. ప్రజల ఆర్థికాభివృద్ధికి కీలకమైన రవాణా వ్యవస్థలో కీలకమైన ప్రజా రవాణాను ప్రభుత్వం నిర్వీర్యం చేయడం తగదని, తక్షణమే కొత్త బస్సులను ఆర్‌టిసికి సమకూర్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అమెరికాలో కాల్పుల మోత

- 18 మంది మృతి - మరో 13 మందికి గాయాలు
- దుండగుడి కోసం అన్వేషణ

వాషింగ్టన్ : అమెరికాలో మరోసారి కాల్పుల మోత మోగింది. ఈశాన్య రాష్ట్రమైన మైనే ప్రాంతంలో ఒక సాయుధుడు విచక్షణారాహిత్యంగా జరిపిన ఈ కాల్పుల్లో 18 మంది మరణించారు. మరో 13 మంది గాయపడ్డారు. మైనేలో నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర గవర్నర్ జనెట్ మిల్స్, ఎఫ్‌బిఐ అధికారి జోడి కోహెన్ ఈ దారుణ ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మైనేలో రెండో అతిపెద్ద నగరమైన లెవిస్టన్‌లో స్థానిక కాలమానం ప్రకారం.. బుధవారం రాత్రి 7.00 గంటల ప్రాంతంలో ఈ కాల్పులు చోటుచేసుకున్నాయి. కాల్పులు జరిపిన సాయుధుడిని రాబర్ట్ కార్డ్ (40)గా పోలీసులు గుర్తించారు. తొలుత రెస్టారెంట్‌లోకి, ఆ తర్వాత బౌలింగ్ అల్లేలోకి చొరబడిన దుండగుడు కనిపించినవారిపై కనిపించినట్లు విచక్షణారాహిత్యంగా తూటాల వర్షం కురిపించాడు. దీంతో రెస్టారెంట్‌లో ఏడుగురు, బౌలింగ్ అల్లేలో ఎనిమిది మంది చనిపోయారు. మరో ముగ్గురు తీవ్ర గాయాలపాలై ఆసుపత్రికి తరలిస్తున్న సమయంలో తనువు చాలించారు. మరణించినవారిలో ఎనిమిది మందిని గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అధికారులు సమాచారాన్ని చేరవేశారు. మరో 10 మందిని గుర్తించాల్సివుంది. ఈ దారుణ ఘటన పట్ల అమెరికా అధ్యక్షులు జోయ్ బిడెన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాష్ట్ర గవర్నరు జానెట్ మిల్స్‌కు ఫోన్ చేసి వైట్ హౌస్ నుంచి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

ప్రమాదకరమైన సాయుధుడు

ఆయుధాలు ధరించిన ఈ దుండగుడు చాలా ప్రమాదకరమైన వ్యక్తిగా గవర్నర్ పేర్కొన్నారు. ఇళ్లలోనే తలదాచుకోవాలని, ఎవరూ బయటకు రావద్దని అధికారులు స్థానిక ప్రజానీకాన్ని హెచ్చరించారు. దాదాపు 38,000 మంది జనాభా ఉండే లెవిస్టన్‌కు దారితీసే అన్ని మార్గాలను మూసివేసి పోలీసులు, దర్యాప్తు సిబ్బంది దుండగుడి కోసం గాలిస్తున్నారు. ఆండ్రోస్కోగ్గిన్ కౌంటీ షెరీఫ్ కార్యాలయం తాజాగా అనుమానితుడి రెండు ఫొటోలను ఫేస్‌బుక్‌లో షేర్ చేసింది. నిందితుడు ఉపయోగించిన నల్ల వాహనం కోసం లూయిస్టన్‌లో వెతుకుతున్నామని పోలీసులు తెలిపారు.

తహశీల్దార్ కార్యాలయం వెనుకే
తవ్వేశారు!

- దళితుల సాగుభూమిని వదల్లేదు
- మైనింగ్ మాఫియా అక్రమాలు
- వలంటీర్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- ప్రజాశక్తి పరిశీలనలో వెల్లడి

తహశీల్దార్ కార్యాలయం వెనుక ఉన్న దేవర దిబ్బను తవ్వేసిన దృశ్యం
(ఇన్‌సెట్‌లో) పోలీసు స్టేషన్ వద్ద ఉన్న హిటాచీలు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు జిల్లా సైదాపురంలో మైనింగ్ మాఫియా అక్రమాలు భారీగా వెలుగులోకి వస్తున్నాయి. తహసిల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలో అక్రమార్కులు చెలరేగిపోయారు. రెవిన్యూభూముల్లో అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను పెరికి పారేశారు. దళితులు ఏళ్లతరబడి సాగుచేసుకుంటున్న భూముల్లోంచి వారిని తరిమేసి తవ్వకాలు జరిపారు. ఇప్పుడు అక్కడ ఎక్కడ చూసిన టన్నుల కొద్ది తెల్లరాయి పడిఉంది. గురువారం ఈ ప్రాంతంలో పరిశీలన చేసిన ప్రజాశక్తికి కనిపించిన దృశ్యాలివి! కుప్పలుగా పడిఉన్న తెల్లరాయిని అధికారులు ఇంతవరకు స్వాధీనం చేసుకోకపోవడంపై స్థానికంగా చర్చ సాగుతోంది.. భూమి ఎవరిదైనా సరే

తవ్వేశారని స్థానికులు తెలిపారు. ప్రశ్నించడానికి కూడా అవకాశం ఇవ్వరని చెప్పారు. పోలీసులకు సమాచారం ఇచ్చినా ఆ విషయం అక్రమార్కులకు తెలిసిపోతోందని తెలిపారు. సైదాపురం మండలం అంతా కొండలు, గుట్టలు, మెట్ట భూములు, పచ్చదనంతో కళకళలాడుతుంటుంది. వీటిలో అధికభాగం మాఫియా బారిన పడింది. ప్రస్తుతం అక్కడ శ్మశాన నిశ్శబ్దం నెలకొంది. సైదాపురం తహశీల్దారులు కార్యాలయానికి కేవలం 100 మీటర్లు దూరంలోని సర్వే నెంబర్ 528, 528బి, 522బిలలో విచ్చలవిడిగా తవ్వకాలు జరిగాయి. సమీపంలోని దేవర తిప్పను మాఫియా మిగతా 2లో

కౌలు రైతులందరికీ పంట రుణాలు

- స్టేట్ లీడ్ బ్యాంకు ముందు కౌలు రైతుల ధర్నా

నిజమే గెలుస్తుంది

- అక్రమ అరెస్టులకు భయపడొద్దు : భువనేశ్వరి
- రెండో రోజూ బాధిత కుటుంబాలకు పరామర్శ

'జక్కంపూడి' రిసెప్షన్‌కు సిఎం హాజరు

లోపలి పేజీలో..

ఖజానా వెలవెల

- నెలాఖరొస్తున్నా ఇంకా ఓడిలోనే

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర ఖజానా వెలవెలబోతోంది. ఆదాయం కన్నా వ్యయం ఎక్కువ కావడంతో అనునిత్యం రుణాలపై ఆధారపడాల్సి వస్తోంది. సాధారణంగా నెలలో తొలివారం మాత్రమే ఓవర్‌డ్రాఫ్ట్‌కు వెళ్లే ఆర్థికశాఖ ఇప్పుడు నెలాఖరులో కూడా ఓడిలోనే ఉంది. ప్రస్తుతం రూ.1,684 కోట్ల వరకు ఓవర్‌డ్రాఫ్ట్‌లో ఉన్నట్లు తేలింది. అదే కాకుండా ఈ 24 రోజుల్లో ఏకంగా పది రోజులు ఓడిలోనే ఉండడం ఆందోళనకరంగా ఉందని ఆర్థికశాఖ అధికారులే అంటున్నారు. ఇప్పటివరకు రాష్ట్ర సెక్యూరిటీల వేలం ద్వారా రూ.46 వేలకోట్ల వరకు బహిరంగ మార్కెట్ రుణాలు తీసుకున్నారు. మరో పాతిక వేల కోట్లకు పైగా కార్పొరేషన్ల ద్వారా రుణాలు సేకరించారు. ఇలా రూ.70 వేల కోట్ల నుంచి రూ.75 వేల కోట్ల వరకు రుణాలు తీసుకున్నారు. అయినప్పటికీ తరచూ ఓవర్‌డ్రాఫ్ట్‌కు వెళ్లడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

హయ్యర్ పెన్షన్ కోసం కాలపరిమితి పొడిగించండి : ఎన్‌ఎంయు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎపిఎస్‌ఆర్‌టిసి అమలు పరుస్తున్న హయ్యర్ పెన్షన్ విధానంలో వున్న ఉద్యోగులకు డబ్బు చెల్లించేందుకు మరో మూడు నెలలపాటు కాలపరిమితి పెంచాలని ఎపిపిటిడి నేషనల్ మజ్దూర్ యూనిటి అసోసియేషన్ కోరింది. ఈ మేరకు గురువారం సెంట్రల్ పిఎఫ్ కమిషనరు నీలం షామిరావుకు వినతిపత్రాన్ని ఎన్‌ఎంయు అందజేసింది. హయ్యర్ పెన్షన్ విధానంలోకి మారిన ఉద్యోగులకు డబ్బు చెల్లించాలని పిఎఫ్ శాఖ పంపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తం ఉద్యోగుల పిఎఫ్ ఖాతాల్లో లేకపోవడంతో చాలా మంది ఉద్యోగులు చెల్లించలేక పోయారని ఎన్‌ఎంయు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పివి రమణారెడ్డి, వై శ్రీనివా సరావు తెలిపారు. హయ్యర్ పెన్షన్ విధానంలోకి మారేందుకు డిమాండ్ నోటీస్‌లో పేర్కొన్న సమయంతోపాటు మరో మూడు నెలల గడువు అదనంగా ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు.

వైఎస్‌ఆర్‌టిపికి బైనాక్యులర్ గుర్తు కేటాయింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్‌ఆర్ తెలంగాణ పార్టీకి కేంద్ర ఎన్నికల కమిషన్ ఉమ్మడి గుర్తును కేటాయించింది. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ఆ పార్టీకి బైనాక్యులర్ గుర్తును కేటాయిస్తూ ఎన్నికల సంఘం గురువారం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు వీలుగా తమకు ఉమ్మడి గుర్తు కేటాయించాలని వైఎస్‌ఆర్‌టిపి ఇసిని కోరింది. వైఎస్‌ఆర్‌టిపి విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ఎన్నికల సంఘం పేరా10బి కింద అనుమతిస్తూ ఆ పార్టీకి ఉమ్మడి గుర్తును కేటాయించింది.

రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో వైఎస్‌ఆర్‌టిపి అభ్యర్థులకు బైనాక్యులర్ గుర్తును ఉమ్మడిగా కేటాయించింది. నిర్దిష్ట నిబంధనలకు లోబడి ఆ పార్టీ అభ్యర్థులకు బైనాక్యులర్ గుర్తును కేటాయించాలని ఇసి.. రిటర్నింగ్ అధికారులను ఆదేశించింది.

కాల్‌డేటా ఇవ్వలేం

(మొదటి పేజీ తరువాయి)

హైకోర్టు నిరాకరించింది.తనకు మూడు నెలల క్రితం ఎడమ కంటికి కాటరాక్ట్ ఆపరేషన్ జరిగిందని, ఇప్పుడు కుడి కంటికి కూడా కాటరాక్ట్ ఆపరేషన్ చేయాల్సి వుందని పేర్కొంటూ చంద్రబాబు హౌస్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. కాటరాక్ట్ ఆపరేషన్ చేయించుకునేందుకు వీలుగా మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కోరారు . ఈ పిటిషన్ పై విచారణకు హైకోర్టు నిరాకరించింది.

బెయిల్ పిటిషన్‌పై నేడు విచారణ

స్కిల్ డెవలప్‌మెంటు కేసులో గతంలో చంద్రబాబు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్, మధ్యంతర బెయిల్ కోసం అనుబంధ పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టు వెకేషన్ కోర్టు విచారణ చేయనుంది.

తహశీల్దార్ కార్యాలయం వెనుకే తవ్వేశారు!

(మొదటి పేజీ తరువాయి)

గుల్లగుల్ల చేసింది. హిటాచీలతో ఎక్కడికక్కడే తవ్వకాలు చేసి, రాయిని తరలించింది.

ఫిర్యాదు చేసినా...!

తహసిల్దార్ కార్యాలయానికి కూత వేటు దూరంలో జరిగిన ఈ తవ్వకాలపై ఫిర్యాదు అందినా అధికారయంత్రాంగం స్పందించలేదని తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం స్థానిక వలంటీర్లు, సచివాలయ కార్యాలయ సిబ్బంది ఈ విషయాన్ని అనేక దఫాలు రెవిన్యూ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిసింది. ఈ తరహా ఫిర్యాదులు అందినప్పుడల్లా ఇదిగో..అదిగో అంటూ దాటేశారని కనీస చర్యలు తీసుకోలేదని స్థానికులు తెలిపారు.

బోర్డులు పీకేసి.. కొండలు తవ్వేసి

సర్వేనెంబర్ 793, ముక్కోటి కొండలలో రెవెన్యూ భూమి 114 ఎకరాలుంది. ఆ స్థలాన్ని ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ రెవిన్యూ అధికారులు బోర్డును ఏర్పాటు చేశారు. ఆ బోర్డును పీకి పడేసి కొండ మొత్తాన్ని తవ్వేశారు. బోర్డు ఉన్న స్థలంలో ప్రస్తుతం పెద్దగొయ్యి కనపడుతోంది. ఎస్‌సి, ఎస్‌టి, బిసిలు ఇక్కడ 42 ఎకరాలు సాగుచేసుకుంటున్నారు. రాత్రికి రాత్రే ఈ భూముల్లో తవ్వకాలు చేశారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని తెలిసింది. ఏ అధికారికి చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానిక దళిత మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.

రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖ కేంద్రంగా ప్రత్యేక రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని, రైళ్లలో జనరల్ బోగీల సంఖ్య పెంచాలని, రద్దు చేసిన 52 ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ విశాఖ రైల్వే స్టేషన్ ఎదుట గురువారం సిపిఎం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల గుండా సామాన్యులు ప్రయాణించే 52 రైళ్లను డబ్లింగ్ పనులు, ట్రాక్ మరమ్మతులు, సిగ్నల్స్ రిపేర్లు పేరిట రెండు నెలలుగా అధికారులు రద్దు చేశారని, ఆ పనులకు సూపర్‌ఫాస్ట్, వందేభారత్ రైళ్లు ఆటంకం కావా? అని ప్రశ్నించారు. పనులను వేగంగా పూర్తి చేసి రైళ్లన్నింటినీ అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. కోవిడ్‌ను అడ్డం పెట్టుకొని పాసింజర్ రైళ్లను ఎక్స్‌ప్రెస్‌లుగానూ, ఎక్స్‌ప్రెస్ రైళ్లను సూపర్‌ఫాస్ట్‌లుగానూ మార్చేసి పేదలకు రైలు ప్రయాణం అందుబాటులో లేకుండా చేశారని ధ్వజమెత్తారు. రైళ్ల పేర్లను మార్చి మధ్య తరగతి ప్రజలపై పెనుభారాలు మోపారన్నారు. తత్కాల్, ప్రీమియం తత్కాల్ పేరిట భారాలు మోపడం, అధిక సంఖ్యలో వెయిటింగ్ లిస్టులో టిక్కెట్లు ఇస్తూ.. వాటికి బెర్త్‌లు కేటాయించకుండా ప్రయాణికుల నుండి డబ్బులు గుంజడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. సీనియర్ సిటిజన్స్ రాయితీని పునరుద్ధరించాలని, మహిళా రిజర్వేషన్ బోగీల సంఖ్యను పెంచాలని కోరారు. సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ రైల్వేలో ప్రయివేటీకరణ చర్యలకు కేంద్ర ప్రభుత్వం పూనుకుందన్నారు. కేంద్రం చర్యలను రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు వ్యతిరేకించకపోవడం సరికాదన్నారు. విశాఖ కేంద్రంగా ప్రత్యేక రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వాల్తేరు డివిజన్‌ను కొనసాగిస్తూ విశాఖ రైల్వేజోన్ పనులు ప్రారంభించాలని కోరారు.

విశాఖ రైల్వే స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

ధాన్యం కొనుగోలు సమస్యను పరిష్కరించాలి

- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి - అమరాతి బ్యూరో

రైతులు పండించిన పంటలను పూర్తిగా కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కోరింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకరరెడ్డి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఖరీఫ్‌లో 15 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారని, సుమారు 85 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేశారని తెలిపారు. ప్రభుత్వం మాత్రం 37 లక్షల టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించిందని వ్యవసాయశాఖ అధికారులు ప్రకటిస్తున్నారని పేర్కొన్నారు. రైతులు పండించిన పంటను పూర్తిగా కొనుగోలు చేయకుండా లక్ష్యాన్ని కుదించడం, అన్యాయమని అన్నారు. ప్రతి గింజనూ కొంటామని చెబుతున్న ప్రభుత్వం ఆచరణలో 45 శాతమే కొనుగోలు లక్ష్యంగా పెట్టుకోవడం సరైంది కాదని పేర్కొన్నారు. దీనివల్ల రైతులు నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం ప్రకటించిన మద్దతు ధర క్వింటాకు ఏ గ్రేడ్ ధాన్యం రూ.2,203, సాధారణ రకం రూ.2,183 సరిపోదని తెలిపారు. కేరళలో సిపిఎం ఆధ్వర్యంలోని వామపక్ష ప్రభుత్వం మద్దతు ధరకు అదనంగా రూ.900 బోనస్ ఇస్తోందని అన్నారు. రవాణా, గోనెసంచులు, హమాలీ ఛార్జీల పేరుతో క్వింటా ధాన్యానికి రూ.250 రైతుకు మేలు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి ఆచరణలో రూ.100 లోపే ఖర్చు చేస్తోందని తెలిపారు. రైతు భరోసా కేంద్రం వద్ద నిర్ణయించిన తేమశాతం, నూకశాతం ప్రకారం ధాన్యాన్ని తూకంవేసి లోడ్‌చేసి మిల్లుకు తరలిస్తున్నారని, మరలా మిల్లు వద్ద నూక, తేమశాతం చూసి తేడాలు ఉన్నాయనే పేరుతో గత ఖరీఫ్ సీజన్లో రైతుల నుండి వేల రూపాయలు వసూలు చేశారని పేర్కొన్నారు. కట్టలేని వారి ధాన్యాన్ని అన్‌లోడ్ చేసుకోకుండా వేధింపులకు దిగారని తెలిపారు. ట్రక్ షీట్ జనరేట్ అయిన తరువాత మిల్లు వద్దకు రైతు వెళ్లనవసరం లేదని, ప్రభుత్వ విధానానికి, ఆచరణకు పొంతనలేదని పేర్కొన్నారు. ఖరీఫ్ కొనుగోళ్లు ప్రారంభమైన నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్ల సమస్యను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. పండించిన ధాన్యం మొత్తం ప్రభుత్వం కొనుగోలు చేయాలని, లేనిపక్షంలో రైతులు ఆందోళనకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు.

యువతకు ఉపాధి కల్పించే దిశగా చర్యలు

- స్కిల్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ ఛైర్మన్ అజయ్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో యువతకు ఉపాధి కల్పించే దిశగా స్కిల్ డెవలప్‌మెంటు కార్పొరేషన్‌లో ఉపాధి శిక్షణ కార్యక్రమాలను పెద్దయెత్తున నిర్వహించాలని అధికారులకు ఎపి స్కిల్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ ఛైర్మన్ కె అజయ్‌రెడ్డి ఆదేశించారు.

గురువారం తాడేపల్లిలోని స్కిల్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. స్కిల్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ ద్వారా స్థానిక పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలకు అనుగుణంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విస్తృతమైన ఉపాధి అవకాశాలు సృష్టించి ఉద్యోగ ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రంగా మార్చాలని సూచించారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ ఎమ్‌డి వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం

ప్రజాశక్తి - యంత్రాంగం, అమరావతి బ్యూరో

విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో గురువారం వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం చెందారు. మృతుల్లో కెజిబివి ఉపాధ్యాయురాలు ఉన్నారు. పోలీసుల కథనం మేరకు.. విశాఖ ఆర్‌టిసి కాంప్లెక్స్‌కు సమీపంలోని తెలుగుతల్లి ఫ్లైఓవర్‌పై గురువారం తెల్లవారుజామున మోటారు బైకు బోల్తా కొట్టింది. ఆ సమయంలో బైకుపై ముగ్గురు ప్రయాణిస్తున్నారు. వీరిలో రాజమండ్రికి చెందిన కాపురపు శ్యాం (21) అక్కడికక్కడే మృతి చెందారు. అనకాపల్లికి చెందిన తోట హర్ష కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి చనిపోయారు. కె.రాజు తీవ్రంగా గాయపడ్డారు. వీరంతా ఉపాధి కోసం విశాఖకు వచ్చారు. అతి వేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉక్కు ఉద్యోగి కెఆ.అప్పారావు (51) మృతిచెందారు. ఆయన ఎస్‌ఎంఎస్ విభాగంలో ఫోర్ మ్యాన్‌గా పనిచేస్తున్నారు. గురువారం మధ్యాహ్నం ఎస్‌ఎంఎస్ విభాగంలో ఇసిఆర్ 5కి ఎదురుగా వస్తున్న సమయంలో బ్లూమ్ స్క్రాప్‌ను తీసుకెళ్తున్న ట్రాలీ ఆయనను ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. స్వస్థలం వడ్లపూడి కాగా స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో నివాసం ఉంటున్నాడు.

కెజిబివి టీచర్ మృతి

అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బేతపూడి కెజిబివిలో సైన్స్ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న బొడ్డు శ్రీదేవి (37) మృతిచెందారు. ఈ ప్రమాదంలో అదే పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న దేవి ప్రాణాలతో బయటపడ్డారు. మృతురాలి స్వగ్రామం సబ్బవరం మండలం పెదనాయుడుపాలెం. పాఠశాలకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్ చేయడానికి తన సహచర ఉపాధ్యాయురాలు దేవితో కలిసి ద్విచక్ర వాహనంపై బేతపూడి నుంచి దేవరాపల్లికి బయలుదేరారు. మార్గమధ్యలో ఎదురుగా వస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను తప్పించే క్రమంలో వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పింది. దీంతో ఇద్దరూ రోడ్డుపై పడ్డారు. శ్రీదేవి మీదుగా ట్రాక్టర్ వెళ్లడంతో ఆమె మృతి చెందారు. మృతురాలికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

శ్రీదేవి కుటుంబానికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా

సమగ్రశిక్ష కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ డిమాండ్

విధి నిర్వహణలో రోడ్డు ప్రమాదానికి గురై మరణించిన కెజిబివి టీచర్ శ్రీదేవి కుటుంబానికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సమగ్రశిక్ష కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు బాలకాశి, ఉపాధ్యక్షులు విజయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సైన్స్ టీచర్ శ్రీదేవి మరణం తీరని లోటని రాష్ట్ర కమిటీ తరపున సంతాపం తెలిపారు. ఆమె కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని డిమాండ్ చేశారు.

శ్రీదేవి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

సంక్షేమాన్ని వివరించేందుకే...

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ.. 'ఓ రిమాండ్ ఖైదీ కోసం టిడిపి నేతలు రోడ్డెక్కారని విమర్శించారు. మరో మంత్రి జోగిరమేష్ మాట్లాడుతూ, నిజం గెలిచింది కాబట్టే చంద్రబాబు జైలుకు వెళ్లాడని అన్నారు. మాజీ ఎంపీ బుట్టా రేణుక మాట్లాడుతూ..'అమ్మఒడి, నాడు-నేడు ద్వారా పేదలకు విద్యావకాశాలు కల్పించారన్నారు.

టిడిపి నిరసన ర్యాలీ

సామాజిక సాధికార యాత్రను వ్యతిరేకిస్తూ ఇచ్ఛాపురం టిడిపి ఎమ్మెల్యే బెందాళం అశోక్ నల్ల జెండాలతో నిరసన ర్యాలీ నిర్వహించారు. కవిటి మండలం రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి కవిటి బస్టాండ్ కూడలిలోని అంబేద్కర్ విగ్రహం వరకు టిడిపి శ్రేణులతో కలిసి ర్యాలీ చేపట్టారు. ఎమ్మెల్యేతో పాటు పలువురు నాయకులను పోలీసులు అరెస్టు చేసి కవిటి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని విడిచిపెట్టారు. పలాసలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషతో పాటు పలువురు నాయకులను పోలీసులు గృహ నిర్బంధం చేశారు.

మభ్యపెట్టేందుకే వైసిపి బస్సు యాత్ర

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు దశాబ్దాలుగా అమలులో వున్న పథకాలను జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రద్దు చేయడంతో అసంతృప్తితో వున్న ఆయా వర్గాలను మభ్యపెట్టేందుకే వైసిపి బస్సు యాత్ర చేపట్టిందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించారు. మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో గురువారం పేదల గొంతు కోస్తున్న పెత్తందారు జగన్ రెడ్డి అనే కరపత్రాన్ని టిడిపి నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుండి దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులు, మైనార్టీల పథకాలను రద్దు చేయడమే కాదు వారిపై దాడులు కూడా పెరిగిపోయాయని అన్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక దళితులు, గిరిజనులకు చెందిన 29 పథకాలను, మైనార్టీలకు చెందిన 11 పథకాలను రద్దు చేశారని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులను పక్కదారి పట్టించినా బస్సుల్లో వున్న మంత్రులు మాట్లాడలేని పరిస్థితి వుందన్నారు.

డ్రైవర్ సుబ్రమణ్యం హత్య ఘటనపై దళితుల్లో చైతన్యం కలిగించేలా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. రేపల్లెలో పదో తరగతి చదివే బిసి విద్యార్థి దహనం ఘటనకు వైసిపి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నంద్యాలలో సలాం కుటుంబాన్ని ఆత్మహత్య చేసుకునేలా పోలీసులు ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు.

మంత్రి అంబటిది బాధ్యతారాహిత్యం

మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు

రాష్ట్రంలో ఆయకట్టు సాగుకు నీరందక పంటలు ఎండిపోతుంటే జలవనరులశాఖ మంత్రి బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు విమర్శించారు. రాష్ట్రంలో వర్షాభావంతో కరువు నెలకొందని, పంటకాల్వల కింద ఆయకట్టుకు నీరిచ్చే అవకాశం వున్నా.. ప్రభుత్వానికి ముందు చూపులేకపోవడంతో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అంబటి రాంబాబు ఒకసారి ఎమ్మెల్యే అయ్యాక రెండోసారి కావడానికి 25 ఏళ్లు పట్టిందనే అంశాన్ని మర్చిపోవద్దని అన్నారు. చంద్రబాబుకు వస్తున్న సంఘీభావాన్ని చూసి తట్టుకోలేక వైసిపి ప్రభుత్వం 'నిజం గెలవాలి' యాత్రను కూడా అడ్డుకునేందుకు కుట్రలు చేస్తోందన్నారు.

ఎన్నికలు ముంచుకొస్తున్నాయి

మమ్మల్నేం చేయమంటారు ?

- చంద్రబాబుకు కాసాని అభ్యర్థన
- రాజమండ్రి జైలుకు లేఖ
- పోటీ వద్దనుకుంటే ప్రత్యామ్నాయ ఆలోచన ?

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో ఎన్నికల వాతావరణం ఊపందుకుంది. అన్ని రాజకీయ పార్టీలు ఒకవైపు ఉత్సాహంగా అభ్యర్థులను ప్రకటిస్తూనే మరోవైపు ప్రచారం సైతం నిర్వహిస్తున్నాయి. కప్పదాట్లు జోరు పెరిగింది. అన్నీ పార్టీల్లో హడావిడి కనిపిస్తోంది. అయితే టిడిపిలో మాత్రం నైరాశ్యం నెలకొంది. పార్టీ అధినేత చంద్రబాబు ఎపి స్కిల్ స్కామ్ కేసులో రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న నేపథ్యంలో తెలంగాణ టిడిపిలో రాజకీయ నిర్ణయాలు ఆలస్యమవుతున్నాయి. ఎన్నికల షెడ్యూల్ వచ్చి దాదాపు మూడు వారాలు దాటింది. నవంబరు 30 పోలింగ్ తేదీగా కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రకటించిన తరుణంలో తెలంగాణ టిడిపి సమస్యల్లో ఇరుక్కుపోయింది. పోటీచేసే విషయమై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కచ్చితంగా ఎన్నికల బరిలో ఉంటామని ఆ పార్టీ సీనియర్ నేతలు చెబుతున్నా, ఆచరణలో ఆ కదలికలు కనిపించకపోవడంతో క్యాడర్‌లో అసంతృప్తి కనిపిస్తోంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ఇప్పటికే చంద్రబాబును ఒకసారి జైలులో ములాఖాత్‌కు పోయి కలిసినా స్పష్టత రాలేదు. ఈలోపు ఆపార్టీలో అంతర్గతంగా గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. టికెట్లు, బి-ఫారాలు అంటూ నేతలు కాసానిపై ఒత్తిడి చేస్తున్నారు. దీంతో శుక్రవారం మరోసారి ములాఖాత్ కోసం వెళ్లాలని కాసాని నిర్ణయించుకున్నారు. ఈమేరకు ఎపి టిడిపి నేతలు ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో కాసాని రెండు రోజుల క్రితం పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశం ఏర్పాటు చేసి అభిప్రాయాలు తీసుకున్నారు. తెలంగాణలోని 119 నియోజకవర్గాలకు 89 నియోజకవర్గాల్లో పోటీ చేయాలని నిర్ణయించినట్టు సమాచారం. వీటి కోసం సుమారు 189 మంది పేర్లతో జాబితా తయారు చేశారు. చంద్రబాబు కుటుంబ సభ్యులతో శుక్రవారం సాయంత్రం లేదా శనివారం ఉదయం ములాఖాత్‌కు వెళ్లే సమయంలో ఆయనకు నివేదిక అందజేయనున్నారు. ఈనెల 29 లోపు స్పష్టత వస్తుందని కాసాని భావిస్తున్నారు. హైదరాబాద్, ఉమ్మడి వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో మినహా మిగతా అన్ని చోట్లా రంగంలోకి దిగేందుకు సన్నాహాలతో సిద్ధంగా ఉన్నామని చంద్రబాబుకు చెప్పనున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఇప్పటికే రాజమండ్రి జైలుకు ప్రత్యేకంగా లేఖ రాశారు. పార్టీ జాతీయ కార్యదర్శి కాసాని వీరేష్ ద్వారా ఆ లేఖను గురువారం సాయంత్రం చంద్రబాబుకు అందజేసేలా జైలర్‌కు ఇచ్చారు. నిర్ణయం చంద్రబాబుకు వదిలేయాలని కాసాని భావిస్తున్నారు. ఓడినా, గెలిచినా రాష్ట్రంలో ఎక్కువ మంది బిసిలకు టికెట్లు కేటాయించాలనే పట్టుదలతో కాసాని ఉన్నారు. ఒకవేళ తెలంగాణలో పోటీ వద్దని చంద్రబాబు చెబితే మాత్రం, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునేందుకు కాసాని సంసిద్ధులవుతున్నట్టు తెలిసింది

'ఉక్కు' ప్రయివేటీకరణపై కేంద్రాన్ని ప్రశ్నించాలి

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై ప్రతి ఒక్కరూ కేంద్రంలోని మోడీ సర్కారును ప్రశ్నించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు కోరారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి 987వ రోజుకు చేరాయి. ఈ దీక్షల్లో స్టీల్ ఎస్‌ఎంఎస్-1 విభాగం కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తామని కేంద్రం ప్రకటించినప్పటి నుంచి ఆందోళనలు జరుగుతున్నా ప్రధాని మోడీ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఉద్యమాలపై ప్రభుత్వ అణచివేత పెరుగుతున్న కొద్దీ ప్రజల్లో వ్యతిరేకత రెట్టింపై రాజకీయ మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందన్న అంశాన్ని బిజెపి సర్కారు గుర్తించాలన్నారు. ఉక్కు కర్మాగారం విషయంలో మేథావులు మౌనం దాల్చడం భావ్యంకాదన్నారు. దీక్షల్లో పోరాట కమిటీ నాయకులు బి.అప్పారావు, ఎంవి.రమణ, ముత్యాలనాయుడు, పివి.రమణమూర్తి, నాగబాబు, రాజిబాబు, వెంకటేష్, చంద్రశేఖర్, గరికి రవి, ఎన్.అప్పలరాజు పాల్గొన్నారు.

పౌష్టికాహార భద్రతే ధ్యేయం

- పౌర సరఫరాలశాఖ కమిషనరు అరుణ్‌కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆహార భద్రతతోపాటు పౌష్టికాహార భద్రత కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ కమిషనరు అరుణ్‌కుమార్ అన్నారు. గురువారం మంగళగిరిలోని ఎపిఐఐసి కార్యాలయంలో పౌర సరఫరాల కార్పొరేషన్ ఆధ్వర్యాన ఫుడ్ ఫోర్టిఫికేషన్‌పై వేర్వేరు రాష్ట్రాల ప్రతినిధులతో వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో దాదాపు కోటిన్నర రేషన్ కార్డుదారుల కుటుంబాలతోపాటు ఐసిడిఎస్, అంగన్‌వాడీ, ఎండిఎం, రెసిడెన్షియల్ పాఠశాలల్లో చిన్నారులకు ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేస్తున్నామని, ఈ విషయంలో ఎపి మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే ముందుందని తెలిపారు. ఫోర్టిఫైడ్ బియ్యంపై అవగాహన కల్పించేందుకు విస్తృత కార్యక్రమాలు చేస్తున్నామని, పివి సింధు వంటి ప్రముఖ క్రీడాకారులతో అవగాహన కల్పిస్తున్నామని ఆయన చెప్పారు. అంగన్‌వాడీ టీచర్లు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఫోర్టిఫైడ్ బియ్యంలో ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి12 ఉంటాయన్నారు. ఈ బియ్యం వందకు ఒక శాతం అంటే వంద కేజీల సాధారణ బియ్యంలో ఒక కేజీ ఫోర్టిఫైడ్ బియ్యం కలిసి అందజేస్తున్నామని పేర్కొన్నారు. ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీకి ముందు వివిధ దశల్లో ల్యాబ్‌లో టెస్టులు నిర్వహిస్తున్నట్లు పౌర సరఫరాల కార్పొరేషన్ ఎమ్‌డి వీరపాండియన్ పేర్కొన్నారు. నాణ్యమైన బియ్యం ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నాణ్యతకు పెద్దపీట వేస్తూ పంపిణీదారు నుంచి వచ్చిన కెర్నెల్స్‌కు నాలుగు దశల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు ఆపాలి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గం తీర్మానం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు ఆపాలని, గాజాలో శాంతి నెలకొల్పాలని కోరుతూ సిపిఐ రాష్ట్ర సమితి తీర్మానం చేసింది. గురువారం దాసరి భవన్‌లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం జరిగింది. అమెరికా వత్తాసుతో గాజా ప్రాంతంలో ఇజ్రాయెల్ ఎడతెరపిలేని బాంబుల వర్షాన్ని కురిపిస్తోందని, వేల మంది ఇరు దేశాలకు చెందిన వారు మరణించారని పేర్కొన్నారు. ఇప్పుడు ఇజ్రాయెల్, పాక్షిక ప్రతిపత్తితో ఉన్న గాజా, వెస్ట్ బ్యాంక్ ఇవన్నీ ఐదేళ్ల క్రితం పాలస్తీనా దేశమేనని తెలిపారు. 1993లో జరిగిన ఓస్లో శాంతి ఒడంబడిక ప్రకారం రెండు దేశాలు ఏర్పడ్డాయని, తూర్పు జెరూసలెం పాలస్తీనా రాజధాని కావాలని అందులో ఉన్నా ఇజ్రాయెల్ అమలు చేయడం లేదని పేర్కొన్నారు. గాజాపై దాడికి నిరసనగా ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మందితో పాలస్తీనా సంఘీభావ ప్రదర్శనలు అన్ని నగరాలలో జరుగుతున్నాయని, విముక్తి పోరాటాన్ని నిర్వహించే ప్రజలకు సంఘీభావం ప్రకటించే విధానాన్ని భారత్ ఇప్పటి వరకు అవలంభిస్తోందని వివరించారు. మోడీ వచ్చిన తరువాత ఇజ్రాయెల్‌కు అనుకూలంగా మారిందని విమర్శించారు. ఈ నేపథ్యంలో పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు ఆపాలని, కాల్పుల విరమణ ఒప్పందాన్ని అమలు చేయాలని కోరుతూ తీర్మానించారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, ముప్పాళ్ల నాగేశ్వరరావు, కెవి సత్యనారాయణమూర్తి, జి ఓబులేసు, సి హరనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

రక్తదానం గొప్పది

- అడిషనల్ డిజి అతుల్ సింగ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అన్ని దానాల కన్నా రక్తదానం గొప్పదని, రక్తదానంతో మరొకరి ప్రాణాలు కాపాడవచ్చని ఎపిఎస్‌పి బెటాలియన్స్ అడిషనల్ డిజి అతుల్ సింగ్ పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా గురువారం మంగళగిరిలోని ఎపిఎస్‌పి 6వ బెటాలియన్‌లో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పోలీసులు రక్తదానం చేశారు. అలాగే పలువురు పోలీసులు, వారి కుటుంబ సభ్యులు ఉచితంగా వైద్యసేవలు పొందారు. అనంతరం అతుల్ సింగ్ మాట్లాడుతూ.. ఆపదలో వున్నవారికి రక్తం అవసరమైనప్పుడు ప్రతి ఒక్కరూ మానవతాదృక్పథంతో వ్యవహరించాలని కోరారు. ఈ సందర్భంగా అతుల్‌సింగ్ కూడా రక్తదానం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు. పోలీసుల నుంచి సేకరించిన రక్తాన్ని గుంటూరు జనరల్ ఆస్పత్రికి అందజేశారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో మంగళగిరిలోని ఎయిమ్స్, విజయవాడకు చెందిన రమేష్ హాస్పిటల్స్, గుంటూరు జనరల్ హాస్పిటల్‌కు చెందిన పలువురు డాక్టర్లు వైద్యసేవలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు టి హరిత, అవినాష్, నర్రా చేతన్, డిఐజి రాజకుమారి, బెటాలియన్ కమాండెంట్ సుబ్బారెడ్డి అడిషనల్ కమాండెంట్ సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లంచం తీసుకుని పట్టుబడిన జూనియర్ అసిస్టెంట్

రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎసిబి దాడులు

- లంచం తీసుకుని పట్టుబడిన జూనియర్ అసిస్టెంట్, డ్రైవర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎసిబి అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. చుక్కల భూమి జాబితా నుంచి భూమిని తొలగించేందుకు రైతు నుంచి లంచం తీసుకున్న జూనియర్ అసిస్టెంట్, రిజిస్ట్రార్ కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఎసిబి అధికారులు తెలిపిన వివరాల మేరకు.. రుద్రవరం మండలం ఆలమూరు గ్రామానికి చెందిన రైతు చిన్నప్ప తన 3.20 ఎకరాల భూమిని చుక్కల భూమి జాబితా నుండి తొలగించేందుకు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ జూనియర్ అసిస్టెంట్ కిరణ్ కుమార్‌రెడ్డిని కలిసి విషయం చెప్పారు. అందుకు రూ.30 వేలు లంచం ఇవ్వాలని జూనియర్ అసిస్టెంట్ డిమాండ్ చేయడంతో రూ.20 వేలు ఇచ్చేందుకు అంగీకరించారు. అనంతరం బాధిత రైతు ఎసిబి అధికారులను ఆశ్రయించారు. లంచం ఇచ్చేందుకు చిన్నప్ప రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చి కిరణ్ కుమార్ రెడ్డికి ఫోన్ చేయగా డ్రైవర్ ప్రకాష్ రెడ్డి వస్తాడని, అడ్వాన్స్‌గా రూ.5 వేలు ఆయనకు ఇవ్వాలని సూచించారు. రైతు నుంచి డబ్బులు తీసుకొని కార్యాలయంలోనికి వెళ్లిన ప్రకాష్‌రెడ్డిని ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ జూనియర్ అసిస్టెంట్ కిరణ్‌కుమార్‌రెడ్డి గతంలో అవుకులో కూడా లంచం తీసుకుంటూ దొరికాడని చెప్పారు. కిరణ్ కుమార్ రెడ్డి, డ్రైవర్ ప్రకాష్‌రెడ్డిలపై కేసు నమోదు చేశామని, వీరిద్దరిని ఎసిబి కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

కౌలు రైతులందరికీ పంట రుణాలు

- స్టేట్ లీడ్ బ్యాంకు ముందు కౌలు రైతుల ధర్నా

స్టేట్ లీడ్ బ్యాంకు ముందు ధర్నా కౌలు రైతులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కౌలు రైతుందరికీ పంట రుణాలు ఇవ్వాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు డిమాండ్ చేశారు. గురువారం విజయవాడ వన్‌టౌన్లోని లీడ్ బ్యాంకు ముందు కౌలు రైతు సంఘం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ.. కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వడానికి బ్యాంకర్లు సిద్ధపడటం లేదని పేర్కొన్నారు. కౌలు రైతులకు రైతుమిత్ర, జాయింట్ లయబిలిటీ గ్రూపుల్లో ఉన్నవారికి పంట రుణాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. సన్న, చిన్నకారు రైతులందరూ కౌలుదారులుగా ఉన్నారని, రాష్ట్ర ప్రభుత్వం, బ్యాంకు అధికారులు వారిపట్ల వివక్ష చూపిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఒకపక్క ఉంటే మరోవైపు సాగుచేస్తున్న పొలాలు నీరు ఇవ్వలేని స్థితి నెలకొందని తెలిపారు. పంటలు కాపాడుకునేందుకు కౌలు రైతులు కిలోమీటర్ల దూరం ట్యూబులు వేసి నీరు పెట్టుకుంటున్నారని, దీనివల్ల అదనపు భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆహార భద్రత తెచ్చిన సమయంలో సాగుదారులకు పంట పెట్టుబడికి వడ్డీ రాయితీతో బ్యాంకుల ద్వారా ప్రభుత్వాలు రైతులకు పంట రుణాలు మంజూరు చేయాలని నిర్ణయించారని, కానీ కౌలు రైతులకు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరం, కృష్ణా జిల్లా తోట్లవల్లూరులో దేవాదాయశాఖ అధికారులు సాగు ధ్రువీకరణ పత్రాలు ఇచ్చినా బ్యాంకర్లు రుణాలు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది దేవాదాయ భూమి కౌలుదారులు ఉంటే మూడు వేల మందికి మాత్రమే రుణాలు ఇచ్చారని తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై రాధాకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 32 లక్షల మంది కౌలుదారులు ఉంటే ఎనిమిది లక్షల మందికి మాత్రమే కార్డులు ఇచ్చామని రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా చెబుతున్నప్పటికీ లక్షమంది సిసిఆర్‌సి కార్డుదారులు మాత్రమే బ్యాంకుల్లో రుణాలు పొందారని పేర్కొన్నారు. డబుల్ ఫైనాన్స్ అవుతుందనే పేరుతో రుణాలు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారని వివరించారు. రిజర్వు బ్యాంకు నిబంధనల ప్రకారం రూ.1.60 లక్షల వరకూ రుణాలు ఇచ్చేందుకు అవకాశం ఉందని వివరించారు. బ్యాంకర్ల కమిటీ సమావేశంలో రూ.4 వేలకోట్లు కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలని నిర్ణయించినా, ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నప్పటికీ ఇంతవరకు ఇవ్వలేదని పేర్కొన్నారు. కౌలు రైతుల కోసం ప్రత్యేకంగా నెలరోజుల రుణమేళా నిర్వహించాలని డిమాండ్ చేశారు. జిల్లా, నియోజకవర్గ, మండల బ్యాంకర్ల కమిటీ సమావేశాల్లో కౌలు రైతుల సంఘాలను కూడా పిలిచి రుణాలపై సమీక్ష నిర్వహించాలని కోరారు. అనంతరం లీడ్ బ్యాంకు కన్వీనర్ రవీంద్రబాబుకు వినతిపత్రం సమర్పించారు. విధానపరమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని, సాంకేతికపరమైన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. ఈ ధర్నాకు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు ఎం వెంకటేశ్వర్లు, పంచకర్ల రంగారావు, బైరగాని శ్రీనివాసరావు, వి రాజబాబు, ఎం రామాంజనేయులు, పి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సానుభూతి కోసమే భువనేశ్వరి యాత్ర

- మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రజల్లో సానుభూతి పొందేందుకే నారా భువనేశ్వరి 'నిజం గెలవాలి' పేరుతో యాత్ర మొదలు పెట్టారని, నిజం గెలిస్తే మరింత ఇరుక్కుపోయేది చంద్రబాబే అన్న సంగతిని ఆమె గుర్తుంచుకోవాలని జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని షెల్టాన్ హోటల్‌లో ఆయన గురువారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. స్కిల్ స్కామ్ కేసులో ఆధారాలు ఉన్నాయి కాబట్టే చంద్రబాబు ఇంకా జైల్లో ఉన్నారన్నారు. అన్ని ఆధారాలతోనే చంద్రబాబును అరెస్టు చేశారని, ఇది అక్రమ అరెస్టు ఎలా అవుతుందని టిడిపి నాయకులను ప్రశ్నించారు. ముఖ్యమంత్రిపై బురదజల్లేందుకు లేనిపోని వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. 'మీ ఆస్తులపై విచారణకు కేంద్ర దర్యాప్తు సంస్థలను ఆహ్వానిస్తే అప్పుడు నిజం తెలుస్తుంది' అని భువనేశ్వరిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. 'నిజం గెలవాలి' అని కాకుండా అబద్ధం గెలవాలి, అన్యాయం గెలవాలి అంటూ యాత్ర చేపడితే కొంతైనా ఉపయోగం ఉంటుందని ఎద్దేవా చేశారు. పోలవరం ప్రాజెక్టు కేంద్ర పరిధిలో ఉన్నప్పటికీ నిధులిస్తే తాము పూర్తి చేస్తామని గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు చెప్పడం చారిత్రాత్మక తప్పిదమన్నారు. డయాఫ్రం వాల్ నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వం, సిడబ్ల్యుసి నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. పోలవరం నిర్వాసితులకు పరిహారం చెల్లించిన తరువాతే నీటిని నిల్వ చేస్తామని చెప్పారు.


నూతన వధూవరులతో సిఎం జగన్, మంత్రులు తదితరులు

'జక్కంపూడి' రిసెప్షన్‌కు సిఎం హాజరు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

తూర్పుగోదావరి జిల్లా రాజానగరం ఎంఎల్‌ఎ జక్కంపూడి రాజా సోదరుడు జక్కంపూడి గణేష్, సుకీర్తిల వివాహ రిసెప్షన్‌కు ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి హాజరయ్యారు. రాజానగరం మండలం దివాన్‌చెరువులోని ఓ ప్రయివేటు లే-అవుట్‌లో ఈ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు సిఎం జగన్ ఉదయం 11 గంటలకు తాడేపల్లి నుంచి మధురపూడి హెలీకాప్టర్‌లో వచ్చారు. అక్కడ పది నిమిషాల పాటు ప్రజాప్రతినిధులతో మాట్లాడారు.

పలువురిని నుంచి అర్జీలు స్వీకరించారు. వీటిని వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలతకు సూచించారు. అనంతరం ఎయిర్‌పోర్టు నుంచి రాజానగరం మండలం దివాన్‌చెరువులో రిసెప్షన్ ప్రాంతానికి రోడ్డు మార్గం గుండా వెళ్లారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. జక్కంపూడి కుటుంబ సభ్యులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం అక్కడ నుంచి నేరుగా రోడ్డుమార్గం గుండా మధురపూడి చేరుకుని హెలీకాప్టర్‌లో తాడేపల్లికి పయనమయ్యారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తానేటి వనిత, అంబటి రాంబాబు, దాడిశెట్టి రాజా, పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, కారుమూరి నాగేశ్వరరావు, ఎంపీలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు పాల్గొన్నారు. సినీ ప్రముఖులు రాంగోపాల్ వర్మ, సుమన్, విశ్వక్‌సేన్ తదితరులు పాల్గొన్నారు.

నిజమే గెలుస్తుంది

- అక్రమ అరెస్టులకు భయపడొద్దు : నారా భువనేశ్వరి
- రెండో రోజూ బాధిత కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ రాష్ట్రంలో ప్రతి మహిళా రోడ్డెక్కారు.. అరెస్టులు చేస్తున్నా భయపడడం లేదు.. ఈ పరిణామాలు చూస్తుంటే నిజం గెలుస్తుందన్న నమ్మకం నాకుంది..' అని చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ఉద్వేగభరితంగా ప్రసంగించారు. టిడిపి చేపట్టిన నిజం గెలవాలి యాత్ర రెండో రోజుకు చేరింది. గురువారం ఉదయం తిరుపతిలోని నారావారిపల్లి నుంచి బయల్దేరి తొట్టంబేడు మండలం కాసరం గ్రామానికి చెందిన వెంకట సుబ్బయ్య గౌడ, గాలి సుధాకర్, వెంకటరమణ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎన్‌టిఆర్ ట్రస్టు నుంచి రూ.మూడు లక్షల చొప్పున చెక్కులను అందజేశారు. సాయంత్రం తిరుపతి అంకుర ఆస్పత్రి సమీపంలో జరిగిన సభలో మహిళలతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తన కోసం చనిపోయిన వారి ఇళ్లకెళ్లి పరామర్శించి భరోసా ఇచ్చి రావాలని చంద్రబాబు తనకు చెప్పారని, జైల్లో ఉన్నా ప్రజల కోసమే ఆయన ఆలోచిస్తున్నారని తెలిపారు.

తొట్టంబేడులో వెంకటరమణ కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న భువనేశ్వరి

స్కిల్ డెవలప్‌మెంట్‌లో చంద్రబాబు కుంభకోణం చేశారని చెబుతున్నా ఆ డబ్బు ఏ అకౌంట్‌లోకి వెళ్లిందో సిఐడి అధికారులు చెప్పడం లేదన్నారు. ప్రజల సొమ్ము తన కుటుంబానికి అవసరం లేదని చెప్పారు. ఎన్నికలు దగ్గరకొస్తున్న సమయంలో చంద్రబాబును ప్రజల నుంచి దూరం చేయాలని కుట్రపన్ని జైల్లో నిర్బంధించారని తెలిపారు. జైలు నుంచి చంద్రబాబు రాసిన లేఖపైనా విచారణ ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం పెట్టే హింస భరించలేక పరిశ్రమలు వేరే రాష్ట్రాలకు తరలిపోతున్నాయని, ఉదాహరణగా అమరరాజా పరిశ్రమ గురించి చెప్పారు. ఎస్‌వి యూనివర్సిటీ నుంచే చంద్రబాబు రాజకీయ జీవితం మొదలైందని, ఆయన రాజకీయ చతురతకు ప్రపంచ దేశాలు కీర్తిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పంచమర్తి అనురాధ, తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షులు వెంగలపూడి అనిత, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, శ్రీకాళహస్తి నియోజకవర్గ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి, జనసేన రాష్ట్ర నాయకులు పసుపులేటి హరిప్రసాద్, కిరణ్‌రాయల్ పాల్గొన్నారు.

మీ ఆస్తులపై సిబిఐ విచారణకు సిద్ధమా?

- నారా భువనేశ్వరికి మంత్రి రోజా సవాల్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

'నా ఆస్తులపై సిబిఐ విచారణకు సిద్ధంగా ఉన్నానని, మీరు సిద్ధమేనా?' అని మాజీ సిఎం చంద్రబాబు సతీమణి భువనేశ్వరికి మంత్రి ఆర్‌కె రోజా సవాల్ విసిరారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని మార్కండేయేశ్వర స్వామి ఆలయాన్ని ఎంపి మార్గాని భరత్‌రామ్‌తో కలిసి ఆమె గురువారం సందర్శించారు. అనంతరం రోజా మీడియాతో మాట్లాడుతూ భువనేశ్వరి చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. స్కిల్ స్కామ్‌లో రూ.వంద కోట్లు దోచుకుని సిఐడి దర్యాప్తులో చంద్రబాబు అడ్డంగా దొరికిపోయి జైలులో ఉండడాన్ని చూసి భువనేశ్వరి జీర్ణించుకోలేక, ఏమి మాట్లాడుతున్నారో ఆమెకే తెలియడం లేదని ఎద్దేవా చేశారు. చంద్రబాబు హయాంలో జరిగిన స్కామ్‌లన్నీ బయటకు తీస్తే జీవితాంతం ఆయన జైల్లో ఉన్నా శిక్ష చాలదన్నారు. ఏ నేరం చేయకపోతే ఇన్ని రోజులు ఆయన జైలులో ఎందుకున్నారో సమాధానం చెప్పాలన్నారు. సెప్టెంబర్ తొమ్మిదిన చంద్రబాబు అరెస్టయితే ఆ నెల నాలుగో తారీఖున సంతకం ఉన్న చెక్కులను భువనేశ్వరి ఎలా పంపిణీ చేస్తున్నారని ప్రశ్నించారు. అంటే చంద్రబాబు అరెస్టు అవుతారని ముందే తెలిసి చెక్కులు సిద్ధం చేశారా అంటూ వ్యాఖ్యానించారు. వారి వెంట వైసిపి నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

టిటిడి ఉద్యోగులకు ముఖ ఆధారిత హాజరు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ముఖ ఆధారిత హాజరును ప్రారంభిస్తున్న టిటిడి ఇఒ ఎవి ధర్మారెడ్డి

టిటిడి ఉద్యోగులకు ముఖ ఆధారిత హాజరు (ఫేసియల్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టమ్) విధానాన్ని టిటిడి పరిపాలనా భవనంలో ఇఒ ఎవి.ధర్మారెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ టిటిడిలో ఎనిమిది 8 వేలకుపైగా రెగ్యులర్ ఉద్యోగులు, 10 వేలకుపైగా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పని చేస్తున్నారని తెలిపారు. వీరందరికీ ముఖ ఆధారిత హాజరును అమలు చేస్తున్నామని చెప్పారు. దీనివల్ల ఉద్యోగుల్లో క్రమశిక్షణ, పని సామర్థ్యం పెరుగుతాయన్నారు. తిరుమల, తిరుపతిలోని టిటిడి కార్యాలయాలతోపాటు విద్యా సంస్థలు, ఆస్పత్రులు, ఇతర సంస్థల్లో ముఖ ఆధారిత హాజరును అమలు చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, డిప్యూటీ ఇఒ గోవిందరాజన్, ఐటి జనరల్ మేనేజర్ సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సర్వేయర్లకు కార్పొరేట్ వైద్యం !

- రీ సర్వే పూర్తయ్యే వరకు సేవలు
- జిల్లాకు ఒక ఆస్పత్రి ఎంపిక

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా భూముల రీసర్వేలో పాల్గొంటున్న గ్రామ సర్వేయర్లకు అత్యవసర వైద్య సహాయం అవసరమైన నేపథ్యంలో యుద్ధ ప్రాతిపదికన కార్పొరేట్ వైద్యం అందించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇందు కోసం జిల్లాకు ఒక కార్పొరేట్ ఆస్పత్రిని ఎంపిక చేసి జాబితా పంపాలని ప్రభుత్వం కింది స్థాయి సిబ్బందిని మౌఖికంగా ఆదేశించింది. ఈ నేపథ్యంలో 26 జిల్లాల నుంచి 26 ఆస్పత్రుల పేర్లు ప్రభుత్వానికి తాజాగా చేరినట్లు సమాచారం. ఇలా కార్పొరేట్ వైద్యం ఎల్లప్పుడూ అందించడం సాంకేతికంగా కష్టమవుతున్న నేపథ్యంలో భూముల రీ సర్వే ప్రక్రియ పూర్తయ్యే కాలంలో మాత్రమే ఈ అదనపు సేవలు అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. భూముల రీ సర్వేలో నిమగ్నమైన సిబ్బందికి ఎంప్లాయి హెల్త్ కార్డు (ఇహెచ్‌ఎస్) కొందరికి లేకపోవడం, ఇహెచ్‌ఎస్‌లో వైద్యం చేయని వ్యాధుల బారిన పడిన కుటుంబాలు ఆర్థికంగా చితికిపోవడం జరుగుతోంది. ఇటీవల కాలంలో విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో భూముల రీ సర్వే సందర్భంగా ఒకరిద్దరు సర్వేయర్లు పాము కాటుకు గురైన సందర్భాలు కూడా లేకపోలేదు. ఈ నేపథ్యంలో తమ సహచరుల నుంచి వైద్య ఖర్చుల కోసం సహాయాన్ని కోరుతూ సాంకేతికంగా వాట్సాప్ గ్రూప్స్‌లో అప్పీల్ చేసుకున్నట్లు కూడా గ్రామ సర్వేయర్ల సంఘం నేతలు పేర్కొంటున్నారు. ఆర్థికంగా ఆదుకోవడం చిరుద్యోగులకు కష్టతరంగా మారిన నేపథ్యంలో కార్పొరేట్ వైద్యం గురించి ల్యాండ్ రీ సెటిల్‌మెంట్ కమిషనరు దృష్టికి రాష్ట్ర గ్రామ సర్వేయర్ల సంఘం తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో భూముల రీ సర్వే ప్రక్రియ నడిచినంత కాలం ఎటువంటి చెల్లింపులూ లేకుండా కార్పొరేట్ వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం. ఇందులో భాగంగా ఆరోగ్యశ్రీ కమిషనరుతోనూ సంప్రదింపులు జరిపినట్లు తెలిసింది.

ఇహెచ్‌ఎస్ కార్డులు అందరు ఉద్యోగులకూ త్వరితగతిన అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులతోపాటు గ్రామ సర్వేయర్లకు అవగాహన కల్పించాలని ఉద్యోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కుప్పకూలిన మార్కెట్లు

- సెన్సెక్స్ 900 పాయింట్ల పతనం
- రూ.3 లక్షల కోట్ల సంపద ఆవిరి
- ఏ దశలోనూ కోలుకోని సూచీలు
- బోరుమన్న మదుపర్లు

న్యూఢిల్లీ : భారత స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. వరుసగా ఆరో రోజూ నేల చూపులు చూశాయి. గురువారం సెషన్‌లోనూ సూచీలు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఉదయం నష్టాలతో ప్రారంభమైన షేర్లు.. ఏ దశలోనూ కోలుకోలేదు. బేర్ పంజాతో ఒక్క పూటలో లక్షల కోట్ల మదుపర్ల సంపద ఆవిరయ్యింది. తుదకు సెన్సెక్స్ 901 పాయింట్లు క్షీణించి 63,148కి పతనమయ్యింది. నిఫ్టీ కూడా 265 పాయింట్ల నష్టంతో 18,857కు పడిపోయి.. నాలుగు మాసాల కనిష్ట స్థాయి వద్ద నమోదయ్యింది. సెన్సెక్స్ ఉదయం 63,774.16 వద్ద ప్రారంభం కాగా.. ఇంట్రాడేలో 63,903 కనిష్ట స్థాయిని చవి చూసింది. విద్యుత్ రంగ సూచీలు మినహా మిగితా అన్ని రంగాలు పతనమయ్యాయి. ఒక్క పూటలోనే బిఎస్‌ఇ మార్కెట్ కాపిటలైజేషన్ రూ.323.8 లక్షల కోట్ల నుంచి రూ.306 లక్షల కోట్లకు పడిపోయింది. దీంతో దాదాపు రూ.3 లక్షల కోట్ల సంపద ఆవిరయ్యింది. ఇంతక్రితం ఐదు సెషన్లలో రూ.14.6 లక్షల కోట్ల సంపద హరించుకుపోయింది. ఇజ్రాయిల్ - హమాస్ ఆందోళనకు తోడు, అమెరికన్ బాండ్‌లపై రాబడుల పెరుగుదల పెరగడం, ఎఫ్‌ఐఐలు తరలిపోవడం తదితర అంశాలు భారత మార్కెట్ల పతనానికి ప్రధాన కారణంగా ఉన్నాయి. యుద్ధంలో పశ్చిమాసియాలోని కొన్ని దేశాలు భాగస్వామ్యం కావడంతో పరిస్థితి మరింత తీవ్రతకు దారి తీస్తోంది. ఈ పరిణామాలు అంతర్జాతీయ మార్కెట్లను ప్రభావితం చేస్తున్నాయి. ఆ ప్రభావం భారత ఈక్విటీ మార్కెట్లపైనా పడుతోంది. అమెరికా వడ్డీ రేట్ల పెంపు సంకేతాలు ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని మరింత దెబ్బతీస్తున్నాయి. ారత ఈక్విటీ మార్కెట్లలో బ్యాంకింగ్, ఫైనాన్షియల్, ఆటో, మెటల్ రంగాల్లో అధికంగా అమ్మకాలు చోటు చేసుకున్నాయి. సెన్సెక్స్-30 ఇండెక్స్‌లో ఐదు షేర్లు మాత్రమే లాభపడ్డాయి. యాక్సిస్ బ్యాంక్, ఐటిసి, హెచ్‌సిఎల్ టెక్, ఎన్‌టిపిసి, ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేర్లు రాణించాయి. ఎంఅండ్‌ఎం, బజాజ్ ఫైనాన్స్, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, నెస్లే ఇండియా, టైటన్, జెఎస్‌డబ్ల్యు స్టీల్, టెక్ మహీంద్రా, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, మారుతీ, టాటా మోటార్స్ షేర్లు అత్యధికంగా 4 శాతం వరకు నష్టపోయిన వాటిలో ఉన్నాయి. బిఎస్‌ఇలో దాదాపు 1211 సూచీలు లాభపడగా.. 1943 స్టాక్స్ నేల చూపులు చూశాయి. మరో 101 సూచీలు యథాతథంగా నమోదయ్యాయి.



కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - మాచర్ల (పల్నాడు జిల్లా)

మార్కండేయ (ఫైల్)

అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గొట్టిపాళ్లలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గొట్టిపాళ్లకు చెందిన మారాజి మార్కండేయ (40) తనకున్న 1.25 ఎకరాల సొంత పొలంతోపాటు మరో నాలుగు ఎకరాలను కౌలుకు తీసుకుని పత్తి, మిర్చి పంటలు సాగుచేసేవారు. గత కొన్నేళ్లగా వర్షాభావం, చీడపీడలతో పంటలు చేతికందకపోవడంతో రూ.12 లక్షల వరకు అప్పులయ్యాయి. అప్పుల వాళ్ల ఒత్తిళ్లు తట్టుకోలేక దుర్గి మండలం అడిగొప్పుల గ్రామానికి కుటుంబం సహా వలస వెళ్లి అక్కడే కూలి పనులు చేసుకుంటున్నారు. అప్పుడప్పుడూ సొంతూరుకు వచ్చి పొలాన్ని చూసుకుంటూ ఉండేవారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం గొట్టిపాళ్లకు వచ్చిన మార్కండేయ తన పొలానికి సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. మృతుడు మార్కండేయకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. భార్య సైదమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వ్యవసాయ రంగంతోనే సమగ్రాభివృద్ధి

- చర్చాగోష్టిలో వక్తలు

ప్రజాశక్తి-నెల్లూరు

రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందాలంటే వ్యవసాయ రంగంతోనే సాధ్యమవుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా సమగ్రాభివృద్ధిపై నెల్లూరులోని డాక్టర్ విజయ్‌కుమార్ మెమోరియల్ హాస్పిటల్ సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో చర్చాగోష్టి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. రూరల్ శాసన సభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రారంభోత్సవ ఉపన్యాసం చేశారు. అనంతరం మాజీ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందాలంటే రైతాంగ, వ్యవసాయపరంగా అభివృద్ధి సాధించాలన్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రిగా తాను వ్యవహరించిన సమయంలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పది నుంచి పన్నెండు శాతం నిధులు ప్రాజెక్టుల నిర్మాణానికి, సాగునీటి రంగాలకు కేటాయించామని గుర్తు చేశారు. నేడు వైసిపి ప్రభుత్వం కేవలం మూడు, నాలుగు శాతం మాత్రమే నిధులు కేటాయించడం దుర్మార్గమన్నారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. సమాజంలో అందరికంటే వెనుకబడి ఎవరైతే ఉన్నారో వారి గురించి, వారి అభివృద్ధి గురించి మాట్లాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య మాట్లాడుతూ.. ఎస్‌సి, ఎస్‌టి వర్గాలు జీవిస్తున్న ప్రాంతాల్లో శ్మశాన వాటికలు లేవని, వారికి భూములు లేవని, ల్యాండ్ పర్చేజ్ పథకం కింద కొనుగోలు చేసి భూ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజానైన్సు ఉద్యమనేత జి.మాల్యాద్రి, పలువురు ప్రజా సంఘాల, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఈ చర్చావేదికలో పాల్గొన్నారు.

ఆ నగదు లెక్కల్లో ఉన్నదే

- సోనోవిజన్ వివరణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖలో రూ.1.30 కోట్ల నగదు పూర్తిగా అకౌంట్ లెక్కలు ఉన్నవేనని, బ్లాక్‌మనీ, హవాలా వంటివి ఏమీ లేవని సోనోవిజన్ యాజమాన్యం వివరణ ఇచ్చింది. ఈ మేరకు గురువారం ప్రజాశక్తి కార్యాలయానికి ప్రకటన పంపింది. తమ సంస్థకు ఎనిమిదేళ్ల నుండి హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకులో అకౌంటు ఉందని, వారి వద్ద రూ.70 కోట్ల ఓడి ఉందని తెలిపారు. అందువల్ల తాము బ్రాంచీల్లో కట్టే డబ్బుకు ఎటువంటి ఛార్జీలు లేకుండా తీసుకునేవారని, ఈ మేరకు లెటర్ కూడా ఇచ్చారని పేర్కొన్నారు. కొద్ది నెలల నుండి రూ.36.8 లక్షల ఛార్జెస్ వేశారని తెలిపారు. దీనివల్ల కేసు కూడా ఫైలు చేశామని, లావాదేవీలన్నీ ఐసిఐసిఐ బ్యాంకుకు మార్చామని పేర్కొన్నారు. ఆ బ్యాంకు యాజమాన్యం రూ.11 కోట్ల ఓడి ఇచ్చిందని, మిగిలిన రూ.59 కోట్లకు డాక్యుమెంటేషన్‌కు సమయం పడుతుందని తెలిపినట్లు వివరించింది. తాము రెగ్యులర్‌గా ఐసిఐసిఐ బ్యాంకులో డబ్బు జమచేస్తున్నామని, రూ.70 కోట్ల డాక్యుమెంటేషన్ పూర్తయ్యే వరకు వైజాగ్ బ్రాంచీల్లో డబ్బులు కడితే ఛార్జీలు పడతాయని బ్రాంచీలో తెలిపారని వివరించారు. దసరా పండగ నేపథ్యంలో ఎక్కువ లావాదేవీలు ఉన్నందున రూ.1.30 కోట్లను విజయవాడ బ్యాంకు బ్రాంచీలో కట్టేందుకు పంపించామని పేర్కొన్నారు. వీటికి సంబంధించి తమ విజయవాడ బ్రాంచ్‌కు ట్రాన్స్‌ఫర్ నోట్ కూడా పంపించామని పేర్కొన్నారు. స్టాక్ కావాల్సి ఉండటంతో 30 మొబైల్ ఫోన్లు, ఆరు వాషింగ్ మెషిన్లు పంపించి వాటికి ఇసిలు, ఈ వేబిల్స్ మొత్తం జత చేశామని, దీన్ని స్టోర్ ఆటోలో తమ సంస్థ డ్రైవర్ తీసుకెళ్లారని పేర్కొన్నారు. క్యాష్ మొత్తం విడిగా బాక్స్ పెట్టేకంటే భద్రత ఉంటుందనే ఉద్దేశంతో వాషింగ్ మెషిన్లో ప్యాకెట్ల రూపంలో పెట్టామని తెలిపారు. ఇది పూర్తిగా దసరా వ్యాపారంలో వైజాగ్ బ్రాంచ్‌లో వచ్చిన డబ్బని పేర్కొన్నారు. వైజాగ్ స్టోర్స్ ద్వారకానగర్, గాజువాక, గోపాలపట్నం, మధురవాడతోపాటు విజయనగరం, శ్రీకాకుళం 10 బ్రాంచీల్లో దసరా వ్యాపారం రూ.20.44 కోట్లని పేర్కొన్నారు. అందులో క్రెడిట్ కార్డులు, ఫైనాన్స్, భారత్ పే వంటి పేమెంట్లు పోగా వచ్చిన క్యాష్‌లో వైజాగ్ బ్యాంకు బ్రాంచీల్లో కొంత కట్టామని వివరించారు. మిగిలిన డబ్బు విజయవాడ బ్రాంచీలకు పంపించామని, ఇది పూర్తిగా అకౌంట్లలో ఉన్న డబ్బేనని సోనోవిజన్ యాజమాన్యం తెలిపింది.

వరిదుబ్బులతో రైతుల నిరసన

ప్రజాశక్తి - ముసునూరు (ఏలూరు జిల్లా)

సాగునీరందక ఎండిన వరి దుబ్బులతో రైతులు నిరసన తెలిపారు. నష్టపోయిన తమను తక్షణమే ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా ముసునూరు మండలం గుడిపాడులో సాగునీరందక ఎండిపోయిన వరి పంటలను సిపిఎం, ఎపి రైతు సంఘం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గురువారం పరిశీలించారు. ఎండిన వరి దుబ్బులతో రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. నష్ట పరిహారమిచ్చి ఆదుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ వర్షాభావం వల్ల గుడిపాడు పంచాయతీ పరిధిలోని రావికుంట చెరువులో నీరులేక సుమారు 50 ఎకరాల వరి పంట ఎండిపోయిందని, రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు సుమారు రూ.25 వేలకుపైగా పెట్టుబడి పెట్టారని, పంట పొట్టదశకు చేరుకున్న తర్వాత నీరందక పంట ఎండిపోయిందన్నారు. జలకళ పథకంలో పేద రైతులకు బోర్లు వేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. ప్రభుత్వం స్పందించి పేద రైతులకు ఉచిత బోరు పథకం అమలు చేయాలని, ఎకరాకు రూ.30 వేలు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ తదితరులు మాట్లాడారు.

నంద్యాల్‌లో కొత్త శాఖ తెరిచిన ఐసిఐసిఐ బ్యాంక్

కర్నూల్ : ప్రయివేటు రంగంలోని ఐసిఐసిఐ బ్యాంక్ నంద్యాల్ పట్టణంలోని టెక్కిలో నూతన శాఖను తెరిచినట్లు వెల్లడించింది. దీన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి ప్రారంభించారని పేర్కొంది. ఈ శాఖలో సిఆర్‌ఎం మిషన్ సహా డిపాజిట్లు, ఉపసంహరణల సర్వీసులను అందించనున్నట్లు పేర్కొంది. రాష్ట్రంలో 235 శాఖలు, 480 ఎటిఎంలతో విస్తరించినట్లు తెలిపింది.

ఏథర్ ఎనర్జీ ఎక్స్ఛేంజీ ఆఫర్లు

న్యూఢిల్లీ : ఏథర్ ఎనర్జీ తన ద్విచక్ర ఇవిలపై పండుగ సీజన్ సందర్భంగా ప్రత్యేక ప్రయోజనాలు కల్పిస్తున్నట్లు తెలిపింది. వినియోగదారులు ఏథర్ 450ఎస్, 450ఎక్స్‌లను కొనుగోలు చేయడానికి ఇతర వాహనాలను ఎక్స్ఛేంజీ చేయడం ద్వారా రూ.40వేల వరకు బెనిఫిట్స్ పొందవచ్చని తెలిపింది. ఎక్స్ఛేంజీ విలువతో పాటు ఫెస్టివ్ బెనిఫిట్ కింద రూ.5వేల వరకు, రూ.1500 తగ్గింపు, రూ.6వేల వరకు ఇఎంఐ క్యాష్‌బ్యాక్ ఆఫర్లను అందిస్తున్నట్లు వెల్లడించింది. 5.99 వడ్డీ రేటుతో 24 నెలల ఇఎంఐ సదుపాయాన్ని ఎంచుకోవచ్చని పేర్కొంది.

రూ.3వేల కోట్ల నిధులను సమీకరించిన ఓలా ఎలక్ట్రిక్

బెంగళూరు : ప్రముఖ ద్విచక్ర విద్యుత్ వాహనాల కంపెనీ ఓలా ఎలక్ట్రిక్ రూ.3,000 కోట్ల నిధులు సమీకరించినట్లు గురువారం వెల్లడించింది. టెమాసెక్ నేతృత్వంలోని ఇన్వెస్టర్లతో పాటు బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) నుంచి ఈ మొత్తాన్ని అందుకోనున్నట్లు వెల్లడించింది. నిధుల సమీకరణ ప్రక్రియ పూర్తయ్యిందని పేర్కొంది. ఈ నిధులను వ్యాపార విస్తరణకు ఉపయోగించనున్నట్లు తెలిపింది. అదే విధంగా తమిళనాడులోని కృష్ణగిరిలో లిథియం ఐయాన్ సెల్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుందని వెల్లడించింది. భవిష్యత్తులో ఈ సంస్థ ఇవి సైకిళ్లు, కార్లు విభాగంలోకి ప్రవేశించనుంది.

సిఎస్‌ఆర్‌తో 60 లక్షల మందికి సాయం

- టాటా మోటార్స్ వెల్లడి

ముంబయి : దిగ్గజ ఆటోమొబైల్ కంపెనీ టాటా మోటార్స్ తన 9వ వార్షిక సిఎస్‌ఆర్ రిపోర్ట్‌ను విడుదల చేసింది. ఆరోగ్యం, విద్యా, పర్యావరణ రంగాల్లోని సామాజిక సవాళ్లను పరిష్కరించేందుకు విస్తృత ప్రయత్నాలు చేసినట్లు పేర్కొంది. ఈ క్రమంలోనే కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్‌ఆర్) కింద గత 10 ఏళ్లలో 60 లక్షల మందికి ప్రయోజనం కల్పించినట్లు వెల్లడించింది.

యుపిఐ చెల్లింపులకే ప్రాధాన్యత

- ఆన్‌లైన్ కొనుగోళ్లలో తగ్గుతున్న డెబిట్ కార్డులు

న్యూఢిల్లీ : ఆన్‌లైన్ కొనుగోళ్లలో యుపిఐ చెల్లింపులకే వినియోగదారులు ఎక్కువ మొగ్గు చూపుతున్నారని ఆర్‌బిఐ విశ్లేషించింది. డెబిట్ కార్డుల వినియోగం క్రమంగా తగ్గుతోందని పేర్కొంది. గతేడాది ఏప్రిల్‌లో ఇ-కామర్స్‌లో డెబిట్ కార్డుల లావాదేవీల సంఖ్య 11.7 కోట్లుగా ఉండగా.. ఇది 2023 సెప్టెంబర్ నెలలో సగానికి పైగా తగ్గి 5.1 కోట్లకు పడిపోయింది. లావాదేవీల విలువ మొత్తం రూ.21,000 కోట్ల నుంచి రూ.16,127 కోట్లకు తగ్గింది. అదే సమయంలో యుపిఐ చెల్లింపులు 22 లక్షల నుంచి ఏకంగా 61 లక్షలకు చేరింది. తక్కువ మొత్తం చెల్లింపులకు చాలా మంది యుపిఐ వైపు ఆసక్తి చూపుతున్నారు.

సంపాదకీయం

కాషాయ పాఠ్య ప్రణాళిక

'ఇండియా-భారత్' వివాదం మళ్లీ తెరమీదికొచ్చి రాజకీయంగా తీవ్ర అలజడికి కారణమైంది. ఈ మారు వివాదానికి కేంద్రమైంది నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సిఇఆర్‌టి). అన్ని పాఠ్య పుస్తకాల్లో 'ఇండియా' స్థానంలో 'భారత్'ను ఉపయోగించాలని సాంఘిక శాస్త్రాల విషయాలపై పరిశీలనకు ఎన్‌సిఇఆర్‌టి నియమించిన ఉన్నత కమిటీ సిఫారసు చేసింది. అంతేనా, చరిత్రలో హిందూ రాజుల విజయ గాధలకు అత్యధిక ప్రాధాన్యమివ్వాలని, ప్రాచీన, మధ్య, ఆధునిక చరిత్రలతో పాటు భారత సంప్రదాయ చరిత్రను విద్యార్థులకు బోధించాలంది. కమిటీ సిఫారసులపై ప్రతిపక్షాలు, విద్యావేత్తలు, మేధావుల నుంచి ముప్పేటా విమర్శలు వెల్లువెత్తడంతో ఎన్‌సిఇఆర్‌టి డైరెక్టర్ దినేశ్ ప్రసాద్ సకలానీ స్పందిస్తూ కమిటీ సిఫారసులు ప్రతిపాదనల దశలోనే ఉన్నాయని, తుది నిర్ణయం తీసుకోలేదని వివరణిచ్చారు. అంతటితోనే వివాదానికి ఫుల్‌స్టాప్ పడుతుందని భావించలేం. సైద్ధాంతికంగా, ఉద్దేశపూర్వకంగానే మోడీ ప్రభుత్వం పలు వ్యవస్థల్లో తమ హిందూత్వ ఎజెండా చొప్పింపును చూస్తూనే ఉన్నాం. వాటికి కొనసాగింపుగానే ఎన్‌సిఇఆర్‌టి పాఠ్య ప్రణాళికల్లో మార్పులను అర్థం చేసుకోవాలి.

ఢిల్లీలో నిర్వహించిన జి20 శిఖరాగ్ర సమావేశంలో పాల్గొన్న దేశాధినేతలకు రాష్ట్రపతి విందు ఇవ్వగా, ఆ సందర్భంగా కేంద్రం ప్రచురించిన ఆహ్వాన పత్రికలలో తొలిసారి 'ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా' స్థానంలో 'ప్రెసిడెంట్ ఆఫ్ భారత్' అని పేర్కొనడంతో వివాదం చెలరేగింది. అనంతరం జరిగిన ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ఇండియా పేరు భారత్‌గా మారుస్తారన్న చర్చ వచ్చింది. ఇప్పుడు తిరిగి ఎన్‌సిఇఆర్‌టి తెనెతుట్టెను కదిలించింది. దేశం పేరు మార్పు అనేది అదేదో విపక్షాల ఫోరం 'ఇండియా' అని పేరు పెట్టుకుంది కాబట్టి ఆ పదం ఉచ్చరించడం ఇష్టం లేక మోడీ ప్రభుత్వం అధాటుగా తీసుకున్న నిర్ణయం అనుకుంటే పొరపాటు. మన దేశానికి ఏ పేరు పెట్టాలనే అంశంపై హిందూత్వ వాదుల ప్రతిపాదనలు వేరేగా ఉన్నాయి. హిందూత్వ సిద్ధాంతకర్తగా ఆర్‌ఎస్‌ఎస్ పిలుచుకునే సావర్కర్, 1923లో రాసిన 'హిందుత్వ' గ్రంథంలో హిందూస్తాన్ సహా పలు పేర్లు సూచించాడు. ఆయనా విష్ణుపురాణంలో ఉన్న భారత ఖండం నామధేయాన్ని ప్రస్తావించాడు. ఎన్‌సిఇఆర్‌టి వేసిన కమిటీ కూడా మక్కీకి మక్కీ అదే ప్రస్తావన చేయడం గమనార్హం. కాబట్టి వాస్తవాలతో, పరిశోధనలతో, ఆధారాలతో కమిటీ సిఫారసు చేయలేదని గుర్తించాలి. ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంత అమలులో భాగంగానే కమిటీ సిఫారసులను చూడాలి.

పాఠ్య ప్రణాళికల ఫ్రేమ్‌వర్క్‌పై ఎన్‌సిఇఆర్‌టి 2021లో 25 ఉన్నత కమిటీలు వేయగా సాంఘిక శాస్త్రాల పరిశీలనపై సి.ఐ ఐజాక్ ఛైర్మన్‌గా వేసిన కమిటీ ఒకటి. ఐజాక్ చరిత్రకారునిగా కంటే ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతవాదిగానే ప్రాచుర్యం పొందారు. భారత చరిత్ర పరిశోధన మండలిలో సభ్యుడు కూడా. 1975లో ఎబివిపిలో పని చేశారు. ప్రస్తుతం ఆర్‌ఎస్‌ఎస్‌తో సంబంధాలు కలిగిన భారతీయ విచార కేంద్రం కేరళ విభాగానికి వర్కింగ్ ప్రెసిడెంట్. ఐజాక్ కమిటీలోని మరో సభ్యుడు వందనా మిశ్రా సైతం ఎబివిపి కార్యదర్శిగా, ఉపాధ్యక్షునిగా పని చేశారు. ఇటువంటి వారున్న కమిటీలు ఎటువంటి సిఫారసులు చేస్తాయో అర్థం చేసుకోవచ్చు. పౌరసత్వ చట్టం, ఏకరూప పౌర స్మృతి, అగ్నివీర్, చరిత్ర వక్రీకరణ, సైన్స్‌లో డార్విన్ పరిణామ సిద్ధాంతం ఎత్తివేత... అనేకానేక వివాదాలు ఆర్‌ఎస్‌ఎస్ అమ్ముల పొదిలో ఉన్నాయి. విద్యకు కాషాయం కప్పే నానారకాల అంశాలు మోడీ సర్కారు ప్రతిపాదించిన నూతన జాతీయ విద్యావిధానంలో నిక్షిప్తమయ్యాయి. కోట్లాది పిల్లల మెదళ్లల్లో భావ కాలుష్యాన్ని అవి నింపుతున్నాయి. కేరళ వామపక్ష ప్రభుత్వం, మరికొన్ని విపక్ష రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రమే రాజ్యాంగపరంగా రాష్ట్రాలకు విద్యపై ఉన్న హక్కును రక్షిస్తూ కేంద్ర విధానాలను ప్రతిఘటిస్తున్నాయి. రాజ్యాంగ విలువలను కాపాడుతూ, సాంస్కృతిక వైవిధ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, నిజమైన చరిత్ర బోధించాలి. శాస్త్రీయ ఆలోచన పెంపొందించాలి. విద్యలో బిజెపి సంకుచిత రాజకీయాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాల్సిన తరుణం.

మహనీయుల మాట



ఒక నాయకుడు తన చుట్టూ ఏమి జరుగుతున్నదో తెలుసుకోగలిగినప్పుడే తన బృందాన్ని స్వేచ్ఛగా నడిపించగలడు. నాయకత్వమంటే నిరంతర అభ్యసనం.

-ఎ.పి.జె అబ్దుల్ కలాం,
భారత పూర్వ రాష్ట్రపతి.

మహిళల శ్రమకు కొలమానం ఏదీ?

సంజన మనక్తల

నమ్య మహాజన్

విష్ణు భరత్‌రామ్

వ్యాఖ్య

తల్లిదండ్రులు ఇంటి బయట పని చేస్తున్నప్పుడు వారి బిడ్డల ఆలనాపాలనా చూసుకోవడానికి ఎవరో ఒకరు ఉండాలనేది విశ్వవ్యాప్తంగా అంగీకరించిన సత్యం. భారతదేశంలోని కుటుంబ నిర్మాణాలు చారిత్రాత్మకంగా తరచూ ఈ అవసరాన్ని పూరించాయి. తండ్రులు ఇంటి వెలుపల పని చేస్తారు. పిల్లలు, పెద్దల సంరక్షణ పనులను తల్లులు చేస్తారు. అయితే, ఈ విధమైన కుటుంబ నిర్మాణం...పెరుగుతున్న భారత దేశ ఆశయాలకు అనుకూలంగా లేదు. దేశం 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలంటే, మహిళల భాగస్వామ్యం వుండాలి. అందుకు రెండు ప్రత్యేక మార్గాలు ఉన్నాయి: మహిళల పని (తరచుగా పిల్లలు, పెద్దల సంరక్షణ పని)ని సక్రమంగా విలువ కట్టాలి. ఇంటి బయట ఆర్థిక కార్యకలాపాల్లో పాల్గొనడానికి మహిళలకు తగిన మద్దతు ఇవ్వాలి.

మహిళలందరూ పని చేస్తారు. కానీ వారందరికీ జీతం అందదు. 2023 నోబెల్ గ్రహీత, ఆర్థికవేత్త క్లాడియా గోల్డిన్ అమెరికా చరిత్రపై చేసిన కృషి ఈ అంశాన్నే తెలియచేస్తుంది. నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్ 2020లో విడుదల చేసిన భారతదేశపు మొట్టమొదటి 'జాతీయ సమయ వినియోగ సర్వే' ప్రకారం 81.2 శాతం మహిళలు ఎటువంటి చెల్లింపు లేని ఇంటి చాకిరిలో నిమగ్నమై ఉన్నారు. అదే పురుషుల విషయానికి వచ్చేసరికి 26.1 శాతం మాత్రమే అటువంటి పనిలో వున్నారు. పురుషులు వారానికి సగటున 42 గంటల పాటు సాంప్రదాయకంగా ఆర్థిక కార్యకలాపంగా పరిగణించే ఉత్పత్తి పనుల్లో పాల్గొంటారు. స్త్రీలు 19 గంటలు పాల్గొంటున్నారు. అయినప్పటికీ మహిళలు...గృహ నిర్వహణ, పిల్లలు-వృద్ధుల సంరక్షణ, కుటుంబంలో జబ్బు పడిన వారి కోసం 34.6 గంటలు వెచ్చిస్తారు. పురుషులు ఈ విధమైన పనులకు వెచ్చించేది 3.6 గంటలు. అంటే స్త్రీలు పురుషుల కంటే 10 రెట్లు ఎక్కువగా కుటుంబ నిర్వహణ పనులలో వుంటారన్నమాట.

దీనికి రెండు ఇబ్బందులు ఉన్నాయి. ఒకటి- శ్రామిక మహిళలు భయంకరమైన "రెట్టింపు భారాన్ని" ఎదుర్కొంటారు. ఇక్కడ ఇంటి బయట పని చేయడం, కుటుంబ ఆదాయానికి తోడ్పడడం వల్ల వారి ఇంటి చాకిరి ఏమీ తగ్గదు. రెండు-పిల్లలు, వృద్ధుల సంరక్షణకు వారు చేసే పనులేవీ ఆర్థిక కార్యకలాపాలుగా లెక్కించబడవు. ఈ పనులతో అలసిపోయిన మహిళలకు పురుషులతో పోల్చుకుంటే వారంలో అతి తక్కువ విశ్రాంతి సమయమే మిగులుతుంది.



ఎస్‌బిఐ నివేదిక ప్రకారం ఎటువంటి చెల్లింపు లేకుండా మహిళలు చేస్తున్న పని ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నది. ఇది జిడిపిలో 7.5 శాతానికి బాధ్యత వహిస్తుంది. మరో మాటలో చెప్పాలంటే, మహిళలు ఇంటి పని భారాన్ని మోయడమే కాకుండా, ఈ ప్రక్రియలో వారు జిడిపిని కూడా పెంచుతారు. అయినా అధికారిక రికార్డుల ప్రకారం వారు పనిచేయనట్టే లెక్క.

మహిళలు చేసే శ్రమను లెక్కించే విధానాన్ని ప్రభుత్వాలు మార్చుకోవాలి. అంతర్జాతీయంగా నిర్వచించబడిన 'జాతీయ ఖాతాల వ్యవస్థ' ప్రమాణాలలో మార్పు కోసం భారతదేశం పిలుపు ఇవ్వవచ్చు. ఆ కృషికి నాయకత్వం వహించవచ్చు. తద్వారా జిడిపి గణన నుండి జనాభా గణనకు ఉద్దేశించబడిన ప్రశ్నాపత్రాలన్నింటిలో మార్పులు, చేర్పులు చేయవచ్చు. లెక్కించనప్పుడు మహిళల చాకిరీ కనిపించదు. దీని ప్రభావం కార్మిక, ఉపాధి విధానాలపై ఉంటుంది. శ్రమ లెక్కల్లో కనిపించకపోవడంతో ఇంటి చాకిరి చేసే వీరు "రక్షిత కార్మిక చట్టాల పరిధి వెలుపలే" వుండిపోతారు. అంతేగాక ఇది పనిదినాన్ని పరిమితం చేస్తుంది. కార్మిక పరిస్థితులను నియంత్రిస్తుంది. భారతదేశంలో స్త్రీలు పురుషుల కంటే రోజుకు 1.5 గంటలు ఎక్కువ పని చేస్తారు. అది కూడా ఏ విధమైన జీతం లేకుండా, అపరిశుభ్రమైన పరిస్థితుల్లో పని చేస్తారు.

ఈ అంశానికి మరొక కోణం ఉంది. అదే-ఇంటి వెలుపల పని చేసే మహిళలకు మద్దతు ఇవ్వడం. తక్కువ-ఆదాయ కుటుంబాలలో, ఒక్కరే ఆదాయ వనరుగా వుండడమనేది అసంభవం. తల్లిదండ్రులు ఇద్దరూ పని చేయాల్సి ఉంటుంది. అంటే, డబ్బు సంపాదించేవారికి, కుటుంబ సంరక్షణ చూసే వారికి ఇప్పటి వరకు వున్న నమూనా విచ్ఛిన్నం కావడం ప్రారంభమవుతుంది. తక్కువ ఆదాయ మహిళలు మనం ఊహించనదానికంటే ఎక్కువగా ఎవరి మద్దతు లేకుండానే పని చేస్తున్నారు. అయితే ఈ పనిలో కనిపించే అస్థిరత కారణంగా వీరి శ్రమ గణాంకాల్లో ప్రతిబింబించదు. మహిళల పని కాలానుగుణంగా వుంటుంది. చెదురుమదురుగాను, క్రమరహితంగా కూడా వుంటుంది. వీరు తరచుగా ఇంట్లోంచే కుటుంబ వ్యాపారాలకు తోడ్పాటునందిస్తారు.

నేడు భారతదేశంలో మహిళా కార్మిక భాగస్వామ్య రేటు...ప్రభుత్వ గణాంకాల ప్రకారం 32.8 శాతం వుండగా, ప్రపంచ బ్యాంకు ప్రకారం 24 శాతం వుంది. అదే చైనాలో 61 శాతం, బంగ్లాదేశ్‌లో 38 శాతం, నేపాల్‌లో 29 శాతం, పాకిస్తాన్‌లో 25 శాతం వుంది. మహిళా సాధికారతను కల్పించేందుకు శ్రమలో స్త్రీల వాటా పెంచాలని భారత్ భావించినట్లయితే...మహిళల పనికి సంబంధించిన అపోహలు తొలగిపోవాలి. స్త్రీల పనిని సముచితంగా లెక్కించాలి. వారు శ్రమ చేయడానికి మద్దతు ఇవ్వాలి.

'జాతీయ సమయ వినియోగ సర్వే' ప్రకారం 81.2 శాతం మహిళలు ఎటువంటి చెల్లింపు లేని ఇంటి చాకిరిలో నిమగ్నమై ఉన్నారు. అదే పురుషుల విషయానికి వచ్చేసరికి 26.1 శాతం మాత్రమే అటువంటి పనిలో వున్నారు. పురుషులు వారానికి సగటున 42 గంటల పాటు సాంప్రదాయకంగా ఆర్థిక కార్యకలాపంగా పరిగణించే ఉత్పత్తి పనుల్లో పాల్గొంటారు. స్త్రీలు 19 గంటలు పాల్గొంటున్నారు. అయినప్పటికీ మహిళలు... గృహ నిర్వహణ, పిల్లలు-వృద్ధుల సంరక్షణ, కుటుంబంలో జబ్బు పడిన వారి కోసం 34.6 గంటలు వెచ్చిస్తారు. పురుషులు ఈ విధమైన పనులకు వెచ్చించేది 3.6 గంటలు. అంటే స్త్రీలు పురుషుల కంటే 10 రెట్లు ఎక్కువగా కుటుంబ నిర్వహణ పనులలో వుంటారన్నమాట.

నాలుగు నెలల వ్యవధిని పరిగణనలోకి తీసుకున్నప్పుడు దాదాపు 44 శాతం మహిళలు శ్రామిక శక్తిలో భాగంగా వున్నారని ఒక అధ్యయనం వెల్లడించింది. అయితే దానికి కొనసాగింపుగా నాలుగు సంవత్సరాల వ్యవధిని పరిగణనలోకి తీసుకున్నప్పుడు కేవలం 2 శాతం మహిళలు మాత్రమే లెక్కల్లో వున్నారు. ఇంటి బాధ్యతలు వారిని సాధారణ ఉద్యోగం నుండి దూరంగా ఉంచుతాయి. వారు పని చేసినప్పుడు సాధారణంగా పిల్లలు వెంటే వుంటారు. నిర్మాణ ప్రదేశాలలో ప్రమాదకరమైన పరికరాలు, అధిక కాలుష్యం నీడలో పిల్లలు ఆడుతున్నారని 2013లో హార్వర్డ్ పరిశోధకులు వివరించారు. ఇది మెదడు అభివృద్ధికి అత్యంత కీలకమైన వయస్సులో (మూడేళ్ల లోపు) వారి జీవితాలను, ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడేస్తుంది. విద్య, ఆరోగ్యం, నైపుణ్యం కోసం ఉద్దేశించిన అన్ని తదుపరి ప్రయత్నాలు, ప్రజా నిధులు బలహీనమైన పునాదిపైనే నిర్మితమయ్యాయి.

పిల్లల కోసం ప్రభుత్వం ఇప్పటికే ప్రపంచంలోకెల్లా అతి పెద్ద ప్రజా వ్యవస్థ-అంగన్‌వాడీ వ్యవస్థను నడుపుతోంది. 14 లక్షల అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఆరు సంవత్సరాలలోపు 8 కోట్ల మంది పిల్లలకు ఈ సేవలు అందుతాయి. అయినప్పటికీ, ఈ కేంద్రాలు ఉదయం 9 నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు మాత్రమే తెరిచి ఉంటాయి. కాబట్టి, మహిళలు పూర్తిగా ఎనిమిది గంటల పని చేయాలంటే వారికి అదనంగా సంరక్షణ కేంద్రాలు అందుబాటులో వుండడం అవసరం.

వేగంగా పట్టణీకరణ చెందుతున్న భారతదేశంలో మహిళలు శ్రమ చేసేందుకు వీలుగా వీరికి పలు సౌకర్యాలు కల్పించాలి. క్రెచ్‌లు ఒక పరిష్కారాన్ని అందిస్తాయి. 2020 నాటికి 'జాతీయ క్రెచ్ పథకం' దేశవ్యాప్తంగా దాదాపు 6,500 క్రెచ్‌లను నిర్వహిస్తోంది. తల్లులు ఒక స్థిరమైన వృత్తిని/ఉద్యోగాన్ని ఎంచుకుని పని చేయడానికి ఈ క్రెచ్‌లు సహాయ పడతాయి. అలాగే పిల్లలు సురక్షితంగా, ఆరోగ్యకరంగా ఎదిగే వాతావరణాన్ని అందిస్తాయి. ప్రైవేట్ రంగం ఈ అవసరాన్ని గుర్తించి అధిక-ఆదాయ కుటుంబాలకు ఈ సేవలను అందిస్తుంది. పిల్లల సంరక్షణ/ప్రీస్కూల్ అనేది రూ.31,256 కోట్ల పరిశ్రమ. 2028 నాటికి వార్షిక రాబడి (సిఎజిఆర్) 11.2 శాతం వరకు వృద్ధి చెందుతుందని అంచనా. కాబట్టి ఆదాయ అసమానతను అధిగమించడానికి, అందరికీ నాణ్యత కల్గిన బాలల సంరక్షణ సేవలు అందించడానికి...ప్రభుత్వ రంగం ఇప్పటికే మొదలెట్టిన ప్రయత్నాలను వేగవంతం చేయాల్సి వుంది.

నేడు భారతదేశంలో మహిళా కార్మిక భాగస్వామ్య రేటు...ప్రభుత్వ గణాంకాల ప్రకారం 32.8 శాతం వుండగా, ప్రపంచ బ్యాంకు ప్రకారం 24 శాతం వుంది. అదే చైనాలో 61 శాతం, బంగ్లాదేశ్‌లో 38 శాతం, నేపాల్‌లో 29 శాతం, పాకిస్తాన్‌లో 25 శాతం వుంది. మహిళా సాధికారతను కల్పించేందుకు శ్రమలో స్త్రీల వాటా పెంచాలని భారత్ భావించినట్లయితే...మహిళల పనికి సంబంధించిన అపోహలు తొలగిపోవాలి. స్త్రీల పనిని సముచితంగా లెక్కించాలి. వారు శ్రమ చేయడానికి మద్దతు ఇవ్వాలి.

/ 'హిందూ' సౌజన్యంతో /

విద్వేషభక్తితో దేశానికి గాయం

కామన్ స్పేస్

డా॥ దేవరాజు మహారాజు

ఈ దేశంలోని ప్రతి పౌరుడూ తప్పక తెలుసుకోవాల్సిన విషయాలు కొన్ని ఉన్నాయి-1931లో విప్లవ వీరుడు భగత్‌సింగ్ పక్షాన తీవ్రంగా వాదించిన న్యాయవాది-ఆసఫ్ అలీ. భగత్‌సింగ్‌ను శిక్షించడానికి నిరాకరించి, తన జడ్జి పదవి కి రాజీనామా చేసిన జస్టిస్-సయ్యద్ ఆగా హైదర్. ఇకపోతే భగత్‌సింగ్‌కు ఉరిశిక్ష విధించిన జడ్జి-రాయ్ సాహిబ్ పండిట్ శ్రీ కిషన్. నరనరాన ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం నింపుకున్న వ్యక్తి. ఈ వివరాలు తెలుసుకున్న తర్వాత, లేదా గుర్తు చేసుకున్న తర్వాత ఎవరు దేశభక్తులు, ఎవరు దేశద్రోహులు. అనే విషయం విజ్ఞత గల ఈ దేశపౌరులు పూర్తిగా అర్థం చేసుకుంటారు.

తాము సనాతన ధర్మాన్ని గౌరవించేవారమని, దాన్ని వ్యతిరేకించే వారి వ్యాఖ్యలు తమ మనోభావాల్ని గాయపరుస్తున్నాయని, ఆ వ్యాఖ్యలు చేసే వారిని కఠినంగా శిక్షించాలని మాజీ న్యాయమూర్తులు, మాజీ ఉన్నతాధికారులు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. అలాంటి లేఖ రాసిన వారికి అసలు సనాతనమంటే ఏమిటన్నది అవగాహన ఉందా లేదా అని అనుమానం వస్తుంది. సనాతనమంటే- అసమానత, సనాతనమంటే-అస్పృశ్యత, సనాతనమంటే- కులవివక్ష, సనాతనమంటే బలులు, యజ్ఞయాగాలు, బాల్య వివాహాలు, సతీ సహగమనం, దళితుల సజీవ దహనం, సనాతనమంటే-సమాజపు సగ భాగపు అణచివేత. ఆధిపత్య హింస, శ్రామికుల పీడన. సనాతనమంటే-నిచ్చెన మెట్ల వ్యవస్థ. సనాతనమంటే-వర్తమానాన్ని గతం అజమాయిషీ చేయడం, సనాతనమంటే- భవిష్యత్తుకు అవరోధం. ఏ కొందరి మనోభావాలో దెబ్బతింటాయంటే, వారు తప్పక వారి ఆలోచనా సరళిని మార్చుకోవాల్సి ఉంటుంది. పైన చెప్పినవన్నీ నిజాలే కదా? నిజాలు కాదు, అబద్ధాలు అని-ఎవరైనా నిరూపించదలిస్తే నిరూపించిన తర్వాత మాట్లాడాలి. సమకాలీనంలో కూడా సనాతనం చేసే అనర్థాలెలా ఉంటాయో చూడండి. ఎప్పుడో మొదలైన కుంభమేళాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి కదా?

1760-హరిద్వార్ కుంభమేళాలో శైవులైన గోసాయన్లకు వైష్ణవులైన బైరాగులకు మధ్య కలహాలు చెలరేగి ఇరువైపులా వందల సంఖ్యలో మరణాలు సంభవించాయి. మరాఠా పీష్వాల నాటి ఒక రాగి ఫలకం-మరికొన్ని భయంకరమైన విషయాలను వెల్లడించింది. 1789లో నాసిక్ కుంభమేళాలో సుమారు 12 వేల మంది మరణించారు. కారణం శైవులు-వైష్ణవులు హోరాహోరీగా పోట్లాడుకుని, కోపాలు, రోషాలు చల్లారక చంపుకోవడందాకా వెళ్ళింది. మేమంటే మేం-ముందు స్నానం చేయాలని గొడవపడి, శత్రువుల్లాగా ఒకరినొకరు చంపుకున్నారు. మొత్తం 12 వేల మంది పుణ్యస్నానాల పేరుతో ప్రాణాలు పోగొట్టుకున్నారు. మతం పిచ్చి తలకెక్కితే అంతే! ఈ భక్తులు మానవత్వం మీద చెరగని మచ్చలుగా మిగిలారు తప్పితే, మతకలహాలతో ఎవరైనా ఎప్పుడైనా ఏమైనా పొందగలిగారా?

లోక కళ్యాణం గురించి, ప్రశాంత జీవన మార్గం గురించి, సత్ప్రవర్తన గురించి జనానికి బోధలు చేసే సన్యాసులు, సాధువులు, బైరాగులు యుద్ధాలకు దిగడం ఏమైనా బావుందా? అంటే వారు-సర్వసంగ పరిత్యాగులుగా వేషం మార్చారే గాని, తమలోని అహాన్ని జయించలేక పోయారని మనకు అర్థమౌతుంది. అలాంటి వారి నుండి సామాన్యులు నేర్చుకునేది ఏముంటుంది? అలాంటి సన్యాసులు, దొంగయోగులు సమాజానికి కాదు కదా, వారికి వారే ఉపయోగం లేనివారు. అలాంటి వారిని సామాన్యులు నమ్మకూడదు. వారి బూటకపు ఆధ్యాత్మికతకు ప్రభావితులు కాకూడదు. అలాంటి వారిని దూరం పెట్టాలి. సమాజ శ్రేయస్సుకు పాటుపడిన మహనీయుల గూర్చి తెలుసుకుంటూ ఉండాలి. వారి మార్గంలో నడవడానికి ప్రయత్నిస్తూ ఉండాలి. దైవమే లేనప్పుడు దైవం పేరు చెప్పి, సంస్కృతి సంప్రదాయాల పేరు చెప్పి, మోసం చేసే వారిని నమ్మడం అవసరమా? ఆలోచించాలి కదా?

ఉదాహరణకు 2014లో రూపాయికి డాలర్ మారకం విలువ 60.99. అదే 2023లో 83.15 అయ్యింది. పరిస్థితి ఇలా స్పష్టంగా కనిపిస్తూ ఉంటే ప్రధాని, అతని సహచరులంతా దేశం ఆర్థిక ప్రగతి సాధించిందని దబాయిస్తారెందుకూ? వారికెవ్వరికీ కళ్ళూ, చెవులూ పని చేయడం లేదా? అందుకే కాబోలు మణిపూర్‌లో ప్రధాని మోడీ ఫొటోతో పోస్టర్లు వెలిశాయి. దాని కింద ఒక వాక్యం ఉంది. "ఈయనకు కళ్ళు కనబడవు. చెవులు వినబడవు. ఇక్కడ మా మణిపూర్ మండిపోతున్నా ఆయనకు పట్టదు. విదేశాలకు పారిపోతుంటాడు" అని! మోడీ అనేది ఇంటి పేరు కాదు, ఆయన విద్యార్హతలు. మాస్టర్ ఆఫ్ డెవలపింగ్ ఇండియా-అని ఆయన అనుయాయులు ప్రచారం చేసుకుంటున్నది నిజం. కాని, హైస్కూల్ చదువు పూర్తి చేయనివాడు లోపాయికారిగా యం.ఎ. డిగ్రీ సంపాదించాడని ఈ దేశ ప్రజలకు తెలుసు. డబ్బు గుప్పించి నమ్మకంగా పడి ఉండేవాణ్ణి రెండుసార్లు ప్రధాని సీట్లో కూర్చోబెట్టిన కార్పొరేట్లకు తెలుసు. అందుకే ఆయన వారికి అతివిధేయుడిగా ఉన్నాడు. బిబిసి డాక్యుమెంటరీయే కాదు, ప్రపంచవ్యాప్తంగా 14 అంతర్జాతీయ పత్రికలు ఈయన అసమర్థత గూర్చి పూర్తి వివరాలు వెల్లడించాయి. "కుట్ర చేయడం ఎంతతెలివిగా చేయాలంటే ఎదుటివారికి ఏ మాత్రం తెలియకూడదు. పైగా తనకు తానుగా వచ్చి కుట్రలో ఇరుక్కోవాలి. బలై, భస్మమైపోవాలి"- అన్నాడు విన్సెంట్ చర్చిల్. చర్చిల్ ఎప్పుడో చెప్పిన విషయాన్ని ఈ దేశ ప్రధాని ప్రజలమీద ప్రయోగిస్తున్నాడు. నిజం చెప్పుకోవాలంటే విపక్షాల అనైక్యత వల్ల ఆయన కొనసాగాడు తప్పించి, స్వీయ ప్రతిభతో రాణించింది ఎప్పుడూ ఎక్కడా? గుజరాత్ గాయం, మణిపూర్ గాయం, దేశమంతా గాయాలమయమైపోతోంది. నిజమే! ఈ విషయాలు మాత్రం చరిత్రలో నిలిచిపోతాయి!

2014లో రూపాయికి డాలర్ మారకం విలువ 60.99. అదే 2023లో 83.15 అయ్యింది. పరిస్థితి ఇలా స్పష్టంగా కనిపిస్తూ ఉంటే ప్రధాని, అతని సహచరులంతా దేశం ఆర్థిక ప్రగతి సాధించిందని దబాయిస్తారెందుకూ? వారికెవ్వరికీ కళ్ళూ, చెవులూ పని చేయడం లేదా? అందుకే కాబోలు మణిపూర్‌లో ప్రధాని మోడీ ఫొటోతో పోస్టర్లు వెలిశాయి. దాని కింద ఒక వాక్యం ఉంది. "ఈయనకు కళ్ళు కనబడవు. చెవులు వినబడవు. ఇక్కడ మా మణిపూర్ మండిపోతున్నా ఆయనకు పట్టదు. విదేశాలకు పారిపోతుంటాడు" అని!

దేశం కోసం-ధర్మం కోసం ఈ దేశ ప్రధాని చేస్తున్న అనేక సంస్కరణల్లో-గ్యాస్ సిలిండర్ ధర పెంచడం కూడా ఒకటి అని ఆ ఫలానా పార్టీ నాయకులు తెగ ప్రచారం చేస్తున్నారు. వారి వాదన ఏమిటో ఎంత సబబుగా ఉందో ఆలోచించండి. విషయం మీకే బోధపడుతుంది-"సిలిండర్లలో నింపే గ్యాస్ భూమి లోపల నుండి తీస్తారు. అలా గ్యాస్ తీయడం వల్ల మొక్కలకు లోపల నుండి అందాల్సిన ఆక్సిజన్ అందదు. దాని వల్ల చెట్లు పెరగవు. సుమారుగా ఒక రాష్ట్రానికి 54 లక్షల సిలిండర్లు అవసరమౌతాయంటే, ఇక దేశం మొత్తానికి ఎన్ని కావాలో లెక్క కట్టండి. గ్యాస్ సిలిండర్ ధర పెంచడం వల్ల, భారం మోయలేక చాలా మంది కట్టెలు కొట్టుకోవడానికి అడవికి వెళతారు. వారు అక్కడ శుభ్రమైన గాలి పీల్చుకుంటారు. దానివల్ల మేలు జరిగినట్టేకదా? వంట చెరకు కొట్టి తెచ్చుకుని కట్టెల పొయ్యి మీద వంట చేసుకుంటారు. కట్టెల పొయ్యి వల్ల పొగ వస్తుంది. ఆ పొగ వాతావరణంలో ఎక్కువ శాతంగా ఉన్న ఆక్సిజన్‌ను తగ్గిస్తుంది. అంటే, దానివల్ల వాతావరణ సమతుల్యం కాపాడబడుతుంది కదా? దానివల్ల మేలు జరిగినట్టే కదా? కట్టెల పొయ్యి మీద వంట చేసుకున్న మన పూర్వీకులు రోగాలు రొష్టులూ లేకుండా ఆరోగ్యంగా ఉండేవారు కదా? కట్టెల పొయ్యి ఉపయోగంలో లేనందువల్లనే ఈ రోజుల్లో రోగాలు నానాటికీ ఎక్కువవుతున్న విషయం అందరూ గ్రహించాలి! ఇవన్నీ దృష్టిలో ఉంచుకొని, ప్రజల ఆరోగ్యం కాపాడడం కోసమే మోడీ సిలిండర్ ధర పెంచారు. ఆయన ఏ పని చేసినా దేశం కోసం, ధర్మం కోసమే చేస్తారన్నది ఈ దేశ ప్రజలు అర్థం చేసుకోవాలి"-ఫలానా పార్టీవారు చేస్తున్న ఈ ప్రచారంలో నిజానిజాలను దేశ ప్రజలే గ్రహించుకోవాలి! దేశం ఎంత ముందుకు పోతోందన్నది బేరీజు వేసుకోవాలి.



"దేశమును ప్రేమించుమన్న/మంచి అన్నది పెంచుమన్న" - అన్న గురజాడ అప్పారావు మనకు తెలుసు. "మతములన్నియు మాసిపోవును/జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును" అన్నది కూడా ఆ మహానుభావుడే. "చెట్ట పట్టాల్ పట్టుకొని దేశస్తులంతా నడవవలెనోయ్/ అన్నదమ్ముల వలెను జాతులు/ మతము లన్నియు మెలగవలెనోయ్"-అని ఆశించారా యన! అందుకు వ్యతిరేకమైన భావజాలాన్ని ఇప్పుడు ఒక గుజరాత్ అప్పారావ్ ద్వేషభక్తి గీతం పాడుతున్నాడు. కలం పేరుతో ఎవరో నాకు ఆ పేరడీ గేయం పంపించారు. అది నా పాఠకుల కోసం ఇక్కడ పొందుపరుస్తు న్నాను. "మతమునే ప్రేమించుమన్న/ హింసయన్నది పెంచుమన్న/ వట్టి మాటలు చెప్పుకోవోయ్/ చేయు మేలుని కట్టిపెట్టోయ్/ దేశాభిమానమె నాకె కద్దని/ వట్టి గొప్పలె చెప్పుకోవోయ్/ దేశమంటే జనం కాదోయ్/ దేశమంటే మతంమయమోయ్/హిందు మతమే రాజ్యమేలగ/దారిలో నువు పాటు పడవోయ్/ తతిమ జాతులు మతములన్నీ/అణిగి మణిగి మెలగవలెనోయ్/ స్వంతలాభమె అంతయనుకుని/ప్రజలనందరి ముంచవలెనోయ్/జాతి ఆస్తులు కట్టగట్టి/ దత్తపుత్రుల కట్టబెట్టోయ్/విజ్ఞానమంతయు రాతి యుగపు/ గ్రంథమయమని బొంకవలెనోయ్/రోదసీ నౌకకి సైతం/దిష్టి టెంకాయ్ కొట్టవలెనోయ్/అంబేద్కరు గాంధీ ఇజాలకు/ పైపై డప్పు కొట్టవలెనోయ్/మత సామరస్యం చావుకోసం/ లోన గోతులు తీయవలెనోయ్". అధికారంలో ఉన్నవారు పాడుతున్న ఈ ద్వేషభక్తి గేయం దేశానికి ఎంతగా గాయం చేస్తుందో... సామాన్య పౌరులు అర్థం చేసుకోవాలి! భారత దేశ సమగ్రతను కాపాడదాం! విద్వేష భావాన్ని విడనాడుదాం!! ఇదే నేటి మన కర్తవ్యం.

/ వ్యాసకర్త కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత, జీవశాస్త్రవేత్త /

జనవాక్యం

రైల్వే ఆధునీకరణ కమీషన్ల కోసమేనా!

ఆధునీకరణ పేరుతో దాదాపు అన్ని రైల్వే స్టేషన్లు పడగొట్టి ప్రయాణికులకు నుంచోటానికి నీడ, కూర్చోటానికి కుర్చీలు లేకుండా చేస్తున్నారు రైల్వే వారు. పాసింజర్ రైళ్ళు లేక చిన్నచిన్న స్టేషన్లు గబ్బిలాలు నిలయాలుగా మారాయి. ఇంక ఈ ఆధునీకరణ ఎవరికోసం? ఆ పేరుతో కమీషన్ల కోసంగాక! గతంలో ఉన్న పాసెంజర్ రైళ్లను తొలగించి పేరు మార్చి ఎక్స్‌ప్రెస్‌లుగా చేశారు. గతంలో వీటిలో అన్ని బోగీలు జనరల్ బోగీలుగా ఉండేవి. ఇపుడు వాటికి జనరల్ బోగీ ఒకటి వేసి, మీ చావు మీరు చావండి అన్నట్లుగా చేసారు. వందే భారత్ రైళ్ళు, ఇంకేదో పేరుతో మొన్న ప్రారంభం చేశారు మోడీ. అన్నీ కూడా ఏసీ రైళ్లే. తరువాత వృద్ధులకు రాయితీ తీసివేసారు. సామన్యుడు వీటి ముఖం కూడా చూడడు. మరి ఎవరికోసం ఈ ఆధునీకరణ! కమీషన్ల కోసం గాకపోతే!! సామాన్యుడి కోసం రైళ్ళే లేనపుడు ప్రజాధనం ఎవరికోసం ఖర్చు పెడుతున్నట్లు? ఈ నాటకాలు ప్రజల గ్రహిస్తున్నారు. త్వరలో ఈ అరాచక, మతవాద పార్టీలకు ఓటర్లు బుద్ధి చెప్పాలి. కేంద్ర ప్రభుత్వం ఈ మధ్య ప్రభుత్వ ఆస్తులన్నింటిని అదానీకి, అంబానీకి అమ్మేస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మార్వో కార్యాలయాలను, కలెక్టరు కార్యాలయాలను, ఖాళీ స్థలాలను అమ్మేస్తున్నది. ఇంకెందుకీ ఆధునీకరణ? ఆధునీకరించి ఎక్కువ బేరానికి అమ్ముకోటానికా! ప్రజలు ఈ మోసాన్ని తిప్పికొట్టాలి.

- నార్నె వెంకట సుబ్బయ్య

మీ వ్యాసాలు 5000 క్యారెక్టర్లు లేదా 700 పదాలు వుండాలి.
పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

ఎయిర్‌పోర్టు అదనపు భూముల్లో అడ్డగోలు రహదారి

- అనుమతులు లేకుండానే 3 కిలోమీటర్లు రహదారి నిర్మాణం
- ఓ రిసార్ట్ సంస్థ నిర్వాకం
- సేదతీరిన రిసార్ట్ రుణం తీర్చుకుంటున్న పెద్దలు, అధికారులు

ప్రభుత్వం రిజర్వు చేసిన భూముల్లో నుంచి వేసిన రహదారి

ప్రజాశక్తి-భోగాపురం

ఉత్తరాంధ్ర జిల్లాల్లో పర్యటనలకు వచ్చే ప్రభుత్వ పెద్దలైనా.. అధికారులైన భోగాపురం మండలంలోని అత్యంత ఖరీదైన ప్రముఖ రిసార్ట్‌లోనే సేద తీరుతుంటారు. అది పగలైనా రాత్రైనా. అందుకేనేమో.. ఇంకెవడ్రా మనల్ని ఆపేది అనుకుందేమో ఆ రిసార్ట్ సంస్థ. ప్రజల సొమ్ముతో ప్రభుత్వం పరిహారం అందజేసి విమానాశ్రయం కోసం సేకరించిన భూముల నుంచి ఎటువంటి అనుమతులూ లేకుండానే ఏకంగా ఆ రిసార్ట్ సంస్థ తాము కొత్తగా వేస్తున్న వ్యాలీ అనే రియల్ ఎస్టేట్ వెంచర్‌కు అడ్డగోలుగా గ్రావెల్ రోడ్డును దిబ్బలపాలెం సమీపంలో నిర్మించుకుంది. అదికూడా త్వరలో నిర్మించబోయే బీచ్ కారిడార్ రోడ్డునుంచి నేరుగా తమ వెంచర్ వరకు వేసేశారు. మరి ఇంత అడ్డగోలుగా ఆ సంస్థ తమ సొంత యంత్రాలతో గత కొన్ని రోజులు నుంచి నిర్మిస్తుంటే అధికారులు మాత్రం కళ్లకు గంతలు కట్టుకోవడం విశేషం. భోగాపురం మండలంలో ఆ రిసార్ట్ సంస్థ చేస్తున్న అడ్డగోలు వ్యవహారం ఇది. వివరాల్లోకి వెళితే...

భోగాపురం మండలంలో విమానాశ్రయ నిర్మాణానికి ప్రభుత్వం సుమారు 2700 ఎకరాలు భూములను సేకరించింది. సేకరించిన భూముల్లో సుమారు 500 ఎకరాలు ప్రభుత్వం ఐటి కంపెనీలకు, ఇతర అవసరాలకు రిజర్వులో ఉంచింది. ఈ భూమికి పడమర వైపు ఈ రిసార్ట్ సంస్థ కొత్తగా వ్యాలీ పేరుతో వెంచర్ వేస్తోంది. ఈ వెంచర్‌కు సుమారు 3కిలో మీటర్లు దూరంలో కొత్తగా నిర్మించబోయే బీచ్ కారిడార్ రోడ్డు ఉంది. ఈనేపథ్యంలో దిబ్బలపాలెం వెళ్లే రహదారికి నేరుగా ప్రభుత్వం అట్టిపెట్టుకున్న 500 ఎకరాల్లో నుంచి గత కొన్ని రోజులుగా సుమారు 40అడుగుల విస్తీర్ణంతో రహదారిని నిర్మించేశారు. ఈ రహదారి బీచ్‌కు ఆనుకొని మరో పెద్ద వెంచర్ ఈ సంస్థకు ఉంది. అయితే ఈ రెండింటికి అనుసంధానం చేసేలా అడ్డగోలుగా ఈ భూముల్లో నుంచి రహదారిని నిర్మించేశారు.

అనుమతులు లేకుండా..

ప్రభుత్వం అట్టి పెట్టుకున్న భూముల్లో నుంచి తమ వెంచర్‌కు రహదారిని నిర్మించేందుకు వీరికి ఎటువంటి అనుమతులు లేవు. కాని ఏకంగా తమ సొంత వాహనాలతో రహదారిని నిర్మించడం గమనార్హం. పోనీ విమానాశ్రయం పనులు జరుగుతున్నాయి అందుకోసం ఈ రహదారిని నిర్మించుకున్నారంటే ఈ భూములకు విమనాశ్రయం నిర్మాణానికి ఎటువంటి సంబంధమూ లేదు. అంతేకాక ఇంకా నిర్మించబోయే విమానాశ్రయం ప్రహరీ గోడ పక్క నుంచి ఈ రహదారిని నిర్మించారు. అంటే కేవలం తమ రియల్ ఎస్టేట్ వెంచర్‌లోని ప్లాట్లును అమ్ము కోవడానికి, ఈ రహదారి నేరుగా బీచ్‌కు వెళ్తుందని చూపించడానికి ఈ రహదారిని నిర్మించారన్న విమర్శలు వస్తున్నాయి. ఇంతలా జరుగుతున్నా అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడకపోవడం విశేషం.

రహదారిని పరిశీలించి చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వం అట్టిపెట్టుకున్న భూముల్లో నుంచి రహదారిని వేస్తున్న వ్యవహారం మా దృష్టికి రాలేదు. ఆ రహదారికి అనుమతులు ఉన్నవీ లేనివీ పరిశీలిస్తాం. అవసమైతే ఉన్నతాధికా రుల దృష్టికి తీసుకువెళ్లి రహదారిని నిర్మాణాన్ని నిలిపివేస్తాం.

- చింతాడ బంగారాజు, తహశీల్దారు, భోగాపురం

ఎన్‌సిఇఆర్‌టి తీరుపై ఆగ్రహ జ్వాల

- కేరళలో అమలు చేయం : సిపిఎం

తిరువనంతపురం : పాఠశాల టెక్స్ట్ పుస్తకాల్లో ఇండియా పేరును భారత్‌గా ఉపయోగించాలన్న జాతీయ విద్యా పరిశోధన, శిక్షణా మండలి (ఎన్‌సిఇఆర్‌టి) ప్రతిపాదనపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ ప్రతిపాదనలను కేరళ ప్రభుత్వం తిరస్కరిస్తుందని సిపిఎం పేర్కొంది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి ఎం.వి. గోవిందన్ న్యూఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర సిలబస్‌ను అనుసరించే పాఠశాలలు ఎన్‌సిఇఆర్‌టి ప్రతిపాదనను అడ్డుకుంటాయని అన్నారు. సైన్స్, వాస్తవం మరియు చరిత్రను వ్యతిరేకించే సంఘ్‌పరివార్ మూకలు భారత దేశ గతాన్ని మార్చి యువతరం మెదళ్లలోకి చొప్పించాలని యత్నిస్తోందని అన్నారు. కేరళలోని పాఠశాల పాఠ్యపుస్తకాలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 1లో సూచించిన విధంగా దేశం పేరును ఇండియాగా పేర్కొంటాయి. సంఘ్ పరివార్ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన "డార్విన్ పరిణామ సిద్ధాంతం, మొఘలుల చరిత్ర, మహాత్మాగాంధీ జీవితం, హత్య" అధ్యాయాలను పాఠ్యపుస్తకాలలో కొనసాగిస్తాయని పేర్కొన్నారు.

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒకటవుతున్న ప్రతిపక్షాలు తమ వేదికకు ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంట్ ఇంక్లూజివ్ అలయన్స్ (ఇండియా)గా పేరు పెట్టుకున్న సంగతి తెలిసిందే. దీంతో బిజెపి ఆగ్రహంతో పాఠ్యపుస్తకాలు, అధికారిక ఆహ్వానాలు, ఇతర ప్రభుత్వ అంశాలలో దేశం పేరును ఇండియాకు బదులుగా భారత్‌గా ముద్రిస్తోందని అన్నారు. సుప్రీంకోర్టుకు ఇచ్చిన హామీని కూడా కేంద్రం తిప్పికొట్టిందని అన్నారు. ఇండియా, భారత్ చర్చలో కాంగ్రెస్, సిపిఎం కూడా ఒకే పక్షంలో నిలిచాయి. బుధవారం కాంగ్రెస్ సీనియర్ నేత కె.సి. వేణుగోపాల్ కూడా ఎన్‌సిఇఆర్‌టి ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. బిజెపి తన రాజకీయ ప్రయోజనాల కోసం దేశ చరిత్రను వక్రీకరించేందుకు యత్నిస్తోందని అన్నారు. కర్ణాటకలోని కాంగ్రెస్, తమిళనాడులోని డిఎంకె ప్రభుత్వాలు కూడా ఎన్‌సిఇఆర్‌టి ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నాయి. సిపిఎం కూడా ఈ ప్రతిపాదనను తిరస్కరిస్తున్నట్లు ప్రకటించింది. ఉమ్మడి జాబితాలో విద్య అంశాన్ని చేర్చడంతో ఎన్‌సిఆర్ఇటి ప్రతిపాదనను వ్యతిరేకించడానికి లేదా ఆమోదించడానికి రాష్ట్రాలను అనుమతిస్తుంది.

చిరుప్రాయంలోనే ఆర్యన్‌కు 'నోబెల్'

- అవార్డు గ్రహీతకు పలువురి అభినందన

ప్రజాశక్తి- పెందుర్తి (విశాఖ)

14 నెలల చిరుప్రాయంలోనే అద్భుతమైన జ్ఞాపకశక్తి, మేధస్సుతో అందరినీ అబ్బురపరిచి, నోబెల్ వరల్డ్ రికార్డు, ఇండియా వరల్డ్ రికార్డులను సొంతం చేసుకున్న బుడతడిపై ప్రశంసలు, అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. గ్రేటర్ విశాఖ, 95వ వార్డు పాపయ్యరాజుపాలెం వివేకానంద విహార్ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న గాబు కల్యాణ్‌కుమార్, రాగ ప్రియాంకల కుమారుడు గాబు చార్విక్ ఆర్యన్.అతి చిన్న వయస్సు (14 నెలలు)లోనే ఆన్‌లైన్ రికార్డ్ ద్వారా నోబెల్ వరల్డ్ రికార్డ్, ఇండియా వరల్డ్ రికార్డ్ సొంతం చేసుకున్నాడు, వివిధ రకాల కేటగిరీలలో జంతువులు, పక్షులు, వాహనాలు, పండ్లు, పువ్వులు, కూరగాయలు, రంగులు, వర్ణమాలలు, సంఖ్యలు, గహోపకరణాలు, బొమ్మలు, 350 ఫ్లాష్ కార్డ్‌లను, కొన్ని జంతువులు శబ్దాలు, , స్వాతంత్ర్య సమరయోధుల పేర్లను అలవోకగా చెప్పేస్తున్న ఆర్యన్ ప్రతిభను వీడియో రికార్డింగ్ చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం ద్వారా నోబెల్, ఇండియా వరల్డ్ రికార్డుల పరిశీలనకు పంపారు. ఆన్‌లైన్‌లోనే ఆర్యన్ ప్రతిభను పరిశీలించిన మీదట ఈ నెల 13న చార్విక్ ఆర్యన్‌కు నోబెల్ వరల్డ్ రికార్డ్, ఇండియా వరల్డ్ రికార్డ్‌ను ప్రకటించారు. నోబెల్, ఇండియా వరల్డ్ రికార్డులను సొంతం చేసుకున్న చార్విక్ ఆర్యన్‌ను స్థానిక వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు దుశ్శాలువాతో సత్కరించి మెమొంటోను అందజేశారు. ఆర్యన్‌లోని ప్రతిభను గుర్తించి, అతనికి తర్ఫీదునిచ్చిన తల్లిదండ్రులను కూడా అభినందించారు.

నైపుణ్యాలున్న వారికే ఉద్యోగావకాశాలు

- గీతం హెచ్‌ఆర్ కాన్‌క్లేవ్‌లో పరిశ్రమల నిపుణులు

ప్రజాశక్తి- మధురవాడ (విశాఖ)

కోవిడ్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక రంగం, ఉక్రెయిన్, రష్యా యుద్ధం తదితర పరిణామాల నేపథ్యంలో వివిధ కంపెనీల నియామకపు ప్రక్రియలో గణనీయమైన మార్పులు వచ్చాయని, ముఖ్యంగా నైపుణ్యాలున్న వారికి మాత్రమే ఉద్యోగావ కాశాలు లభిస్తున్నాయని వివిధ పరిశ్రమల నిపుణులు అన్నారు. గురువారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం కెరీర్ గైడెన్స్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ప్రారంభించిన గీతం విసిప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం మాట్లాడుతూ, పరిశ్రమలకు విద్యాలయాలతో మెరుగైన సంబంధాల ద్వారా కాలానుగుణంగా సిలబస్‌లలో మార్పులు చేయవచ్చునన్నారు. శాప్ ల్యాబ్స్ డైరక్టర్ కమల్ స్టీఫెన్ మాట్లాడుతూ విద్యార్థులు పరిస్థితులకు తగిన విధంగా తమను మలచుకోవవాలని, నిరంతరం కొత్త నైపుణ్యాలను నేర్చుకుంటూ తమను తాము తీర్చిదిద్దుకోవాలని సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ సిహెచ్ విజయశేఖర్, ఐబిఎమ్ లోకల్ హెడ్ ఎ.అనురాధ, కాగ్నిజెంట్ సీనియర్ డైరక్టర్ సి.సుబ్రహ్మణ్యం, ఇన్‌టెల్ బిజినెస్ మేనేజర్ హెచ్.గిరీష్, బ్రాండిక్స్ టేలంట్ మేనేజ్‌మెంట్ హెడ్ డాక్టర్ షెహజాది, అమర్‌రాజా గ్రూప్ బిజినెస్ హెచ్‌ఆర్ రవికుమార్, సిలికాన్ ల్యాబ్స్ సీనియర్ మేనేజర్ జాక్సన్ జాన్సన్, ఆల్‌స్టామ్ డైరక్టర్ ఎ.శ్రీనివాస్, గీతం జిసిజిసి డీన్ కమాండర్ గురుమూర్తి గంగాధరన్ తదితరులు పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ప్రొఫెసర్ సి.శాంతి, ప్రొఫెసర్ బి.రవికిషోర్ సంధానకర్తలుగా వ్యవహరించారు. విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, తాము చదివే కోర్సు పట్ల లోతైన అవగాహన, బృందాలుగా పనిచేసే సామర్థ్యం, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు, వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకునే తత్వం అవసరమని పరిశ్రమల నిపుణులు సూచించారు.

లాంఛనప్రాయ స్వాధీనత నోటీసు

ICICI Bank

నమోదిత కార్యాలయం: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రి టవర్, బొమ్మన్ హల్లి హొసూర్, మెయిన్ రోడ్డు, బెంగళూరు-560068

ఏదైతే

దిగువ సంతకందారు ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్ ఆండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (సదరు చట్టం) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క ఆర్/డబ్ల్యూ రూల్ 3తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో రుణగ్రహీతల మరియు డిహెచ్‌ఎఫ్ఎల్ (దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ ద్వారా ఐసిఐసిఐ బ్యాంక్‌కు కేటాయించబడిన అంతర్లీన పూల్) మధ్య కుదుర్చుకున్న రుణ ఒప్పందానికి మంజూరైన గృహ రుణ సదుపాయానికి, భద్రత అమలుకు సంబంధించి, సదరు నోటీసు స్వీకరించిన తేది నుండి 60 రోజులలోపట దిగువ పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ డిమాండ్ నోటీసులు జారీచేయడమైనది.

రుణగ్రహీతలు మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలం చెందిన కారణంగా, ప్రధానంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ పేర్కొన్న తేదిల ప్రకారం సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతను/ఆమె అధికారాలు అధ్యాయనం చేస్తూ దిగువ వివరించిన ఆస్థి దిగువ సంతకందారుడు లాంఛనప్రాయంగా స్వాధీనపరుచుకొన్నాడు. ప్రత్యేకంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకాన్నీ హెచ్చరిండమేమనగా ఆస్థితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారి ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ చార్జ్‌కు లోబడి ఉండవలెను.

క్ర. సం	రుణగ్రహీత పేరు/లోను ఖాతా సంఖ్య (డిహెచ్‌ఎఫ్ఎల్ పాత లాన్ మరియు ఐసిఐసిఐ కొత్త లాన్)	ఆస్థి వివరణ/లాంఛనప్రాయ స్వాధీనత తేది	డిమాండ్ నోటీసు తేది/ డిమాండ్ నోటీసులో మొత్తం (రూ)	శాఖ పేరు
1.	మురళీ జవ్వాజీ/ భవ్యా జవ్వాజీ/ **QZGTR00005001987**	లోను డాక్యుమెంట్/ఆస్తి డాక్యుమెంట్ లో వివరించన ప్రకారం కవర్ చేయబడిన ఫ్లాట్ నం.: 505, 4వ అంతస్తు, డో నం.69, శ్రీమిత్రా హైట్స్, కొత్త పోలీస్ స్టేషన్ వద్ద, సాయిబాబా గుడి వద్ద, వాసవి నాగ, ఆంధ్రప్రదేశ్, చిలకలూరిపేట-522616(ఏరియా కొలిచే) హద్దులు: ఉత్తరం: సేల్ డీడ్ ప్రకారం, దక్షిణం: సేల్ డీడ్ ప్రకారం, తూర్పు: సేల్ డీడ్ ప్రకారం, పడమర: సేల్ డీడ్ ప్రకారం లాంఛనప్రాయ స్వాధీనతా తేది: 21.10.2023	19.06.2021 Rs. 24,25,151.00/-	గుంటూరు.

పైన పేర్కొన్న రుణగ్రహీతలు(లు)/హామీదారులు(లు) మొత్తం తిరిగిచెల్లించుటకు ఒక 30 రోజుల నోటీసు ఇక్కడ ఇవ్వడమైనది, కావునా రూల్స్ 8 మరియు 9 ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 క్రింద నిబంధనల ప్రకారం, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 30 రోజుల గడువు తీరినాక తనఖా ఆస్తులు అమ్మబడును.

తేది : అక్టోబర్ 27, 2023 — **ఆధీకృత అధికారి**
ప్రదేశం : గుంటూరు (చిలకలూరిపేట) — **ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్**

equitas SMALL FINANCE BANK LTD

ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్
(గతంలో ఈక్విటాస్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పిలువబడేది)
కార్పొరేట్ ఆఫీస్: నెం. 769, స్పెన్సర్స్ ప్లాజా, 4వ అంతస్తు, ఫేజ్-II, అన్న సలై, టియన్-600002.

స్థిరాస్తి అమ్మకం కొరకు విక్రయ నోటీసు

సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) సర్ఫేసీ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ వేలం విక్రయ నోటీసు సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన క్రింద వివరించిన స్థిరాస్తిని ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి ద్వారా భౌతికంగా స్వాధీనం చేసుకోవడం జరిగిందని రుణగ్రహీతలు, సహ రుణగ్రహీతలు మరియు హామీదారులు మరియు సాధారణ ప్రజలకు దీని ద్వారా నోటీసు ఇవ్వడమైనది. దిగువ రుణగ్రహీతల నుండి ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్‌కు రావల్సిన క్రింద వివరించిన బకాయి మొత్తం రికవరీ కొరకు "ఎక్కడ ఉందో అలాగే", "పరిస్థితి ఏమిటి" ప్రాతిపదికన 17.11.2023న విక్రయించబడుతుంది.

రుణగ్రహీతలు/ హామీదారుల పేరు మరియు చిరునామా మొత్తం బకాయి+ వడ్డీ	స్థిరాస్తి వివరణ
ఆస్తి-III యొక్క వివరము: గుంటూరు, ఏటుకూరు, ఏటుకూరు గ్రామపంచాయతీ, రామాలయం దగ్గర, డి.నెం.5-58, న్యూ జియమ్‌సి, డి.నెం. 104-8-1150, అసెస్‌మెంట్ నెం.789, డి.నెం.109 నందు శ్రీ మార్కండేయులు జిడుగు మరియు శ్రీ శివనాగేశ్వరరావు నల్లాక కి చెందిన 67.50 చ॥గ॥ విస్తీర్ణము గల స్థలము మరియు అందులోని రెసిడెన్షియల్ ఇంటికి సంబంధించిన యావదాస్తి. దీనికి హద్దులు: తూర్పు: ఉమ్మడి గల్లీ బజారు; దక్షిణం: యన్.రాధాకృష్ణమూర్తి యొక్క ఆస్తి; పడమర: టి.దానారావు యొక్క ఆస్తి; ఉత్తరం: డి.మస్తాన్ యొక్క ఆస్తి.

రిజర్వుధర : రూ.16,00,000/- (అక్షరాల పదహారు లక్షల రూపాయలు మాత్రమే)
చెల్లించవలసిన బయానా : రూ.1,60,000/- (అక్షరాల ఒక లక్ష అరవై వేల రూపాయలు మాత్రమే)

ఆస్తి-IV యొక్క వివరము: గుంటూరు, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్, గోరంట్ల, బాలకృష్ణ టవర్స్ దగ్గర, శివాలయం దగ్గర, గోరంట్ల డి.నెం.446 నందు శ్రీమతి అనుపమ నల్లాక కి చెందిన 149.6 చ॥గ॥ విస్తీర్ణమునకు సంబంధించిన యావదాస్తి. దీనికి హద్దులు: తూర్పు: డి.నరసింహారావు యొక్క ఆస్తి; దక్షిణం: 15 అ॥ వెడల్పుగల రోడ్డు; పడమర: వై.వెంకటేశ్వర్లు యొక్క ఆస్తి; ఉత్తరం: బి.సుబ్బారావు యొక్క ఆస్తి.

రిజర్వుధర : రూ.15,00,000/- (అక్షరాల పదిహేను లక్షల రూపాయలు మాత్రమే)
చెల్లించవలసిన బయానా : రూ.1,50,000/- (అక్షరాల ఒక లక్ష యాభై వేల రూపాయలు మాత్రమే)

ఆస్తి-V యొక్క వివరము: గుంటూరు, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్, గోరంట్ల, బాలకృష్ణ టవర్స్ దగ్గర, శివాలయం దగ్గర, గోరంట్ల గ్రామము డి.నెం.446 నందు శ్రీమతి జిడుగు శివజ్యోత్స్న కి చెందిన 200.6 చ॥గ॥ విస్తీర్ణము గల ప్లాట్ నెం.4 ఖాళీస్థలమునకు సంబంధించిన యావదాస్తి. దీనికి హద్దులు: తూర్పు: యమ్.పద్మావతి యొక్క ఆస్తి; దక్షిణం: 15 అ॥ వెడల్పుగల రోడ్డు; పడమర: వై.వెంకటేశ్వర్లు యొక్క ఆస్తి; ఉత్తరం: డి.నరసింహారావు యొక్క ఆస్తి.

రిజర్వుధర : రూ.18,00,000/- (అక్షరాల పద్దెనిమిది లక్షల రూపాయలు మాత్రమే)
చెల్లించవలసిన బయానా : రూ.1,80,000/- (అక్షరాల ఒక లక్ష ఎనభై వేల రూపాయలు మాత్రమే)

ఆస్తి-VI యొక్క వివరము: శ్రీ మార్కండేయులు జిడుగు & శ్రీ మార్కండేయులు నల్లాక కి చెందిన ఆస్తి. గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్, రామచంద్రాపుర అగ్రహారం, బ్లాక్ నెం.9, పట్టా నెం.1053 నందు 418.2/9 చ॥గ॥ విస్తీర్ణముగల డి.నెం.33/6 స్థలము మరియు బ్లాక్ నెం.9, పట్టా నెం.354, 314 & 293 నందు 990.3/9 చ॥గ॥ విస్తీర్ణము రెసిడెన్షియల్ ఖాళీ స్థలమునకు సంబంధించిన యావదాస్తి. దీనికి హద్దులు: తూర్పు: 40' వెడల్పుగల రోడ్డు; దక్షిణం: దుమ్మర్లపాటి సుబ్రమణ్యంకు అమ్మకందారునిచే అమ్మిన స్థలము; పడమర: బొల్లం రాములు, మేకల సాంబయ్య మరియు ఇతరుల యొక్క స్థలములు; ఉత్తరం: భీమిశెట్టి రామారావు యొక్క స్థలము.

రిజర్వుధర : రూ.1,45,00,000/- (అక్షరాల ఒక కోటి నలభై ఐదు లక్షల రూపాయలు మాత్రమే) (టిడియస్ 1% కలుపుకొని)
చెల్లించవలసిన బయానా : రూ.14,50,000/- (అక్షరాల పద్నాలుగు లక్షల యాభై వేల రూపాయలు మాత్రమే)

ఐటమ్ నెం.I అనేది శ్రీ మార్కండేయులు జిడుగు ద్వారా పొందబడిన టర్మ్‌లోన్ నెం. 2557001600306501 కి కామన్ సెక్యూరిటీ మరియు పేర్కొన్న ఖాతాలో రికవరీ కోసం కొనసాగే హక్కు బ్యాంకుకు కలదు.

(సెక్షన్ 13 సబ్ సెక్షన్ (8) చట్టం ప్రకారము ఋణగ్రహీతలు / తనఖాదారులు / హామీదారులు / సహపూచీదారులు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాల వ్యవధిని వినియోగించుకోగలరు.) (సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ (8) సబ్ రూల్ (6) క్రింద దీనిని నోటీసుగా కూడా పరిగణించబడుతుంది) అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కర్ణాటక బ్యాంక్ యొక్క వెబ్‌సైట్ అనగా www.karnatakabank.com లో "mortgaged assets for sale" హెడ్ క్రింద సందర్శించండి.

ఇ-వేలము 16.11.2023 తేదీన ఉ॥ 11.00 గం॥ నుండి ఉ॥ గం॥ 11.20 ని॥ల వరకు https://bankauctions.in/ పోర్టల్ ద్వారా 5 నిమిషాల అపరిమిత పొడిగింపుతో నిర్వహించబడును. ఉద్దేశించిన బిడ్డర్ తమ పేరును https://bankauctions.in/ నందు నమోదు చేసుకొని, యూజర్ ఐడి మరియు పాస్‌వర్డ్‌ను ఉచితంగా పొందండి మరియు ఇ-వేలంపై శిక్షణను (తాత్కాలికంగా 15.11.2023న) ఆన్‌లైన్ ద్వారా M/s.4closure, 605ఎ, HMDA మైత్రీవనం, అమీర్‌పేట, హైదరాబాద్, తెలంగాణ-500038, సంప్రదించవలసిన నెం: 040-23736405, Mobile: 8142000062/63/64/66, Email: prakash@bankauctions.in and info@bankauctions.in నుండి పొందవచ్చును.

తేది: 26-10-2023, ప్రదేశం: హైదరాబాద్ — సం/- ఛీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్

ఎస్‌వియుకు ఐఎస్‌ఒ గుర్తింపు : విసి

ప్రజాశక్తి - ఎస్‌వియు క్యాంపస్

రాష్ట్రంలో 69 సంవత్సరాలుగా అత్యున్నత ప్రమాణాలతో విద్యనందిస్తున్న శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి ఐఎస్‌ఒ గుర్తింపు లభించడం పట్ల ఉపకులపతి ఆచార్య కె.రాజారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అక్టోబర్ 25, 26 తేదీల్లో హైదరాబాద్‌కు చెందిన హెచ్‌ఓయమ్ ఇంటర్‌నేషనల్ సంస్థ రెండు రోజుల పాటు ఎస్‌వియును సంపూర్ణంగా పరిశీలన చేసిందని, బృందం సభ్యులు టీమ్‌లుగా వివిధ శాఖలను , పరిపాలనా భవనాన్ని, విద్యాప్రమాణాలను, అవస్థాపన సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారని తెలిపారు. గురువారం సాయంత్రం ఐఎస్‌ఒ ప్రతినిధి శివయ్య.. విసి ఆచార్య కె. రాజారెడ్డిని కలసి ఐఎస్‌ఒ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ఎస్‌వియు గత సంవత్సరం ఐఎస్‌ఒ నంబర్ ను పొందడం జరిగిందని, ఈ సంవత్సరం కూడా మనకు అన్ని సౌకర్యాలు ఉన్నాయని ఐఎస్‌ఒ బృందం నిర్ధారణ చేసి సర్టిఫికెట్ ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు.

పిడిపి అధ్యక్షులుగా ముఫ్తీ ఎన్నిక

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్ పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పిడిపి) అధ్యక్షులుగా మెహబూబా ముఫ్తీ మరోసారి ఎన్నికయ్యారు. గురువారం శ్రీనగర్‌లోని పార్టీ ప్రధానకార్యాలయంలో వాయిస్ ఓట్ ద్వారా జరిగిన ఎన్నికల్లో జమ్ముకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, 64 ఏళ్ల ముఫ్తీని పార్టీ సీనియర్ నాయకులు ఎన్నుకున్నారు. మూడేళ్ల పాటు ఆమె ఈ పదవిలో ఉంటారు. గురువారం ఎన్నికల్లో ముఫ్తీ పేరును పార్టీ ఉపాధ్యక్షులు అబ్దుల్ రెహ్మాన్ ప్రతిపాదించగా, పార్టీ ప్రధాన కార్యదర్శి గులామ్ నబీ లోన్ హంజురా మద్దతు ఇచ్చారు. పిడిపి అధ్యక్షులుగా ముఫ్తీ ఎన్నిక కావడం ఇది వరసగా నాలుగోసారి.

జమ్ముకాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

- ఐదుగురు సాయుధులు మృతి

శ్రీనగర్: జమ్ముకాశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో మాచెల్ వద్ద గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు సాయుధులు మృతి చెందారు. భారత్‌లోకి అక్రమంగా చొరబడేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో ఈ ఎదురుకాల్పులు జరిగినట్లు భద్రతా సిబ్బంది తెలిపారు. మాచెల్ సెక్టార్‌లోని నియంత్రణ రేఖ (ఎల్‌ఓసి) వెంబడి భారత్‌లోకి అక్రమంగా చొరబడేందుకు తీవ్రవాదులు ప్రయత్నించారని, ఈ క్రమంలో జరిగిన కాల్పుల్లో ఐదుగురు మృతి చెందినట్లు తెలిపారు. వీరంతా లష్కరే తోయిబా సంస్థకు చెందిన వారిగా గుర్తించినట్లు జమ్ముకాశ్మీర్ అదనపు డిజి విజయ్ కుమార్ వెల్లడించారు. ఈ ప్రాంతంలో ఇంకా తనిఖీలు కొనసాగుతున్నాయని చెప్పారు.

దొడ్డిదారిలో కార్పొరేట్ సేద్యం

- బేయర్, అమెజాన్‌తో ఐకార్ ఒప్పందం
- రద్దు చేయాలని కిసాన్ సభ డిమాండ్

న్యూఢిల్లీలో జరిగిన కారాక్రమంలో ఒప్పందపత్రాలు మార్చుకుంటున్న ఐకార్ ఉన్నతాధికారులు, అమెజాన్ కిసాన్ సంస్థ ప్రతినిధులు (ఫైల్)

న్యూఢిల్లీ : వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే చర్యలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ముమ్మరంగా సాగిస్తోంది. మూడు చట్టాలు తీసుకొచ్చి వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్‌కు ధారాదత్తం చేసేందుకు మోడీ సర్కార్ చేసిన కుట్రను మహత్తర రైతాంగ ఉద్యమంతో అన్నదాతలు తిప్పికొట్టిన నేపథ్యంలో దొడ్డిదారి మార్గాలను కేంద్రం అన్వేషిస్తోంది. ఇందులో భాగంగా బేయర్, అమెజాన్ కిసాన్ వంటి కార్పొరేట్ దిగ్గజ కంపెనీలతో భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసిఎఆర్) ఇటీవల పలు అవగాహనా ఒప్పందాలు (ఎంఒయు)ను కుదుర్చుకుంది. వ్యవసాయ పరిశోధన రంగాన్ని, వ్యవసాయోత్పత్తుల మార్కెటింగ్‌ను గంపగుత్తగా కంపెనీలకు అప్పగించేందుకు కుతంత్రులు సాగిస్తోంది. కార్పొరేట్ సంస్థలతో వ్యవస్థాగత భాగస్వామ్యాన్ని చిన్న కమతాల రైతులకు సాధికారత కల్పించేందుకు జరిగిన ప్రయత్నమంటూ ఐసిఎఆర్ ఒక బూటకపు కథనాన్ని సృష్టిస్తోంది. పంటలు, పంట రకాలు, పంటల రక్షణ, కలుపు, యాంత్రీకరణ కోసం సమర్థవంతమైన వనరులు, వాతావరణ పరిస్థితులకు సరిపోయే పరిష్కారాలను అభివృద్ధిపరచడం కోసం బేయర్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఎంఒయు పేర్కొంటోంది. అంతకుముందు దానిమ్మ పంట సాగుపై కూడా ఐసిఎఆర్, బేయర్ మధ్య ఇలాంటి పరిశోధనా సహకార ఒప్పందం కుదిరింది. ఇటువంటి ఎంఒయులు, సంబంధిత పత్రాలను నిశితంగా పరిశీలించి చూసినట్లైతే, ఐసిఎఆర్‌కు గల విశ్వసనీయత, నెట్‌వర్క్, వనరులను ఇందుకోసం ఉపయోగించడం ద్వారా వ్యవసాయ ఆర్థిక వ్యవస్థలోకి కార్పొరేట్ కోరలను చొప్పించేందుకు ఉద్దేశించిన ప్రయత్నంగా కనిపిస్తోంది.

తక్షణమే ఉపసంహరించుకోవాలి : కిసాన్‌సభ

దుర్మార్గమైన ఈ ప్రయత్నాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) డిమాండ్ చేసింది. రైతులను నిలువునా దోపిడీ చేసేందుకు అనుకూలమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయడం ద్వారా బడా వాణిజ్య సంస్థలకు లాభాలు ఆర్జించేందుకు మోడీ ప్రభుత్వం వెసులుబాటు కల్పిస్తోందని కిసాన్‌సభ విమర్శించింది. ఐసిఎఆర్, బేయర్ ఎంఒయులో ఈ విషయం స్పష్టమవుతోందని తెలిపింది. కార్పొరేట్ లాభాలను గరిష్ట స్థాయికి పెంచేందుకు దొడ్డిదారిన కార్పొరేట్ అనుకూల నిరంకుశ వ్యవసాయ చట్టాలను తీసుకురావడానికి ఇదొక ప్రయత్నమేనని కిసాన్ సభ పేర్కొంది. ఈ కార్పొరేట్ సంస్థలు, ఐసిఎఆర్‌తో ఇటువంటి సహకార ఒప్పందాలు కుదుర్చుకోవడం వల్ల అపార అవకాశాలు వస్తాయని, వాటితో చట్టబద్ధతను తెచ్చుకుంటారని, తద్వారా లాభాలు గడించేందుకు పెద్ద మార్కెట్‌ను ఏర్పాటు చేసుకుంటారని తెలిపింది. అన్ని కార్పొరేట్ సంస్థలతో ఐసిఎఆర్ సంతకాలు చేసిన అవగాహనా ఒప్పందాలను కేంద్రం తక్షణమే రద్దు చేయాలని ఎఐకెఎస్ డిమాండ్ చేసింది. తమ ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకోవడానికి కార్పొరేట్ సంస్థలు ప్రభుత్వ వనరులను, సంస్థలను వాడుకోవడాన్ని నివారించాలని కోరింది. దానికి బదులుగా నేడు వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొనడానికి గానూ వ్యవసాయ పరిశోధనలకు ప్రభుత్వ నిధులను, వనరులను పెంచాలని ఎఐకెఎస్ కోరింది. రైతాంగం, శాస్త్రవేత్తలు, మేధావులు వెలిబుచ్చుతున్న ఆందోళనలను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని, వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీకరించే ప్రయత్నాలన్నింటినీ నిర్ద్వంద్వంగా ప్రతిఘటించాలని కోరింది.

అమెజాన్‌లో తీవ్రమైన కరువు

- నీటి ప్రవాహం తగ్గిపోవడంతో బయటపడ్డ 2 వేల ఏళ్ళనాటి రాతి చిత్రాలు !

బ్రసిలియా : అమెజాన్ నదీ పరీవాహక ప్రాంతంలో గత శతాబ్ద కాలంలో ఎన్నడూ లేని రీతిలో సంభవించిన అతి తీవ్రమైన కరువుతో రికార్డు స్థాయిలో నదిలో నీటి ప్రవాహం తగ్గిపోయింది. అయితే దీనివల్ల అద్భుతమైన విషయం ఒకటి బయటపడింది. మానవ ముఖాలు చెక్కిన రాళ్ళు అనేకం అక్కడ బయటపడ్డాయి. వీటిలో కొన్ని ముఖాలు గుండ్రంగా, మరికొన్ని చతురస్రాకారంగా చెక్కి వున్నాయి. రాతిపై చెక్కిన ఇవన్నీ దాదాపు 2వేల ఏళ్ళ నాటివని భావిస్తున్నారు. గతంలో కూడా ఇలా రాతిపై చెక్కిన చిత్రాలు కొన్ని బయటపడినా ఈసారి పెద్ద సంఖ్యలో, అది కూడా చాలా రకాలుగా రాతి చిత్రాలు బయల్పడడం విశేషం. వీటి మూలాలను నిర్ధారించేలా పరిశోధనలు చేయడానికి పరిశోధకులకు ఇవి బాగా ఉపయోగపడతాయని భావిస్తున్నట్లు పురావస్తు శాస్త్రవేత్త జైమె డీ శాంతనొ అలీవెయిరా చెప్పారు. యురోపియన్లు ఇక్కడకు రావడానికి చాలా ఏళ్ళు ముందుగానే ఇక్కడ నివసించే ఆదివాసీలు తమ విల్లులను, పారలను పదును చేసుకోవడానికి ఉపయోగించిన ప్రాంతంగా భావించే ఏరియా కూడా బయటపడింది. ఈ చెక్కడాలన్నీ కూడా చరిత్ర పూర్వం లేదా వలస పాలనకు పూర్వ కాలానివిగా భావిస్తున్నట్లు అలీవెయిరా చెప్పారు. వాటి కాలాన్ని కచ్చితంగా చెప్పలేం, కానీ ఈ ప్రాంతంలో మానవుల సంచారానికి సంబంధించిన సాక్ష్యాధారాలను ఆధారంగా చేసుకుని చూస్తే ఇవి 2వేల ఏళ్ళనాటివని భావిస్తున్నట్లు చెప్పారు. అమెజాన్ నదికి ఉత్తర తీరంలో రియో నీగ్రో, సోలిమోస్ నదులు సంగమించే ఈ ప్రాంతాన్ని పాంటో డాస్ లాజెస్‌గా పిలుస్తారు. ఇక్కడ రాళ్లపై చెక్కిన దృశ్యాలను 2010లో మొదటగా చూశారు. కానీ ఈ ఏడాది కరువు చాలా తీవ్రంగా వుంది. దాంతో రియో నీగ్రోలో జులై నుండి దాదాపు 49.2 అడుగుల మేరా నీరు తగ్గిపోయింది. దీంతో పెద్ద సంఖ్యలో రాళ్ళు, ఇసుక బయటపడ్డాయి.

ప్రేమ పెళ్లిళ్లను పెద్దలు కాదనలేరు

- ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ : మేజర్లయిన పిల్లల పెళ్లిళ్లను పెద్దలు అడ్డుకోలేరనిఢిల్లీ హైకోర్టు తేల్చిచెప్పింది. వివాహానికి తగిన వయసు కలిగిన యువతీయువకులు తమకు ఇష్టమైన భాగస్వామిని వివాహం చేసుకోవచ్చని, ఇటువంటి సందర్భంలో ఆ జంటల వివాహానికి తల్లిదండ్రులు లేదా వారి కుటుంబ సభ్యులు అభ్యంతరం చెప్పలేరని, రాజ్యాంగం ఆ జంటకు రక్షణ కల్పిస్తుందని హైకోర్టు వెల్లడించింది.

తల్లిదండ్రుల ఇష్టానికి వ్యతిరేకంగా వివాహం చేసుకున్న జంటలకు పోలీసులు రక్షణ కల్పిస్తారని, అవసరమైన పక్షంలో వారి కుటుంబ సభ్యులకు కూడా పోలీసులు రక్షణ అందిస్తారని ఢిల్లీ హైకోర్టు పేర్కొంది. భార్యాభర్తల వివాహ హక్కును ఏ విధంగానూ తక్కువ చేయకూడదని, ఇలాంటి జంటలకు రక్షణ కల్పించాల్సిన రాజ్యాంగపరమైన బాధ్యత ఆ రాష్ట్రంపై ఉందని జస్టిస్ తుషార్ రావు గేదెల అభిప్రాయపడ్డారు. తల్లిదండ్రుల ఇష్టానికి విరుద్ధంగా వివాహం చేసుకున్న ఒక జంటకు పోలీసు రక్షణ కల్పిస్తూ, మేజర్లయిన యువతీయువకులు తమకు ఇష్టమైన వ్యక్తిని వివాహం చేసుకునే అవకాశం రాజ్యాంగం కల్పించిందని ఒక కేసులో కోర్టు పేర్కొంది.

2029 ఎన్నికల నాటికి 'జమిలి'

- ఉన్నతస్థాయి కమిటీకి లా కమిటీ సమర్పణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జమిలి ఎన్నికల ప్రతిపాదనను పరిశీలిస్తున్న మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్యానెల్‌కు రాజ్యాంగంలో అవసరమైన మార్పులతో సహా రోడ్‌మ్యాప్‌ను లా కమిషన్ సమర్పించింది. ఈ ప్రతిపాదన 2029 లోక్‌సభ ఎన్నికల నాటికి మాత్రమే కార్యరూపం దాల్చగలదని, కాలక్రమేణా, అన్ని రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల అసెంబ్లీ ఎన్నికలను సమకాలీకరించడానికి అసెంబ్లీల పదవీకాలాన్ని పొడిగించడం లేదా తగ్గించడానికి ఒక ఫార్ములాను రూపొందిస్తుందని కమిషన్ పేర్కొంది. దీనికి సంబంధించి లా కమిషన్ నుండి నివేదిక ఇంకా పెండింగ్‌లో ఉంది. రామ్‌నాథ్ కోవింద్ ప్యానెల్ తో మరో రౌండ్ చర్చల కోసం లా కమిషన్‌ను మళ్లీ ఆహ్వానించనున్నారు.

జమిలి ఎన్నికల నిర్వహణ సాధ్యాసాధ్యాల పరిశీలన కోసం కేంద్ర ప్రభుత్వం నియమించిన 'హై లెవెల్ కమిటీ ఆన్ వన్ నేషన్, వన్ ఎలక్షన్' ప్యానెల్ సభ్యులతో లా కమిషన్ చైర్‌పర్సన్ రిటైర్డ్ జస్టిస్ రితురాజ్ అవస్థీ భేటీ అయ్యారు. మాజీ రాష్ట్రపతి కోవింద్ నేతృత్వం వహిస్తున్న ఈ కమిటీ రెండో సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా జమిలి ఎన్నికల నిర్వహణపై తమ ఉద్దేశాన్ని తెలపాల్సిందిగా లా కమిషన్ చైర్‌పర్సన్‌ను కోవింద్ ప్యానెల్ ఆహ్వానించింది. జమిలి ఎన్నికల నిర్వహణకు అవసరమైన రాజ్యాంగ సవరణలు, రోడ్ మ్యాప్ తయారీ తదితర అంశాల గురించి జస్టిస్ రితురాజ్, ప్యానెల్ సభ్యులతో చర్చించారు.

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను ఒకేసారి నిర్వహించే ప్రతిపాదనను లా కమిషన్ పరిశీలిస్తుండగా, మాజీ రాష్ట్రపతి నేతృత్వంలోని ప్యానెల్ అసెంబ్లీ, పార్లమెంట్, మున్సిపాలిటీ, పంచాయతీ ఎన్నికలను ఒకేసారి నిర్వహించడానికి మార్గాలను అన్వేషిస్తోంది. కోవింద్ ప్యానెల్ పేరును అధికారికంగా ఒక దేశం, ఒకే ఎన్నికలపై ఉన్నత స్థాయి కమిటీ (హెచ్‌ఎల్‌సి)గా మార్చినట్లు న్యాయ మంత్రిత్వ శాఖ గెజిట్ విడుదల చేసింది.

ఈ విషయంపై తమ అభిప్రాయాలను సేకరించేందుకు హెచ్‌ఎల్‌సి ఇప్పటికే దేశవ్యాప్తంగా ఉన్న రాజకీయ పార్టీలకు లేఖలు రాసింది. ఇప్పటి వరకు ఆరు జాతీయ పార్టీలు, 33 రాష్ట్ర పార్టీలు, ఏడు నమోదై-గుర్తింపు లేని పార్టీలకు లేఖలు పంపారు. ఇటీవలి జరిగిన సమావేశంలో కమిటీ సభ్యుడు అధిర్ రంజన్ చౌదరి రాజీనామా చేయడాన్ని పరిగణనలోకి తీసుకున్నారు. ఈ సమావేశానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రాజ్యసభలో మాజీ ప్రతిపక్ష నాయకుడు గులాం నబీ ఆజాద్ హాజరయ్యారు. కేంద్ర న్యాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, 15వ ఆర్థిక సంఘం మాజీ చైర్మన్ ఎన్.కె. సింగ్, లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్ సుభాష్ సి. కశ్యప్, సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే, మాజీ చీఫ్ విజిలెన్స్ కమిషనర్ సంజయ్ కొఠారి పాల్గొన్నారు.

రామ్‌నాథ్ కోవింద్ ప్యానెల్‌ను ఏర్పాటు చేస్తూ సెప్టెంబర్ 2న విడుదల చేసిన అధికారిక నోటిఫికేషన్‌లో తరచుగా ఎన్నికలు నిర్వహించడం వల్ల భారీ వ్యయం, ఎన్నికల కోసం అధికారిక యంత్రాంగాన్ని మళ్లించడం, ఎన్నికల ప్రవర్తనా నియమావళి కారణంగా అభివృద్ధి కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడిందని ప్రభుత్వం పేర్కొంది. అందుకే ఏకకాలంలో ఎన్నికలు జరిగితే మూడింటికి అడ్డుకట్ట వేయవచ్చని ప్రభుత్వ నోటిఫికేషన్‌లో పేర్కొంది. అయితే, ఒకే దేశం, ఒకే ఎన్నికలు అనే ప్రభుత్వ ప్రతిపాదనపై అనేక విమర్శలు వచ్చాయి. ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. మాజీ ఎన్నికల కమిషనర్ అశోక్ లావాసాతో పాటు చాలా మంది మేధావులు వ్యతిరేస్తున్నారు.

రాజస్థాన్‌లో బిజెపికి చిక్కులు

- పార్టీపై అసమ్మతి నాయకుల తిరుగుబాటు స్వరం
- టికెట్ దక్కకపోవటంతో ఆందోళనలు
- రాష్ట్రవ్యాప్తంగా అనేక స్థానాల్లో ఇదే పరిస్థితి

జైపూర్ : తాము ఇతర పార్టీల కంటే భిన్నమనీ, పార్టీలో భిన్నాభిప్రాయాలున్నా ఒక స్పష్టమైన విధానంతో ముందుకు వెళ్తామని బిజెపి నాయకులు చెప్పే మాటలు. కాంగ్రెస్, ఇతర పార్టీల కంటే తమ పార్టీ గొప్పదని వారు వాదనలు వినిపిస్తుంటారు. కానీ రాజస్థాన్‌లోని బిజెపిలో పరిస్థితులు మాత్రం ఇందుకు భిన్నంగా ఉన్నాయి. రాష్ట్రంలో రాబోయే ఎన్నికలకు అభ్యర్థుల జాబితాలను విడుదల చేసిన తర్వాత ఆ పార్టీలో పెద్ద ఎత్తున నిరసనలు చెలరేగాయి.

రాష్ట్రంలో అధికారానికి దూరమైన బిజెపి ఇప్పుడు తమ పార్టీలోని స్వంత నాయకుల నుంచే తిరుగుబాట్లను ఎదుర్కొంటున్నది. నాయకుల నిరసన గళాలతో పోరాడుతున్నది. ముఖ్యంగా, బిజెపి సీనియర్ నాయకురాలు, ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజేను శాంతింపజేసే విషయంలో బిజెపి విఫలమైందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. బిజెపి విడుదల చేసిన అభ్యర్థుల జాబితాలో వసుంధర రాజే వర్గం వారికి మొండి చేయి ఎదురైన విషయాన్ని ఈ సందర్భంగా వారు గుర్తు చేస్తున్నారు. ఈ తరుణంలో రాజే శిబిరానికి ప్రాధాన్యతనివ్వడం ద్వారా, అంతర్గత విభేదాలు తగ్గించాలనీ, టికెట్ ఆశించేవారు, వారి మద్దతుదారుల నుంచి పెరుగుతున్న తిరుగుబాటును అణిచివేయాలని బిజెపి భావిస్తున్నదని తెలిపారు.

బిజెపి విడుదల చేసిన రెండో జాబితా తర్వాత పలు జిల్లాల్లో పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. చిత్తోర్‌గఢ్, రాజ్‌సమంద్, ఉదయ్‌పూర్, కోట, జైపూర్, అల్వార్, బుండీలలో తిరుగు బాటు నేతల మద్దతు దారులు తీవ్ర నిరసనలు వ్యక్తం చేస్తు న్నారు. బిజెపి కార్య కర్తల నిర సనలు ఈ జిల్లాల్లో ఆందోళనకరంగా మారాయి. టికెట్ నిరాకరణకు గురైన అభ్యర్థుల విధేయులు, పార్టీ అగ్ర నాయకుల దిష్టిబొమ్మలను దహనం చేసిన పరిస్థితులు కనబడటం గమనార్హం. రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు సిపి జోషి సొంతగడ్డ చిత్తోర్‌గఢ్‌లో అత్యంత తీవ్రమైన స్థాయిలో నిరసనలు చెలరేగటం గమనార్హం. మాజీ ఉపరాష్ట్రపతి భైరాన్ సింగ్ షెకావత్ అల్లుడు నర్పత్ సింగ్ రజ్వీకి స్థానం కల్పించడానికి చిత్తోర్‌గఢ్ సిట్టింగ్ ఎమ్మెల్యే చంద్రభన్ సింగ్ ఆక్యను ఈ స్థానం నుంచి తొలగించారు. అలాగే, రజ్వీని జైపూర్‌లోని విద్యాధర్ నగర్ స్థానం నుంచి మార్చి.. అక్కడ రాజ్‌సమంద్ ఎంపీ దియా కుమారికి మొదటి జాబితాలో టికెట్ కేటాయించటం రజ్వీ వర్గానికి తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించిందని రాజకీయ విశ్లేషకులు తెలిపారు.

ఉదయపూర్‌లో నగర డిప్యూటీ మేయర్ పరాస్ సింఘ్వి తారాచంద్ జైన్‌కు టిక్కెట్‌ను బహిరంగంగా వ్యతిరేకిస్తున్నారు. బిజెపి తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని బిజెపి నాయకులు, కార్యకర్తలు కోరుతుండటం గమనార్హం. జైపూర్‌లో సంగనేర్ సిట్టింగ్ ఎమ్మెల్యే అశోక్ లాహోటీ మద్దతుదారులు ఆదివారం బిజెపి కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. రాజే విధేయుడైన లాహోటీ స్థానంలో భజన్ లాల్ శర్మను నియమించారు. బిజెపి కార్యాలయం వద్ద లాహోటి విధేయులు పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తం చేశారు.

ఎన్నికల వేళ..రంగంలోకి ఇడి

అశోక్ గెహ్లాట్ కుమారుడికి సమన్లు

జైపూర్ : రాజస్థాన్‌లో ఎలాగైనా అధికారాన్ని చేజిక్కించుకోవాలని ఎత్తులు వేస్తున్న బిజెపి కేంద్ర దర్యాప్తు సంస్థలను సైతం రంగంలోకి దింపుతోంది. ఎన్నికల వేళ ఒకవైపు ప్రచారం హోరు కొనసాగుతోంటే మరోవైపు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) సోదాలను ముమ్మరం చేస్తోంది. విదేశీ మారక ద్రవ్య ఉల్లంఘన (ఎఫ్ఇఎంఎ) కేసులో రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ కుమారుడు వైభవ్ గెహ్లాట్‌కు గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) సమన్లు జారీ చేసింది. ఈ నెల 27న న్యూఢిల్లీలోని ఇడి ప్రధానకార్యాలయంలో విచారణకు హాజరు కావాలని పేర్కొంది. కాగా, ఈ కేసులో ఆగస్టులో జైపూర్, ఉదయ్‌పూర్, ముంబయి, ఢిల్లీల్లో ఇడి సోదాలు నిర్వహించింది. రాజస్థాన్‌కు చెందిన ట్రిటన్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్లు, ప్రమోటర్లు శివ శంకర్ శర్మ, రత్తన్ కాంత్ శర్మ, ఇతరులకు వ్యతిరేకంగా ఈ సోదాలు జరిగాయి. ఈ సోదాల్లో లెక్క చూపని రూ 1.2 కోట్లను ఇడి స్వాధీనం చేసుకుంది. రత్తన్ కాంత్ శర్మకు వైభవ్ గెహ్లాట్‌కు మధ్య లావాదేవీలు ఉన్నాయని ఆరోపిస్తుంది. ఈ విషయంపైనే వైభవ్ గెహ్లాట్‌ను ఇడి ప్రశ్నించి, అతని స్టేట్‌మెంట్‌ను నమోదు చేస్తుందని భావిస్తున్నారు. గతంలో వైభవ్‌కు రత్తన్ కాంత్ ఒక కార్ రెంటల్ కంపెనీలో భాగస్వామిగా ఉన్నాడు.

పిసిసి చీఫ్ నివాసంపై ఇడి దాడి

రాజస్థాన్ పిసిసి అధ్యక్షులు గోవింద్ సింగ్ దోతస్రా, మహువా నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి నివాసాలపై గురువారం ఇడి దాడులు నిర్వహించింది. శికార్, జైపూర్‌లో ఉన్న గోవింద్ సింగ్ నివాసాలపై పరీక్ష పేపర్ల లీక్‌కు సంబంధించిన ఒక మనీలాండరింగ్ కేసు విచారణలో భాగంగా ఇడి దాడులు నిర్వహించింది. వచ్చే నెలలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో మహువా నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉన్న ఓం ప్రకాశ్ హుడ్లా, మరికొందరు కాంగ్రెస్ నాయకులు నివాసాలపైనా ఇడి దాడులు నిర్వహించింది. కాగా ఎన్నికల్లో పోరాటానికి దర్యాప్తు సంస్థల సహాయాన్ని మోడీ తీసుకుంటున్నారని కాంగ్రెస్ విమర్శించింది. ఎన్నికల్లో బిజెపికి ప్రజలు తగిన సమాధానం చెబుతారని తెలిపింది.

తన కుమారుడికి ఇడి సమన్లు జారీ చేయడంపై అశోక్ గెహ్లాట్ తీవ్రంగా స్పందించారు. ఎన్నికల్లో ఓటమి భయంతోనే బిజెపి కాంగ్రెస్ నాయకులను లక్ష్యంగా చేసుకుందని, దర్యాప్తు సంస్థలను కేంద్రం దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. గోవింగ్ సింగ్, ఓం ప్రకాశ్ నివాసాలపై ఎలాంటి ఫిర్యాదులు లేకుండానే ఇడి దాడులు జరిగాయని పేర్కొన్నారు.

ప్రియాంక గాంధీకి ఇసి నోటీసులు

న్యూఢిల్లీ : కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ప్రియాంక గాంధీ వాద్రాకు కేంద్రం ఎన్నికల సంఘం గురువారం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. రాజస్థాన్ ఎన్నికల ప్రచారంలో రెచ్చగొట్టే ప్రసంగం చేసినందుకుగానూ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ కింద ప్రియాంకకు ఇసి ఈ నోటీసులు జారీ చేసింది. ఈ నెల 30 సాయంత్రంలోపు నోటీసులకు స్పందించాలని ఆమెను కోరింది. ఈ నెల 20న దౌసా బహిరంగ సభలో ప్రియాంక గాంధీ వాద్రా ప్రసంగిస్తూ.. 'ప్రధాని మోడీ ఒక ఆలయానికి ఇచ్చిన విరాళం కవర్‌ను తెరిస్తే.. అందులో కేవలం రూ.21 మాత్రమే ఉన్నాయి. టీవీలో ఆ వార్త చూశా. అది నిజమో కాదో నాకు తెలియదు. కానీ, ప్రజలకు బిజెపి ఇచ్చే హామీలు కూడా ఆ ఎన్వెలప్ కవరు లాంటివే. అందులో ఏమీ ఉండవు' అని ప్రియాంక వ్యాఖ్యానించారు. ప్రియాంక ప్రసంగానికి సంబంధించిన ఈ వీడియోపై బిజెపి ఫిర్యాదు చేయడంతో ఇసి ఆమెకు నోటీసులు జారీచేసింది.

ఎటుచూసినా కన్నీటిధారలే !

- గాజాలో 20 రోజులుగా ఇజ్రాయిల్ మారణకాండ
- ఇప్పటి వరకు 7028 మంది మృతి
- వీరిలో 3000 మంది చిన్నారులే

ఇజ్రాయిల్ దాడిలో కుటుంబసభ్యులను కోల్పోయి రోదిస్తున్న ఆల్‌జజీర జర్నలిస్టు వేల్ అల్ దహదౌహ్

గాజా : అంతర్జాతీయ సమాజం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నా ఏమాత్రం చెవికెక్కించుకోని ఇజ్రాయిల్ యుద్ధోన్మాదంతో ఊగిపోతోంది. గాజాలో ఎటుచూసినా కన్నీటిధారలే కనిపిస్తున్నాయి. చంటి బిడ్డలు, వృద్ధులు అనే తేడా లేకుండా ఇజ్రాయిల్ దాడులకు బలైపోతున్నవారి సంఖ్య పెరిగిపోతూనేవుంది. పాత్రికేయులు నేలకొరుగుతున్నారు. క్షతగాత్రులతో నిండిపోతున్న ఆసుపత్రుల్లో సౌకర్యాలు, మందుల కొరతతో వైద్య సేవలు స్థంబించిపోవడంతో రోధనలు మిన్నంటుతున్నాయి. సకాలంలో వైద్యం అందక తనువు చాలిస్తున్న వారెందరో. మానవ సాయాన్ని అడ్డుకోవద్దంటూ ఐక్యరాజ్యసమితి విజ్ఞప్తి చేసినా ఇజ్రాయిల్ పెడచెవిన పెడుతోంది. ఏమాత్రం కనికరం లేకుండా గాజా స్ట్రిప్‌లో యథేశ్చగా మారణకాండ కొనసాగిస్తోంది. హమస్ సాయుధులను మట్టుబెట్టే సాకుతో ఇజ్రాయిల్ చేపట్టిన వైమానిక దాడులకు 20 రోజులవుతున్నా బుధవారం కూడా ఈ దాష్టీకాలు కొనసాగాయి. పాలస్తీనా ఆరోగ్యమంత్రిత్వ శాఖ, పాలస్తీనా రెడ్‌క్రిసెంట్ సొసైటీ వెల్లడించిన వివరాల ప్రకారం..ఇజ్రాయిల్ దాడుల్లో ఒక్క గాజా స్ట్రిప్‌లోనే బుధవారం సాయంత్రం 4 గంటల సమయానికి 7028 మంది పౌరులు చనిపోయారు. వీరిలో దాదాపు 3000 మంది చిన్నారులు కాగా, మరో 1700 మంది మహిళలున్నారు. 400 మంది వృద్ధులు కూడా ఇజ్రాయిల్ దాడులకు బలైపోయినవారిలో ఉన్నారు. దాదాపు 17500 మంది పౌరులు గాయపడ్డారు. ఆక్రమిత వెస్ట్‌బ్యాంకులో 103 మంది చనిపోగా, 1836 మంది గాయపడ్డారు. కాగా ఇజ్రాయిల్‌పై హమస్ జరిపిన దాడుల్లో 1405 మంది చనిపోగా, 5431 మంది గాయపడ్డారని ఇజ్రాయిల్ మెడికల్ సర్వీసెస్ వెల్లడించింది.

బలైపోతున్న పాత్రికేయులు

గాజాపై ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న వైమానిక దాడుల్లో పాత్రికేయులు కూడా పెద్ద సంఖ్యలో చనిపోతున్నారు. ఇప్పటి వరకు దాదాపు 25 మంది పైగా పాత్రికేయులు చనిపోయినట్లు తెలుస్తోంది. తాజాగా బుధవారం రాత్రి జరిగిన ఇజ్రాయిల్ దాడుల్లో ఆల్ జజీరా జర్నలిస్టు, అరబిక్ బ్యూరో ఛీఫ్ వేల్ అల్ దహదౌహ్ కుటుంబ సభ్యులు ప్రాణాలు కోల్పోయారు. సెంట్రల్ గాజాలోని ఇజ్రాయెల్ సురక్షిత ప్రాంతాల్లో ఒకటిగా భావిస్తున్న నుసెరాత్ క్యాంప్ అతని ఇంటిని లక్ష్యంగా జరిగిన దాడిలో భార్య, కుమార్తె, కుమారుడిని కోల్పోవడం తీవ్ర విషాదాన్ని నింపింది. దహదౌహ్ భార్య కుమారుడు, కుమార్తె గాజాలో నివసిస్తున్నారు. సురక్షితమైన ఈ ప్రాంతాన్ని టార్గెట్ చేసుకుని వైమానిక దాడులకు దిగబోతున్నాయనే విషయాన్ని భార్య తెలుసుకున్నారు. అక్కడి నుంచి తన కుమారుడు, కుమార్తెతో కలిసి పారిపోతుండగా వారిపై దాడి జరిగింది. దీంతో వారు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వారంతా శిథిలాల కింద సమాధి అయ్యారు. ఆస్పత్రిలో విగతజీవిగా పడి ఉన్న కుటుంబ సభ్యులను చూసిన దహదౌహ్ కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న దృశ్యాలు కలిచి వేస్తున్నాయి. 'ఏమి జరిగిందో స్పష్టంగా తెలుస్తోంది. పిల్లలు, మహిళలు, పౌరులే టార్గెట్‌గా చేస్తున్న వరుస దాడులివి.

ఇజ్రాయెల్ దాడులు నుసైరాత్‌తో సహా అనేక ప్రాంతాలను లక్ష్యంగా చేస్తున్న దాడుల గురించి యార్మౌక్ నుండి రిపోర్టు చేస్తున్నాను.. అంటూ ఉద్వేగానికి లోనయ్యారు. ఇజ్రాయెల్ ఆధీనంలో ఉన్న వారికి శిక్షించకుండా వదిలి పెట్టరనే అనుమానాలను కూడా ఆయన వ్యక్తం చేశారు. మరోవైపు గాజాలో అమాయక పౌరులను విచక్షణారహితంగా లక్ష్యంగా చేసుకుని చంపడాన్ని అల్ జజీరా తీవ్రంగా ఖండించింది. మరికొంత మంది జర్నలిస్టుల కుటుంబ సభ్యుల ఆచూకీ కూడా గల్లంతు అయినట్టు సమాచారం.

హమాస్ దాడులకు ఆ ఒప్పందం కారణం కావొచ్చు!

- అమెరికా అధ్యక్షులు బైడెన్ వ్యాఖ్యలు



వాషింగ్టన్ : భారత్-మిడిల్ ఈస్ట్-యూరప్ ఎకనామిక్ కారిడార్ ఒప్పందంపై అమెరికా అధ్యక్షులు జో బైడెన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయెల్‌పై హమాస్ దాడులకు ఈ ఒప్పందం కూడా కారణం అయ్యి ఉండొచ్చని పేర్కొన్నారు. గురువారం ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ అల్బెనీస్‌తో కలిసి మీడియాతో ఆయన మాట్లాడుతూ.. హమాస్ దాడుల వెనక భారత్ మిడిల్ ఈస్ట్ యూరప్ ఎకనామిక్ కారిడార్ ప్రకటన కూడా ఒక కారణం అయ్యివుండొచ్చున్నారు. దీనికి సంబంధించిన రుజువులేవీ తమ దగ్గర లేవని, అయితే అది కూడా కారణమని తాను విశ్వసిస్తున్నట్లు తెలిపారు. ఈ ఒప్పందం ఇజ్రాయెల్ కోసం, ప్రాంతీయ సమైక్యత కోసం చేపట్టిన పురోగతి అయినందున.. ఎట్టి పరిస్థితుల్లో ఆ కారిడార్ విషయంలో వెనక్కి తగ్గమని బైడెన్ తెలిపారు. న్యూఢిల్లీలో జరిగిన జి-20 సదస్సు సందర్భంగా.. భారత్-మిడిల్ ఈస్ట్-యూరోపియన్ ఎకనామిక్ కారిడార్ కోసం ఎంఒయు జరిగింది. భారత్‌తో పాటు అమెరికా, యుఎఇ, సౌదీ అరేబియా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, యూరోపియన్ యూనియన్‌లు నాటి ఎంఒయుపై సంతకాలు చేశాయి. ఆసియా, పశ్చిమాసియా, మిడిల్ ఈస్ట్, యూరప్ మధ్య ఆర్థిక మెరుగైన అనుసంధానం కోసం.. ముఖ్యంగా ఆర్థిక ఏకీకరణ ద్వారా కారిడార్ ఆర్థిక అభివృద్ధి కోసం ఆయా దేశాలు ఈ ఎంఒయు కుదర్చుకున్నాయి.

హమాస్‌కు ఇరాన్ శిక్షణ : ఇజ్రాయెల్ ఆరోపణ

జెరూసలెం : హమాస్ మిలిటెంట్లకు ఇరాన్ శిక్షణ ఇచ్చిందంటూ ఇజ్రాయెల్ ఆరోపించింది. అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి జరగక ముందే ఇరాన్.. హమాస్ మిలిటెంట్లకు శిక్షణ అందించడంతోపాటు డబ్బు, ఆయుధాలను కూడా ఇచ్చిందని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడిఎఫ్) ఆరోపించింది. పాలస్తీనా మిలిటెంట్లు జరిపిన దాడిలో ఇరాన్ హస్తం కూడా ఉందని ఇజ్రాయెల్ పేర్కొంది. ఐడిఎఫ్ ప్రతినిధి రియర్ అడ్మిరల్ డేనియల్ హగారి మాట్లాడుతూ.. 'ఈ యుద్ధానికి ముందుగానే ఇరాన్.. హమాస్ మిలిటెంట్లకు శిక్షణ, ఆయుధాలు, నిధులు, సాంకేతికత సహాయాన్ని అందించింది' అని అన్నారు. హమాస్‌కు ఆర్థికసాయం, శిక్షణ, ఆయుధాలు అందిస్తున్నట్లు ఇరాన్ అంగీకరించినప్పటికీ, ఇజ్రాయెల్ దాడిలో తమ పాత్ర లేదని పేర్కొంది.

మీకోసం

పప్పులు, రవ్వ ముక్కిపోకుండా ఉండాలంటే వాటిని దోరగా వేయించి చల్లారాక డబ్బాల్లో నిల్వ చేసుకోవాలి.

జీవన సౌరభం

మనం ఎంచుకున్న మంచి మార్గంలో జంకు లేకుండా ముందుకు సాగిపోవాలి.

ఎం.ఎస్.స్వామినాథన్



తమిళనాడు రాష్ట్రంలో
కుంభకోణం పట్టణంలో
విఖ్యాత శాస్త్రవేత్త
స్వామినాథన్ జనియించె!

పువ్వు పుట్టగానే అది
పరిమళించు రీతిగా!
చిన్ననాటి నుండియే
ప్రతిభనతను చూపించె!

యువకుడుగా నున్నపుడే
బెంగాల్ క్షామం చూసి
ఆకలి బాధను తీర్చే
శాస్త్రవేత్తగా మారె!

అది మొదలుగ జీవితంలో
ప్రతి క్షణం కృషి చేసెను!
నూతన అధ్యయనానికి
వినూత్నంగా తెరతీసెను!

ఎక్కువ దిగుబడులిచ్చే
వంగడాలు కనుగొనెను!
హరిత విప్లవానికతను
ఆద్యుడుగా పేరొందెను!

వరి, గోధుమ దిగుబడులు
గణనీయంగా పెరిగెను!
ఆహారవృద్ధిన మనం
సమృద్ధిని సాధించెను!
ఎన్నెన్నో పదవులంది
పదవులకే వన్నెతెచ్చె!
ఎన్నో అవార్డుల నొంది
చిర యశస్సును పొందె!

రైతు సంక్షేమమతని
జీవిత లక్ష్యం ఆయెను!
సేద్యరంగ అభివృద్ధి
ఆయన ఊపిరి ఆయెను!

మట్టి వాసన తెలిసిన
నేలతల్లి బిడ్డడతను!
అన్నదాత బతుకుల్లో
వెలుగులు పూయించెనతను!

జాతి గర్వించదగ్గ
గొప్ప పరిశోధకుడు!
యువతకు స్ఫూర్తినిచ్చే
నిత్య కృషీవలుడు!

అతని బాట ఆదర్శం
అతని లక్ష్యం సేద్యం
అతని ధ్యేయం సంక్షేమం
అతని జీవితమే సందేశం!

– రావిపల్లి వాసుదేవరావు,
విజయనగరం,
94417 13136.

దారి కనిపెట్టండి

పిల్లలూ, జగ్గులో నీళ్లు కుండీలో ఉన్న మొక్క మీద పడేట్లు దారి చూపించండి.

నేను గీసిన బొమ్మ

టి కౌశిక్ అభిరామ్,
4వ తరగతి,
అరవింద హైస్కూలు,
కుంచనపల్లి,
మంగళగిరి.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

యుద్ధభూమిలో అమ్మల ఆవేదన!

వాళ్ళు యుద్ధోన్మాదంతో బాంబులు విసిరి ప్రాణాలు తీస్తున్నారు. ఈ అమ్మలు కడుపులోని బిడ్డలకు ఎలా ప్రాణం పోయాలా అని తల్లడిల్లిపోతున్నారు. ఇదీ, ఇజ్రాయిల్ అమానవీయ దాడులతో గాజాలో నెలకొన్న దుర్భరమైన పరిస్థితి!



'నా చుట్టూ బాంబుల మోతలు దద్దరిల్లుతున్నాయి. ఎప్పుడు, ఎటువైపు నుండి బుల్లెట్ల వర్షం కురుస్తుందో తెలియడం లేదు. ఆకాశం నుండి మా ప్రాణాలను హరించే మందుపాతరలు నేలరాలుతున్నాయి. ఇక్కడి వాతావరణం దట్టమైన పొగతో నిండిపోయింది. నా కళ్ల ముందే నా అనుకున్నవాళ్లను పోగొట్టుకున్నాను. ఎటుచూసినా శవాల దిబ్బలే. కుప్పకూలిన భవంతుల మధ్య అయినవాళ్ల మృతదేహాలను వెతుక్కుంటున్న భయానక దృశ్యాలు. పిల్లలు, వృద్ధులు, మహిళలు అన్న తేడా లేదు. వేలాదిమంది అతి దారుణంగా హతమయ్యారు. ఇంతటి భీకర పరిస్థితిలో నెలలు నిండిన నేను నా బిడ్డకు ఎలా జన్మ ఇవ్వాలి? ఒకవేళ ఆ బిడ్డ ఈ భూమ్మీదకు వస్తే.. తనని ఎలా కాపాడుకోవాలి' అంటూ గాజా భూభాగంలో గర్భిణీలు దిక్కులు పిక్కటిల్లేలా రోదిస్తున్నారు. ఒకరు, ఇద్దరు కాదు; మొత్తం 50 వేల మంది ఇప్పుడు అక్కడ ప్రసవానికి సిద్ధంగా ఉన్నారు. వైద్యులు, వైద్య సదుపాయాలు మృగ్యమైన వేళ, దీనంగా రోదిస్తున్న ఆ మహిళలను ఆదుకునేవారు ఎవరు?

నివిన్ అల్ బార్బ్ (33) ఈ నెలలోనే తన మొదటి బిడ్డను ప్రసవించడానికి సిద్ధంగా ఉంది. అక్టోబరు 7న ఇజ్రాయిల్ మారణహోమం మొదలు కావడానికి ముందు రోజు వరకు ఆమె వైద్యుల పర్యవేక్షణలో చికిత్స తీసుకుంటోంది. మధుమేహం, రక్తపోటు, గ్యాస్ట్రిక్ సమస్యలతో బాధపడుతున్న ఆమె ఆరోగ్యవంతమైన బిడ్డను ప్రసవించేందుకు రోజూ డాక్టరును కలిసేది. కానీ ఇప్పుడు ఆమె ఆశ్రయం పొందుతున్న శిబిరం పక్కనే ఇజ్రాయిల్ బాంబుల వర్షం కురిపిస్తోంది. 'ప్రతి విస్ఫోటనానికి నా శరీరం చిగురుటాకులా వణికిపోతోంది. భయంతో వెన్నుపూస కదిలిపోయినంత బాధ కలుగుతోంది. ఒత్తిడి వల్ల కడుపులో తీవ్రంగా నొప్పి వస్తోంది. ఏ ఇల్లు నేలమట్టమవుతుందో.. ఎవరు చనిపోతారో తెలియని భీకర వాతావరణంలో నా బిడ్డకు ఎలా జన్మ ఇవ్వాలి?' అని ఆమె తల బాదుకుంటూ రోదిస్తోంది.

'ప్రతి రోజూ ఇక్కడితో ఈ యుద్ధం ముగియాలని కోరుకుంటున్నాను. కానీ రోజురోజుకూ నా కళ్ల ముందే గాయాలపాలైన, బాంబుదాడిలో ప్రాణాలు కోల్పోయిన ఎందరో చిన్నారులు ఇక్కడి నేలపై బారులు తీరుతున్నారు' అంటోంది ఆరునెలల గర్భిణీ సౌద్ అస్రాఫ్. ఆమె షాతి శరణార్థ శిబిరంలో ఆశ్రయం పొందుతోంది. తన మూడో బిడ్డకు జన్మనిచ్చేందుకు సిద్ధంగా ఉన్న ఆమె 'నేను ఇక్కడ చాలా ఒత్తిడితో ఉంటున్నాను. భయంతో నిద్ర పట్టడం లేదు. అరకొర సదుపాయాలతో అపరిశుభ్ర వాతావరణంలో నా ఇద్దరు బిడ్డలను కాపాడుకోవడమే ఇప్పుడు కష్టంగా ఉంది. ఉప్పునీరే తాగాల్సి వస్తోంది. సరిగ్గా నిలబడలేకపోతున్నాను. ఈ ఒత్తిడి నా కడుపులో పెరుగుతున్న బిడ్డపై పడుతుందని భయంగా ఉంది' అంటోంది. వైద్య సాయం కోసం యుఎన్ హెల్త్ సెంటర్‌ని సంప్రదించాలని ఎన్ని సార్లు ప్రయత్నించినా ఫలించలేదు. సరైన పోషకాహారం అందక ఆమె చాలా బలహీనంగా ఉంది. ప్రభుత్వ స్కూల్లో ఏర్పాటు చేసిన ఆ శిబిరంలో కిక్కిరిసిన జనాభా ఉన్నారు. తీవ్ర అలసటతో ఉన్న ఆమె రోజు మొత్తంలో 30 నిమిషాలు కూడా విశ్రాంతి తీసుకోవడం లేదు. ఈ శిబిరంలోనే అస్రాఫ్‌తో పాటు మరో ముగ్గురు గర్భిణీలు ఆశ్రయం పొందుతున్నారు. రెండు రోజుల క్రితమే వారిలో ఒకరు తీవ్ర ఒత్తిడితో కళ్లు తిరిగిపడిపోయారని అస్రాఫ్ గుర్తు చేసుకుంది.

బిడ్డల కోసం ఏళ్లకు ఏళ్లు ఎదురుచూసి ఐవిఎఫ్ ద్వారా మాతృత్వాన్ని పొందుతున్న మహిళల పరిస్థితి ఇప్పుడు మరింత దారుణంగా తయారైంది. లైలా బరాకా (30) మూడు నెలల గర్భిణీ. రెండో బిడ్డ కోసం ఎన్నో ప్రయత్నాల తరువాత ఐవిఎఫ్ విజయవంతమై ఆమె గర్భం దాల్చింది. 'ప్రతి రోజూ బాంబుల మోతతో దద్దరిల్లిపోతోంది. రాత్రి పగలు తేడా లేదు. భయాన్ని పోగొట్టుకోవడానికి నా ఐదేళ్ల బిడ్డను గట్టిగా హత్తుకుంటున్నాను. అయినా భయం పోవడం లేదు. ఇక్కడ వినిపిస్తున్న శబ్దాలు మనుషులనే కాదు రాళ్లకు కూడా భయపెడతాయి' అంటోంది ఆమె.

నెలలు నిండిన బరాకా, సుఖ ప్రసవం కోసం ఖాన్ యౌనిస్ నుండి సురక్షిత ప్రాంతమైన పెద్ద సిటీకి చేరుకుంది. ఇక్కడికి చేరుకున్నప్పటి నుండి ఆమెకు చికిత్స అందలేదు. సరిహద్దు మార్గాలు మూసివేయబడడం వల్ల అక్కడ ఉన్న ఏకైక వైద్యఆరోగ్య కేంద్ర మూతబడింది. 'నేను వచ్చిన ప్రాంతంలో నా డాక్టరు కూడా ఎక్కడికో వెళ్లిపోయారు. అందుకే నేను ఇక్కడి వరకు వచ్చాను. కానీ ఇక్కడ వైద్యులు లేరు, వైద్యం అందడం లేదు. ఈ పరిస్థితులు నన్ను తీవ్రంగా కలచివేస్తున్నాయి. కుప్పలుతెప్పలుగా పడిఉన్న పిల్లలు, మహిళల మృతదేహాలు నాకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి' అంటూ వణుకుతున్న స్వరంతో ఆమె చెబుతోంది.

'యునైటెడ్ నేషన్స్ పాపులేషన్ ఫండ్ (యుఎన్‌పిఎఫ్) ప్రకారం గాజాలో 50 వేల మంది గర్భిణీలు ఉన్నారు. వారిప్పుడు వైద్య పరీక్షలకు దూరంగా నెట్టివేయబడ్డారు. ఆస్పత్రులు మూతబడ్డాయి. ఎలాంటి వైద్యమూ అందని పరిస్థితి! రెండు వారాల నుండి గాజా నుంచి లక్షల మంది ప్రజలు తరలి వెళ్లిపోతున్నారు. వారిలో గర్భిణీలు కూడా ఉన్నారు. ఆరోగ్యకేంద్రాలు అందుబాటులో లేక తల్లీబిడ్డ ప్రమాదంలో ఉన్నారు' అని ఖాన్ యౌనిస్‌లోని నాసిర్ మెడికల్ కాంప్లెక్స్ ప్రసూతి వైద్యులు వాలిద్ అబు హతాబ్ ఆవేదన చెందుతున్నారు.

ఇప్పటివరకు ఇజ్రాయిల్ బాంబుల దాడికి మృతి చెందిన పాలస్తీనీయన్లు 6,500 మంది కాగా, వారిలో 2/3 వంతు మంది పిల్లలు, మహిళలే ఉన్నారు. 'ఇదేనా మా పిల్లల భవిష్యత్తు. 75 ఏళ్లుగా మేము భీకర వాతావరణంలో జీవిస్తున్నాం. మా సొంత గడ్డపై భద్రత లేని బతుకులు వెల్లదీస్తున్నాం. ఇప్పుడు జరుగుతున్న ఈ మారణకాండ మమ్మల్ని పూర్తిగా తుదముట్టించేంత వరకు ఆగేలా లేదు. రక్షించేవారు లేక మా ప్రాణాలు గాల్లో తేలుతున్నాయి' అని అక్కడి తల్లులు రోదిస్తున్నారు. యావత్ మానవ సమాజం వారికి సంఘీభావం తెలపాల్సిన, చేయూతనందించాల్సిన సమయం ఇది!

వెంకటేష్ కుమార్తె నిశ్చితార్థం

వెంకటేష్ రెండోవ కుమార్తె హయవాహిని నిశ్చితార్థం బుధవారం జరిగింది. విజయవాడకు చెందిన ఓ డాక్టర్ కుమారుడితో వెంకటేష్ స్వగృహంలోనే ఈ వేడుక నిర్వహించారు. ఈ నిశ్చితార్థ వేడుకకు చిరంజీవి, మహేశ్‌బాబు సహా పలువురు సెలబ్రిటీలు హాజరయ్యారు. రానా, నాగ చైతన్య తదితరులు హాజరయ్యి నిశ్చిత వధూవరులను ఆశీర్వదించారు. వీరి పెళ్లి వచ్చే ఏడాదిలో ఉండనుందని తెలుస్తోంది.

వెంకటేష్, నీరజ దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. పెద్ద కుమార్తె ఆశ్రిత వివాహం 2019లో జరిగింది. ప్రస్తుతం ఆమె విదేశాల్లో ఉంటోంది.

ఆదికేశవలో 'లీలమ్మో' పాట విడుదల

హీరో వైష్ణవ్‌తేజ్, హీరోయిన్‌గా శ్రీలీల నటిస్తున్న చిత్రం ఆదికేశవ. ఈ సినిమాలోని 'లీలమ్మో' అంటూ సాగే మూడో పాటను చిత్ర నిర్మాతలు హైదరాబాద్‌లోని పార్క్ హయత్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా వైష్ణవ్ తేజ్ మాట్లాడుతూ..'ప్రతిరోజూ సెట్ కళకళలాడుతూ ఉండేది. శ్రీలీల, సుదర్శన్ సెట్‌కి వస్తే ఇంకా ఎక్కువ కళకళలాడేది. షూటింగ్ అంతా ఎంతో సరదాగా జరిగింది' అని అన్నారు. కథానాయిక శ్రీలీల మాట్లాడుతూ.. 'ఇప్పుడే అమ్మవారి దసరా అయ్యింది. నవంబర్ 10న శివుడి పేరుతో మా 'ఆదికేశవ' వస్తుంది. 'లీలమ్మో' నాకు ఎంతో ఇష్టమైన పాట. పైగా నా పేరుతో ఉన్న మొదటి పాట. అందుకే ఇది నాకు మరింత ప్రత్యేకమైన పాట. ఈ సాంగ్ మీరందరూ ఎంజాయ్ చేస్తారు. వైష్ణవ్ అద్భుతంగా డ్యాన్స్ చేశారు. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చాలా బాగుంది. పాట వినగానే నాకు స్నేక్ డ్యాన్స్ చేయాలి అనిపించింది." అన్నారు. చిత్ర దర్శకుడు శ్రీకాంత్ ఎన్ రెడ్డి కూడా మాట్లాడారు.



ఐదేళ్లలో పెళ్లి చేసుకుంటా : కంగనా రనౌత్

తాను మరో ఐదేళ్లలో పెళ్లి చేసుకుంటానని బాలీవుడ్ నటి కంగనా రనౌత్ చెప్పారు. ఆమె ప్రధాన పాత్రలో సర్వేశ్ మేవారా దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా 'తేజస్'. శుక్రవారం నాడు ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ పెళ్లిపై తన అభిప్రాయాన్ని తెలిపారు. గతంలో బ్రేకప్ అయిన తన రిలేషన్స్ గురించి వెల్లడించారు. 'ప్రతి అమ్మాయి తన పెళ్లి, కుటుంబం గురించి కలలు కంటుంది. నేను కుటుంబ వ్యవస్థను ఎంతో గౌరవిస్తాను. పెళ్లి చేసుకుని నాకంటూ ఓ కుటుంబం ఉండాలని కోరుకుంటాను. ఇదంతా రానున్న ఐదేళ్లలో జరుగుతుంది. అది కూడా పెద్దలు కుదిర్చిన ప్రేమ వివాహమైతే బాగుంటుంది. నేను తెలిసీ తెలియని వయసులో ప్రేమలో విఫలమయ్యాను. ప్రేమ విఫలమవ్వడం వల్ల జరిగే ప్రయోజనాన్ని చాలామంది జీవితంలో చాలా ఆలస్యంగా తెలుసుకుంటారు' అని వివరించారు.

సూర్య కొత్త చిత్రం ప్రారంభం

సూర్య హీరోగా తన 43వ చిత్రాన్ని సుధా కొంగరతో చేయనున్నట్లు గతంలోనే ప్రకటించారు. తాజాగా గురువారం ఈ చిత్ర మోషన్ పోస్టర్ విడుదల చేశారు. ఇందులో సూర్యతో పాటుగా దుల్కర్ సల్మాన్, నజ్రియా ఫహద్ కనిపించారు. ఈ చిత్రానికి జీవి ప్రకాష్ సంగీతం అందించనున్నారు. ఇది ఆయనకు 100వ చిత్రం కానుంది.

ఆర్‌టి4జిఎం ప్రారంభం

హీరో రవితేజ, దర్శకుడు గోపీచంద్ మలినేనితో నాల్గోసారి కలిసి చేస్తున్న ప్రాజెక్ట్ ఆర్‌టి4జిఎం. మైత్రీ మూవీస్ మేకర్స్ ఈ సినిమా నిర్మించనున్నారు. రవితేజ, సెల్వరాఘవన్, ఇందూజ రవిచంద్రన్, ఇతర టీమ్ సభ్యులు, పలువురు ప్రత్యేక అతిథుల సమక్షంలో ఈ చిత్రం పూజా కార్యక్రమాలు గురువారం జరిగాయి. స్క్రిప్ట్‌ని అల్లు అరవింద్‌కు నిర్మాతలు అందజేశారు. ముహూర్తం షాట్‌కు అన్మోల్ శర్మ కెమెరా స్విచాన్ చేయగా, వివి వినాయక్ క్లాప్ ఇచ్చారు. తొలి షాట్‌కి కె.రాఘవేంద్రరావు గౌరవ దర్శకత్వం వహించారు. నటుడిగా మారిన ఫిల్మ్ మేకర్ సెల్వరాఘవన్ ఈ చిత్రంలో కీలక పాత్రలో నటించనున్నారు. ఇది ఆయన చేస్తున్న తొలి తెలుగు సినిమా. ఇందూజ రవిచంద్రన్‌ని ఓ కీలక పాత్ర కోసం ఎంచుకున్నారు. ఈ సినిమాలో హీరోయిన్ ఎవరనేది ఇంకా నిర్ణయించలేదు. ఎస్ థమన్ ఈ చిత్రానికి సంగీతం అందించనున్నారు.

3న 'త్రీ ఆఫ్ అస్' విడుదల

అల్లు ఫ్యామిలీ సొంత ప్రొడక్షన్ అయిన అల్లు ఎంటర్‌టైనమెంట్స్ బ్యానర్‌పై బన్నీ వాసు నిర్మిస్తున్న బాలీవుడ్ చిత్రం 'త్రీ ఆఫ్ అస్'. బాలీవుడ్ నటి షెఫాలీ షా, 'పాతాల్ లోక్ ఫేమ్' జైదీప్ అహ్లావత్, స్వానంద్ కిర్కిరే ఈ సినిమాలో ప్రధాన పాత్రలు పోషిస్తుండగా.. అవినాష్ అరుణ్ ధావేర్ దర్శకత్వం వహిస్తున్నారు. 2022లోనే షూటింగ్ ముగించుకున్న ఈ సినిమా అనుకోని కారణాలతో వాయిదా పడుతూ వస్తోంది. తాజాగా ఈ చిత్రం విడుదల తేదీని చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా ట్రైలర్ విడుదల చేశారు. ట్రైలర్ గమనిస్తే మహారాష్ట్రలోని కొంకణ్ ప్రాంతంలో విడిపోయిన స్నేహితులు 17 ఏండ్ల తర్వాత కలుసుకున్నాక వారి జీవితాల్లో ఏ జరిగింది అనేది స్టోరీ. లవ్ అండ్ ఎమోషనల్ బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ మూవీ అల్లు అరవింద్ సమర్పణలో నవంబర్ 3న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఐఎఫ్‌ఎఫ్ఐ ఇండియన్ పనోరమా 2022 కోసం ఎంపిక చేసిన 25 చిత్రాల జాబితాలో ఈ చిత్రం కూడా చోటు దక్కించుకుంది.

ఇంగ్లండ్‌కు మరో షాక్

శ్రీలంక చేతిలో ఓటమి

బెంగళూరు : డిఫెండింగ్ ఛాంపియన్ ఇంగ్లండ్‌కు మరో షాక్ తగిలింది. వన్డే ప్రపంచ కప్‌లో భాగంగా ఇప్పటికే ఆఫ్ఘనిస్తాన్ చేతిలో ఓడిన ఇంగ్లండ్ జట్టు.. గురువారం జరిగిన కీలకమైన మ్యాచ్‌లో శ్రీలంక చేతిలో ఘోర పరాజయం చవిచూసింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్.. లంక బౌలర్ల ధాటికి 156 పరుగులకే కుప్పకూలింది. ఈ స్వల్ప లక్ష్యాన్ని లంక.. 25.4 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి ఛేదించింది. కుశాల్ పెరీరా (4), కుశాల్ మెండిస్ (11) విఫలమైనా.. పాథుమ్ నిశాంక (77 రన్స్, 83 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), సదీర విక్రమార్క (65 రన్స్, 54 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకాలు బాదడంతో లంక సునాయసంగా విజయం సాధించింది. ఆరంభంలో రెండు వికెట్లు కోల్పోయి లంక ఇబ్బందుల్లో పడింది. ఈ దశలో నిశాంక, విక్రమార్క క్రీజులో నిలదొక్కుకుని నిలకడగా బౌండరీలు బాది జట్టును విజయ తీరాలకు చేర్చారు. ఇంగ్లండ్ బౌలర్లలో డేవిడ్ విల్లీ రెండు వికెట్లు పడగొట్టాడు.

తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 33.2 ఓవర్లలో 156 పరుగులకే కుప్పకూలింది. బ్యాటింగ్‌కు స్వర్గధామమైన చిన్నస్వామి స్టేడియంలో శ్రీలంక పేసర్ల ధాటికి ఇంగ్లండ్ బ్యాటర్లు చేతులెత్తేశారు. ఒక్కరు కూడా అర్ధ శతకం చేయలేకపోయారు. బెన్‌స్టోక్స్ (43 రన్స్, 73 బంతుల్లో 6 ఫోర్లు) టాప్ స్కోరర్. జానీ బెయిర్‌స్టో (30 రన్స్, 31 బంతుల్లో 3 ఫోర్లు), డేవిడ్ మలన్ (28 రన్స్, 25 బంతుల్లో 6 ఫోర్లు) కాసేపు నిలకడగానే ఆడినా ఎక్కువ సమయం క్రీజులో నిలదొక్కుకోలేకపోయారు. జోరూట్ (3,) జోస్ బట్లర్ (8), లియామ్ లివింగ్‌స్టోన్ (1) ఘోరంగా విఫలమయ్యారు. తర్వాత వచ్చిన మొయిన్ అలీ (15 రన్స్ 15 బంతుల్లో) కూడా ఆకట్టుకోలేకపోయాడు. క్రిస్ వోక్స్ (0), ఆడిల్ రషీద్ (2), మార్క్ వుడ్ (5), డేవిడ్ విల్లీ (14) పరుగులు చేశారు. శ్రీలంక బౌలర్లలో లాహిరు కుమార 3, ఏంజెలో మాథ్యూస్ 2, కాసున్ రజిత 2, మహీశ్ తీక్షణ ఒక వికెట్ పడగొట్టారు.

సెమీస్ అవకాశాలు మరింత సంక్లిష్టం

శ్రీలంకపై ఓటమితో ఇంగ్లండ్ సెమీస్ అవకాశాలు మరింత సంక్లిష్టమయ్యాయి. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన ఇంగ్లండ్.. ఇప్పటివరకు ఐదు మ్యాచ్‌లు ఆడి ఒకే మ్యాచ్‌లో నెగ్గింది. అది కూడా బంగ్లాదేశ్‌పై. కివీస్, ఆఫ్ఘనిస్థాన్, దక్షిణాఫ్రికా, శ్రీలంక చేతుల్లో ఓడింది. మిగిలిన నాలుగు మ్యాచుల్లో విజయం సాధిస్తేనే సెమీస్‌కు వచ్చే అవకాశాలున్నాయి. అయితే, ఆ నాలుగు మ్యాచుల్లో ఇంగ్లండ్ విజయం సాధించడం అంత సులువు కాదు. భారత్, ఆస్ట్రేలియా, నెదర్లాండ్స్, పాకిస్థాన్‌తో ఆ జట్టు తలపడాల్సి ఉండటమే ఇందుకు కారణం.

ఇంగ్లండ్ తన తర్వాతి మ్యాచ్‌లో టీమ్ ఇండియాతో తలపడనుంది. వరుస విజయాలతో జోరు మీదున్న రోహిత్ సేనపై పైచేయి సాధించాలంటే ఇంగ్లండ్ శక్తికి మించి కృషి చేయాల్సిందే. మరోవైపు, మొదటి రెండు మ్యాచుల్లో ఓడిన ఆసీస్.. తర్వాత మూడు మ్యాచుల్లో నెగ్గి సెమీస్ రేసులో ముందుకొచ్చింది. నెదర్లాండ్స్‌ను కూడా తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. సౌతాఫ్రికాను డచ్ జట్టు ఎలా చిత్తుగా ఓడించిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. పాకిస్థాన్ కూడా తనదైన రోజు ఎంత పెద్ద జట్టునైనా ఓడించగలదు. ఈ సవాళ్లను అధిగమించి ఇంగ్లండ్ సెమీస్‌కు వస్తే అది అద్భుతమే అవుతుంది.

పారా ఆసియా క్రీడల్లో భారత్ రికార్డు

80కు చేరిన పతకాలు

హాంగ్‌జౌ : చైనాలో జరుగుతున్న పారా ఆసియా క్రీడల్లో భారత్ పతక దూకుడు కొనసాగిస్తోంది. ఈ క్రీడల్లో గురువారంతో భారత్ సాధించిన పతకాల సంఖ్య 80కు చేరుకుంది. ఇందులో 18 బంగారు, 23 రజతాలు, 39 కాంస్య పతకాలు ఉన్నాయి. 2018లో భారత్ ఈ క్రీడల్లో 72 పతకాలు (15 బంగారం, 24 రజతం, 33 కాంస్య) సాధించింది. ఇప్పటి వరకూ అదే అత్యధికం. తాజా క్రీడల్లో భారత్ తన రికార్డును తానే అధిగమించింది. గురువారం ముందుగా సచిన్ సర్జేరావు ఖిలారి స్వర్ణం సాధించాడు. పురుషుల ఎఫ్46 షాట్‌పుట్‌లో 16.03 మీటర్లు (ఈ గేమ్స్‌లో రికార్డు) విసిరి ప్రథమ స్థానంలో నిలిచాడు. భారత్‌కు చెందిన రోహిత్ కుమార్ 14.56 మీటర్లు విసిరి కాంస్యం సొంతం చేసుకున్నాడు. అలాగే ఆర్6 మిక్స్‌డ్ 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ ఎస్‌హెచ్1 విభాగంలో సిద్దార్థ బాబు 247.7 పాయింట్లతో భారత్‌కు మరో బంగార పతకం అందించాడు. సీతల్ దేవి–రాకేష్ కుమార్‌ల కామ్‌పౌండ్ మిక్స్‌డ్ టీమ్ కూడా బంగారు పతకం సాధించింది. మిగిలి అంశాల్లో కూడా భారత్ పారా క్రీడాకారులు పతకాలు సాధించడంతో పతకాలు సంఖ్య 80కు చేరుకుంది. ఈ క్రీడలు ఇంకా రెండు రోజుల పాటు జరుగుతుండటంతో భారత్ పతకాల సంఖ్య 100 దాటుతుందని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

భారత్-శ్రీలంక మ్యాచ్ టిక్కెట్ల విడుదల

ముంబయి : వన్డే ప్రపంచకప్‌లో భారత్–శ్రీలంక జట్ల మధ్య మ్యాచ్ ముంబయి వేదికగా జరగనుంది. నవంబర్ 2న జరిగే ఈ మ్యాచ్‌కు సంబంధించిన టిక్కెట్లను బీసీసీఐ విడుదల చేసంది. గురువారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆన్‌లైన్ వేదికగా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ విధంగా భారత్ మ్యాచ్‌కు వారం ముందే టికెట్లను విడుదల చేయడం ఇది రెండోసారి. గతంలో పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌కూ ఖాళీలనుబట్టి టికెట్లను మరోసారి అందుబాటులోకి తీసుకొచ్చింది. భారత్–ఆసీస్ మ్యాచ్ సందర్భంగా కొన్ని సీట్లు ఖాళీగా కనిపించాయి. ఆన్‌లైన్‌లో మాత్రం అన్నీ బుక్ అయినట్లు చూపించడం గమనార్హం.

వన్డే ప్రపంచ కప్‌లో నేడు...

సౌతాఫ్రికా × పాకిస్థాన్

వేదిక : చెన్నై, సమయం : 2.00 గంటలకు

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68